www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 29-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 121 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి రా.12.47 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తర రా.7.28 తదుపరి హస్త, వర్జ్యం: తె. 4.42-6.28, దుర్ముహూర్తం: ఉ. 8.31-9.22, రా.10.25-11.08, అమృతఘడియలు: ఉ.11.42-1.25, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.57, సూర్యాస్తమయం: 6.45 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



దివ్య.. విశ్వ విజేత

నాగపూర్ టీనేజర్‌కు చెస్ వరల్డ్ కప్

ఫైనల్లో హంపిపై విజయం

గ్రాండ్‌మాస్టర్ హోదా కైవసం

11

రాష్ట్రపతిని కలుద్దాం

బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రం మీద ఒత్తిడి పెంచుదాం.. మూడు రోజులు ఢిల్లీలోనే

“ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ హైకోర్టు తేదీలను ప్రకటిస్తోంది. కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి ద్వారా బిల్లులను ఆమోదింపజేయాలని కేంద్రాన్ని క్యాబినెట్ ముక్త కంఠంతో కోరుతోంది.



క్యాబినెట్ భేటీ వివరాలను మీడియాకు తెలియజేస్తున్న మంత్రి పొన్నం. చిత్రంలో మంత్రులు వాకిటి, కొండా సురేఖ

ఆగస్టు 5న పార్లమెంటులో వాయిదా తీర్మానాలు

6న జంతర్ మంతర్ వద్ద ప్రజా ప్రతినిధుల ధర్నా

ఏడో తేదీన 200 మంది నాయకులతో రాష్ట్రపతి వద్దకు

బీసీ రిజర్వేషన్ బిల్లులను వెంటనే ఆమోదించాలని వినతి

కార్యాచరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

బీజేపీ బీసీ ఎంపీలూ బిల్లుల ఆమోదానికి సహకరించండి

అసెంబ్లీలో మద్దతిచ్చి.. ఢిల్లీలో మోకాలడ్డుతున్న బీజేపీ

ఆమోదించినప్పుడు పరిమితి గురించి తెలియదా!?

మీడియాతో మంత్రులు పొన్నం, వాకిటి, కొండా సురేఖ

ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి తరలి రావాలని పిలుపు

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కార్యాచరణను ఖరారు చేసింది. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో చేపట్టాల్సిన కార్యాచరణకు ఆమోదం తెలిపింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఆగస్టు ఐదో తేదీన పార్టీ ఎంపీల ద్వారా పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదా తీర్మానాలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులందరితో ఆగస్టు 6న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఆగస్టు ఏడో తేదీన ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా దాదాపు 200 మంది ప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోరుతూ వినతి పత్రం అందించాలని నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకు ముఖ్యమంత్రి సహా లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత, రాజ్యసభ పక్షనేత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరతారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. నాలుగున్నర గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై

మిగతా 13వ పేజీలో...

ప్రత్యేక రైలులో ఢిల్లీకి!

ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నాయకులు అందులోనే ప్రయాణం

వీలైతే.. పలువురు మంత్రులు కూడా అదే రైలులో.. 13

రాష్ట్రపతితో భేటీ తర్వాత పార్టీ అధిష్ఠానంతో చర్చించే అవకాశం

సీతారామ సవరణ అంచనాలకు ఆమోదం

రూ.13,058 కోట్ల నుంచి రూ.19,325 కోట్లకు పెంపు

ఇక పంట కాలువల ఆధునీకరణతో పాటు మరమ్మతుల పనులు 13

ముఖ్యమంత్రి రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



చలపతిరావు

రామకృష్ణారెడ్డి

ప్రవీణ్‌కుమార్

గౌస్ మొహియుద్దీన్

హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిలు

చలపతిరావు, రామకృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్, గౌస్ మొహియుద్దీన్‌ల నియామకం

కొలీజియం సిఫారసులకు రాష్ట్రపతి ఆమోదం

నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర న్యాయశాఖ

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. న్యాయవాదుల కోటాలో గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. హైకోర్టు న్యాయవాదులుగా ఉన్న వీరిని అదనపు జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు తాజాగా రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. దీంతో ఈ నలుగురు అదనపు న్యాయమూర్తుల నియామకాలను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టులో మొత్తం ఉండాల్సిన న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా ప్రస్తుతం 26 మంది

మిగతా 13వ పేజీలో...



ప్రజల వద్దకు కాంగ్రెస్ 12

31 నుంచి ఆగస్టు 6 వరకు నియోజకవర్గాల్లో పాదయాత్ర

పాల్గొననున్న మహేశ్‌గౌడ్, మీనాక్షి, మంత్రులు, నేతలు

పరిగిలో యాత్ర ప్రారంభం

ఇతర రాష్ట్రాల్లోనూ సృష్టి దందా

తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల్లో నమ్రతకు ఏజెంట్లు

అబార్షన్ కోసం వెళ్లేవారికి డబ్బు ఆశ చూపించి వల

నాలుగైదేళ్ల క్రితం కూడా హైదరాబాద్‌లో ఇదే తరహాలో శిశువిక్రయాలకు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు

నిందితుల విచారణకు కోర్టులో కస్టడీ పిటిషన్

'సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌లో ఏం జరుగుతోంది సార్?'.. పోలీసులను ప్రశ్నిస్తున్న పలువురు దంపతులు

ఫర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు! 14

'సృష్టి' ఘటన నేపథ్యంలో సర్కారు సీరియస్

రాష్ట్రవ్యాప్తంగా 292 కేంద్రాలు.. గ్రేటర్‌లోనే 213



బిచ్చగాళ్ల వీర్యం.. అడ్డాకూలీల అండం!

ఫర్టిలిటీ దందాలో వికృత పార్శ్వాలు

అప్పుడో మాట.. ఇప్పుడో మాట!

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాట మార్చిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

కేసీఆర్ తన ఫోన్ ట్యాప్ చేయించారని గతంలో ఫిర్యాదు

ఇప్పుడు అదే లేదని వెల్లడి

కాంగ్రెస్, బీజేపీ కలిసి ట్యాపింగ్ చేస్తున్నాయని ఆరోపణ

సిట్ విచారణకు హాజరు 12

నివాసం ఉండకుంటే ఇళ్ల కేటాయింపు రద్దు?

లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు

37% మేర 2 పడకల ఇళ్లు ఖాళీ

శివార్లలోని ఇళ్లకు వెళ్లేందుకు లబ్ధిదారుల అనాసక్తి 14



అంతర్గత కమిటీ ఏర్పాటు

రాజ్యాంగ విరుద్ధమా?

అలాగైతే దాని ముందు ఎందుకు హాజరయ్యారు?

విచారణ పూర్తయ్యేదాకా ఎందుకు వేచి చూశారు?

జస్టిస్ యశ్వంత్ వర్మను నిలదీసిన సుప్రీంకోర్టు

పిటిషన్‌లో తన పేరు దాచి.. 'ఎక్స్‌ఎక్స్‌ఎక్స్'గా పేర్కొన్న వర్మ

న్యూఢిల్లీ, జూలై 28: తన అధికారిక నివాసంలో కట్టలు కట్టలుగా డబ్బు దొరికిన వ్యవహారంలో పార్లమెంటు అభిశంసనను ఎదుర్కోబోతున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టు కొన్ని సూటి ప్రశ్నలు సంధించింది. నాడు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వర్మ ఇంట్లో (ఢిల్లీలో) ఈ ఏడాది మార్చి 14వ తేదీ సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. మంటలార్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి కట్టలకొద్దీ డబ్బు దొరికింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ అంశంపై విచారణకు అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా.. పంజాబ్-హరియాణా

మిగతా 2వ పేజీలో...

ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు

ఎంతవరకైనా వెళ్తాం



22 నిమిషాల్లో పాకిస్థాన్‌లోని 7 ఉగ్రస్థావరాలు ధ్వంసం చేశాం

మన దాడులతో కాళ్ల బేరానికి పాక్.. ట్రంప్ ప్రమేయం లేదు

'సిందూర్'కు విరామమే.. దాయాది తోక జాడిస్తే మళ్లీ ప్రారంభం

మన సైనికుల సత్తాపై విపక్షాలకు అనుమానమా?

లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్


మన విమానాలు ఎన్ని కూలాయి?: కాంగ్రెస్

ఆపరేషన్ మహాదేవ్.. పహల్గాం ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్

సూత్రధారి సులేమాన్ సహా ముగ్గురి హతం 2

పాదరసంతో బంగారం!

- సిలికాన్ వ్యాలీ స్టార్టప్ ప్రకటన
- న్యూక్లియర్ ట్రాన్స్‌మ్యుటేషన్‌తో మేలిమి బంగారం తయారీ



శాన్‌ఫ్రాన్సిస్కో, జూలై 28: సిలికాన్ వ్యాలీకి చెందిన మారథాన్ ఫ్యూజన్ అనే స్టార్టప్ కంపెనీ సంచలన ప్రకటన చేసింది. పాదరసాన్ని బంగారంగా మార్చే సాంకేతికతను అభివృద్ధి చేశామని వెల్లడించింది. తమ ప్రయోగాలు కార్యరూపం దాలిస్తే.. బంగారం ధరలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలున్నట్లు తెలిపింది. అయితే.. పాదరసంతో తాము తయారు చేసేది మేలిమి బంగారమే అయినా.. ఫ్యూజన్ రియాక్టర్ వినియోగం కారణంగా.. 14-18 ఏళ్ల వరకు అందులో రేడియో ధార్మికత ఉండే ప్రమాదముందని.. అప్పటి వరకు దీన్ని వాణిజ్యపరంగా వినియోగించేందుకు అవకాశముండదని స్పష్టం చేసింది. పాదరసం-198 అనే ఐసోటోప్‌ను తొలుత పాదరసం-197గా మార్చాల్సి ఉంటుందని, ఆ తర్వాత దాన్ని బంగారం-197 ఐసోటోప్‌గా రూపాంతరం చెందేలా చేయవచ్చని మారథాన్ ఫ్యూజన్ వెల్లడించింది. మూలకాల మార్పిడి(న్యూక్లియర్ ట్రాన్స్‌మ్యుటేషన్) ద్వారా ఇది సాధ్యమని పేర్కొంది. ఈ ప్రక్రియ ద్వారా ఏటా 5 వేల కిలోల మేర బంగారాన్ని ఉత్పత్తి చేయవచ్చని తెలిపింది. మారథాన్ ఫ్యూజన్ స్టార్టప్ ఇప్పటి వరకు 6 మిలియన్ డాలర్ల పెట్టుబడులు, 4 మిలియన్ డాలర్ల ప్రభుత్వ నిధులను సాధించడం గమనార్హం..!

స్టార్ లింక్ 20 లక్షల కనెక్షన్లకే పరిమితం

న్యూఢిల్లీ, జూలై 28: మస్క్ సారథ్యంలో నడుస్తున్న శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థ 'స్టార్ లింక్'.. దేశంలో కేవలం 20 లక్షల కనెక్షన్లు మాత్రమే అందిస్తుందని కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. దీనివల్ల బీఎస్ఎన్ఎల్, ప్రైవేటు టెలికం సంస్థలకు ముప్పేమీ లేదని చెప్పారు. బీఎస్ఎన్ఎల్‌పై సోమవారం జరిగిన సమీక్షా సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టార్ లింక్ గరిష్ఠంగా 200 ఎంబీపీఎస్ వేగంతో 20 లక్షల కనెక్షన్లు మాత్రమే ఇస్తుందన్నారు. బీఎస్ఎన్ఎల్ గణనీయ సేవలందిస్తున్న గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలందించడానికి స్టార్ లింక్ వస్తోంది. స్టార్ లింక్ ప్రారంభ ఖర్చు ఏటా రూ.3000 వరకూ ఉండొచ్చునని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కాగా, బీఎస్ఎన్ఎల్‌లో దేశీయ టెక్నాలజీ సేవలనే వినియోగిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశమంతా 2జీ, 3జీ సేవల విస్తరణకు చైనా సంస్థల టెక్నాలజీని వినియోగించుకున్న బీఎస్ఎన్ఎల్.. దాన్ని క్రమంగా తగ్గిస్తుదని పెమ్మసాని వివరించారు.

గూగుల్ స్ట్రీట్ వ్యూలో అర్జెంటీనా వ్యక్తి నగ్న ఫొటో

- రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు

బ్యూనస్ ఎయిర్స్, జూలై 28: తన నగ్న చిత్రాన్ని గూగుల్ స్ట్రీట్ వ్యూ ఫొటోల్లో ఉంచారంటూ అర్జెంటీనాకు చెందిన ఓ వ్యక్తి కోర్టుకెక్కి.. పరిహారం పొందారు. సదరు వ్యక్తి నగ్న ఫొటోను చిత్రీకరించి స్ట్రీట్ వ్యూ ఫొటోల్లో ఉంచినందుకు గూగుల్‌ను దోషిగా నిర్ధారించి.. బాధితుడికి నష్ట పరిహారంగా 12,500 అమెరికా డాలర్లు (రూ.10,81,750) చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. పోలీసు అధికారి అయిన బాధితుడు బ్రాగాడో పట్టణంలో ఉండే వారు. అయితే 2017లో ఆయన తన ఇంటి ముందు పెరటిలో పనిచేస్తుండగా వీధి గుండా గూగుల్ స్ట్రీట్ వ్యూ వాహనం ఫొటోలు తీస్తూ వెళ్లింది. ఈ సమయంలోనే ఆయన బట్టలు లేకుండా ఉన్న ఫొటోను కూడా తీసింది. అనంతరం ఆ ఫొటోను ఆన్‌లైన్‌లో పోస్టు చేసింది. అందులో అతడి ఇంటి నంబర్‌తో పాటు వీధి పేరు కూడా స్పష్టంగా కనిపించింది. కొద్ది రోజుల్లోనే సోషల్ మీడియాలో ఇది వైరల్‌గా మారింది. టీవీ చానెళ్లలోనూ కథనాలు వెలువడ్డాయి. దీంతో తన పరువుకు భంగం కలిగిందంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు.

బిహార్‌లో కుక్కకు రెసిడెన్స్ సర్టిఫికెట్ జారీ!

- 'డాగ్‌బాబు' పేరుతో అప్లికేషన్.. అమోదించిన ఆఫీసర్లు

పట్నా, జూలై 28: కుక్క ఫొటోతో అధికారులు ఓ నివాస ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఫొటోకు తగ్గట్లుగా పేరు, తల్లిదండ్రుల పేర్లూ ఉండటం ఇక్కడ మరింత విశేషం!! దరఖాస్తుదారు పేరు 'డాగ్ బాబు', తండ్రి పేరు 'కుత్తా బాబు', తల్లి పేరు 'కుతియా దేవి' అని ఆ పత్రంలో పొందుపరిచారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో జరిగిందీ చోద్యం. సర్టిఫికెట్‌లో రెవెన్యూ అధికారి మురారీ చౌహాన్ డిజిటల్ సంతకం కూడా ఉంది. ఆ పత్రంలో చిరునామాను మొహల్లా కౌలిచౌక్, వార్డు నంబరు 15, మసౌర్హి నగర పరిషత్‌గా పేర్కొన్నారు. ఈ 'శునక నివాస ధ్రువీకరణ పత్రం' కోసం ఢిల్లీకి చెందిన ఓ మహిళ, ఆమె భర్త ఆధార్ కార్డులు, ఇతర పత్రాలను జత చేస్తూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం మరో విశేషం. జూలై 24న ఈ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పట్నా జిల్లా మెజిస్ట్రేట్ త్యాగరాజన్ పేర్కొన్నారు. జారీ చేసిన రెండు నిమిషాల్లోనే సర్టిఫికెట్‌ను రద్దు చేశామని, ప్రమేయం ఉన్న అధికారులను సస్పెండ్ చేశామని చెప్పారు.

నటి రమ్యపై దర్శన్ ఫ్యాన్స్ అసభ్య పోస్టులు

బెంగళూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): కన్నడ సినీనటి, మాజీ ఎంపీ రమ్యకు వ్యతిరేకంగా నటుడు దర్శన్ అభిమానులు అసభ్య మెసేజ్‌లు పోస్టు చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి చౌదరి...విచారించి చర్యలు తీసుకోవాలని బెంగళూరు నగర పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. దర్శన్ బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ సందర్భంగా 'హైకోర్టు చేసిన తప్పిదాలను మేము చేయబోము. దర్శన్‌కు ఎలా బెయిల్ ఇచ్చారు..?' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను కోట్ చేస్తూ, 'సామాన్య కుటుంబానికి న్యాయం జరగనుంది' అని రమ్య పోస్టు చేశారు. దీంతో ఆగ్రహించిన దర్శన్ అభిమానులు, ఆమెకు వ్యతిరేకంగా అసభ్యకర పోస్టులు పెట్టారు. కాగా, ఈ వ్యవహారంపై నటి రమ్య ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ అన్నారు.

బ్యాంకాక్‌లో కాల్పులు.. ఆరుగురి మృతి

బ్యాంకాక్, జూలై 28: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఓర్ టోర్ కోర్ మార్కెట్లో సోమవారం ఓ గుర్తుతెలియని దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఆ తర్వాత తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ ఘటనలో దుండగుడితో పాటు మొత్తం ఆరుగురు మరణించినట్లు పోలీసులు తెలిపారు. వారిలో నలుగురు సెక్యూరిటీ గార్డులు, ఒక మహిళ ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం థాయ్‌లాండ్ - కంబోడియా సరిహద్దుల్లో ఏర్పడ్డ ఘర్షణలకు ఈ కాల్పులకు సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

థాయ్‌లాండ్, కాంబోడియా కాల్పుల విరమణ

బ్యాంకాక్, జూలై 28: థాయ్‌లాండ్, కాంబోడియా కాల్పుల విరమణకు అంగీకరించాయి. మలేషియా మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చల్లో బేషరతుగా, తక్షణమే కాల్పుల విరమణకు ఇరుదేశాలూ అంగీకారం తెలిపాయి. మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఇబ్రహీం నివాసంలో సోమవారం జరిపిన చర్చల్లో కాంబోడియా ప్రధానమంత్రి హున్ మానెట్, థాయ్‌లాండ్ తాత్కాలిక ప్రధానమంత్రి ఫుంతం వెచయచాయ్‌లతోపాటు మలేషియాలోని చైనా, అమెరికా రాయబారులు కూడా పాల్గొన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చొరవతో ఈ చర్చలు జరిగాయి' అని మానెట్ పేర్కొన్నారు.

డిసెంబరులో అంతరిక్షంలోకి 'వ్యోమమిత్ర'

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఈ ఏడాది డిసెంబరులో ముందుగా 'వ్యోమమిత్ర' అనే రోబోను అంతరిక్షంలోకి పంపుతామని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ డిసెంబరులో రోబోను నింగిలోకి పంపుతాం. ఈ ప్రయోగం విజయవంతమైతే వచ్చే ఏడాది మరో రెండు మానవ రహిత (అన్‌క్రూడ్ మిషన్) ప్రయోగాలు చేపడతాం. 2027లో వ్యోమగాములతో కూడిన గగన్‌యాన్ మిషన్ ఉంటుంది' అని వెల్లడించారు.

ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతవరకైనా వెళ్తాం

22 నిమిషాల్లో పాక్‌లోని 7 ఉగ్రస్థావరాలు ధ్వంసం



ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

- మన సైనికుల పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది
- కాల్పుల విరమణలో ట్రంప్ ప్రమేయం లేదు
- సైనికుల సత్తాపై విపక్షాలకు అనుమానమా?
- పాక్ విమానాలు ఎన్ని కూల్చారని ప్రశ్నించరేం?
- లోక్‌సభలో విపక్షాలపై రాజ్‌నాథ్ ధ్వజం

న్యూఢిల్లీ, జూలై 28: ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకలించివేసేందుకు నవీన భారతదేశం ఎంత వరకైనా వెళ్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. భారత సాయుధ దళాలు ఉగ్రవాద స్థావరాల ధ్వంసం విషయంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంతో ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చామని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ మాట్లాడారు. పాకిస్థాన్‌పై తీసుకున్న సైనిక చర్యతో భారత్ తన రక్షణ కోసం ఎంతకైనా తెగిస్తుందని ఉగ్రవాదులు, వారి మద్దతుదారులకు గట్టి సందేశం ఇచ్చినట్లయిందని చెప్పారు. శాంతి వచనాలను అర్థం చేసుకోలేని వారిపై కఠిన చర్యలు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. "మే 7న రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయి. పీవోకే, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపాయి. ఏడు ఉగ్ర శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశాయి. కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశాయి. సైన్యానికి అభినందనలు. దేశ ప్రజలను రక్షించడం మా ప్రభుత్వ బాధ్యత" అని రాజ్‌నాథ్ తెలిపారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చింది తానేనన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. మనపై ఎవరి ఒత్తిడీ లేదని స్పష్టం చేశారు. పాక్ మళ్లీ తోక జాడిస్తే మళ్లీ ఆపరేషన్‌ను కొనసాగిస్తామన్నారు. "ఆపరేషన్ సిందూర్‌తో మన వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది. ఉగ్ర శిబిరాల్లోకి చొచ్చుకెళ్లి మరీ ఉగ్రవాదులను హతమార్చాం" అని రాజ్‌నాథ్ చెప్పారు. "మనం చేసిన దాడులతో పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మనకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణ చేసుకుందామని మన డీజీఎంవోను కోరారు" అని స్పష్టం చేశారు.

పాక్ విమానాల గురించి అడగరేం?

మన సైనికుల సత్తాపై అనుమానాలు వ్యక్తం చేయడం, ప్రశ్నించడం సరికాదని రాజ్‌నాథ్ విపక్షాలకు హితవు పలికారు. "ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల పని. కానీ, మన ప్రతిపక్ష సభ్యులు మాత్రం మన యుద్ధ విమానాలు ఎన్ని కూలిపోయాయని పదేపదే ప్రశ్నిస్తుంటారు. మన దళాలు ఎన్ని పాకిస్థానీ విమానాలను కూల్చేశారని మాత్రం అడగరు" అని విపక్షాలపై ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నామని.. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదని అన్నారు. 'ఏ పరీక్షలో అయినా ఫలితం ముఖ్యం. అంతేకానీ పెన్సిల్ విరిగిందా?, పెన్ను పోయిందా? అన్నది విషయం కాదు' అని వ్యాఖ్యానించారు. మన వైమానిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని పాక్ క్షిపణులు, డ్రోన్లు ఇతర దీర్ఘశ్రేణి ఆయుధాలను వాడిందని.. వాటన్నింటినీ మన బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయని చెప్పారు.

అమెరికాకు సంబంధమే లేదు: జైశంకర్

ఆపరేషన్ సిందూర్‌కు, అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. వాణిజ్యంపై ఏ దశలోనూ, ఎన్నడూ అమెరికాతో చర్చలే జరపలేదని లోక్‌సభలో తెలిపారు. అలాగే అమెరికా అధ్యక్షుడి నుంచి ప్రధాని మోదీకి ఎలాంటి ఫోన్ కాల్ రాలేదని తేల్చిచెప్పారు. పాక్ డీజీఎంవో నుంచి విజ్ఞప్తి వచ్చిన తర్వాతే కాల్పుల విరమణ పాటించినట్లు చెప్పారు. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యల నేపథ్యంలో జైశంకర్ ఈ మేరకు వివరణ ఇచ్చారు. ఐక్యరాజ్య సమితిలో 190 దేశాలకు గాను 187 దేశాలు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చాయని గుర్తుచేశారు. జైశంకర్ మాట్లాడుతుండగా.. ప్రతిపక్ష సభ్యులు అంతరాయం కలిగిస్తుండడంతో హోంమంత్రి అమిత్ షా కల్పించుకున్నారు. తన సీటు నుంచి లేచి నిలబడి మాట్లాడుతూ.. "మన విదేశాంగ శాఖ మంత్రిపై ప్రతిపక్షాలకు నమ్మకం లేదు. వారికి వేరే దేశంపై ఉంది. వారి పార్టీలో విదేశానికి ఉండే ప్రాధాన్యం నాకు తెలుసు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.


మన యుద్ధ విమానాలు ఎన్ని కూలాయి



గౌరవ్ గొగోయ్

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై చేసిన దాడుల్లో మన యుద్ధ విమానాలు ఎన్ని కూలాయని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ ప్రశ్నించారు. నిఘా వర్గాల వైఫల్యం వల్లే పహల్గాం ఉగ్రదాడి జరిగిందని, దీనికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. "పహల్గాంకు ఉగ్రవాదులు వచ్చి ఎలా దాడి చేయగలిగారో రాజ్‌నాథ్ చెప్పలేదు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు మేం తప్పకుండా కొన్ని ప్రశ్నలు అడుగుతాం. ప్రభుత్వం వాటికి కచ్చితంగా సమాధానం చెప్పాలి" అని గొగోయ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోయి 100 రోజులు గడిచిందని.. ఇప్పటివరకు దాడికి కారకులను ప్రభుత్వం పట్టుకోలేకపోయిందని ప్రశ్నించారు. "ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని చెబుతున్నారు. అలాంటప్పుడు ఇది విజయవంతమైందని ఎలా ప్రకటిస్తున్నారు" అని అడిగారు. పాకిస్థాన్ మనదేశం ముందు మోకరిల్లేందుకు సిద్ధమైనప్పుడు.. 'మీరెందుకు యుద్ధాన్ని ఆపారు? ఎవరికి లొంగిపోయారు?' అన్న విషయాన్ని ప్రధాని మోదీ వెల్లడించాలని డిమాండ్ చేశారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 26 సార్లు ప్రకటించారని, ఐదారు యుద్ధ విమానాలు కూలిపోయాయని కూడా చెప్పారని గుర్తు చేశారు.

లోకం తీరు



పహల్గాం ఉగ్రవాదుల ఖేల్ ఖతం

- ఆపరేషన్ మహాదేవ్‌లో సులేమాన్ సహా ముగ్గురి మృతి

శ్రీనగర్, జూలై 28: పహల్గాం ఉగ్రదాడితో 26 మందిని పొట్టనబెట్టుకున్న ముష్కరులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. 'ఆపరేషన్ మహాదేవ్' పేరుతో సోమవారం ఉదయం చేపట్టిన దాడుల్లో.. పహల్గాం మాస్టర్‌మైండ్ సులేమాన్ షా, మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతిచెందిన మిగతా ఇద్దరు ఉగ్రవాదులను యాసిర్ అలియాస్ హరీస్, అబూ హమ్జాగా అనుమానిస్తున్నారు. నెల రోజులుగా భద్రతాబలగాలు సులేమాన్, ఇతర ఉగ్రవాదుల కోసం వేటను ప్రారంభించాయి. ఈ క్రమంలో దాచిగామ్ అడవులను జల్లెడ పట్టాయి. దట్టమైన అడవుల్లో.. హర్వాన్ ప్రాంతంలో శాటిలైట్ సిగ్నల్స్ వెళ్తున్నట్లు గుర్తించిన బలగాలు.. 14 రోజులుగా ఆ ప్రాంతంపై నిఘా పెట్టి, ఉగ్రవాదులను ట్రాక్ చేశాయి. రెండ్రోజుల క్రితం నుంచి ఉగ్రవాదుల షెల్టర్ వద్ద దాడికి వ్యూహాన్ని రచించాయి. ఈ క్రమంలో స్థానిక సంచార జాతుల సహాయం తీసుకున్నాయి. ఉగ్రవాదులు పైన టెంట్ వేసుకుని, భూమిలో తవ్విన గొయ్యిలో నక్కినట్లు గుర్తించాయి. సోమవారం ఉదయం 11.30 సమయంలో రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన 24 బృందాలు, నాలుగు పారా రెజిమెంట్ బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో సంయుక్తంగా 'ఆపరేషన్ మహాదేవ్'ను చేపట్టాయి. ఉగ్రవాదుల షెల్టర్‌పై కాల్పులు జరిపారు. ఈ దాడిలో సులేమాన్ సహా.. ముగ్గురు ఉగ్రవాదులు చనిపోయారు. అయితే.. 'ఆపరేషన్ మహాదేవ్' గురించి భద్రతాబలగాలు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మృతదేహాల పోస్టుమార్టం పూర్తయ్యాక.. వారిని సులేమాన్, అబూహమ్జా, యాసిర్‌గా తేలితే.. అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది.

బిహార్ ఓటరు జాబితా సవరణలో ఆధార్‌ను అంగీకరించాల్సిందే

- ఎన్నికల సంఘానికి సుప్రీం ఆదేశాలు
- ముసాయిదా జాబితాపై స్టేకు నిరాకరణ

న్యూఢిల్లీ, జూలై 28: బిహార్ ఎన్నికల నేపథ్యంలో.. ఓటరు జాబితా సవరణకు ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను చెల్లుబాటయ్యే పత్రాలుగా అంగీకరించేందుకు విముఖత చూపుతున్న భారత ఎన్నికల సంఘం (ఈసీ)పై సుప్రీంకోర్టు సోమవారం సీరియస్ అయింది. 'ఒకవేళ ఫోర్జరీ చేయదలచుకుంటే ఎలాంటి పత్రాలనైనా చేయొచ్చు కదా..?' అని ప్రశ్నించింది. ఆధార్‌తోపాటు ఓటరు ఐడీ కార్డుని చెల్లుబాటయ్యే డాక్యుమెంట్లుగా పరిగణించాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే.. ఎన్నికలకు ముందు బిహార్‌లో ఓటరు ముసాయిదా జాబితా ప్రచురణపై మధ్యంతర స్టే ఇవ్వడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈసీ చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై మంగళవారం (జూలై 29న) జరిగే విచారణ సందర్భంగా దీనిపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం వెల్లడించింది. మరోవైపు, ఈసీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదనలు వినిపిస్తూ.. ఆధార్ పౌరసత్వానికి రుజువు కాదని, ఇది ఓటరు జాబితాను సవరించే అంశం కాబట్టి.. ఓటర్ ఐడీ కార్డులపై ఆధారపడడం లేదని అన్నారు. ఇక రేషన్ కార్డు విషయానికి వస్తే వాటికి నకిలీలు సృష్టించే అవకాశం లేకపోలేదని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఆధార్‌ను కేవలం గుర్తింపు పత్రంగానే పరిగణిస్తామని వెల్లడించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఈ భూమిపై ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేరో చెప్పాలని ఈసీని ప్రశ్నించింది. బిహార్ ఎస్ఐఆర్‌లో ఆధార్, ఓటర్ ఐడీలను చెల్లుబాటయ్యే డాక్యుమెంట్ల కింద చేర్చాలని స్పష్టం చేసింది. 'రేషన్ కార్డులను సులభంగా ఫోర్జరీ చేయొచ్చని మేం చెప్పగలం. కానీ.. ఆధార్, ఓటర్ ఐడీ కార్డులు అలా కాదు. వాటికి కొంత విశ్వసనీయత ఉంది. కాబట్టి ఈ పత్రాలను అంగీకరించండి' అని ధర్మాసనం పేర్కొంది.

వీధి కుక్కల బెడద ఆందోళనకరం

- సుప్రీం వ్యాఖ్య.. విచారణకు నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 28: వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కుక్క కాట్ల కేసుల సంఖ్య ఆందోళనకరంగా ఉందని తెలిపింది. ఈ కారణంగా పిల్లలు, వృద్ధులు రేబిస్ వ్యాధికి గురవుతున్నారని, దీన్ని అరికట్టాల్సి ఉందని పేర్కొంది. ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లో వీధి కుక్కల బెడదపై ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించింది. కుక్కల సమస్య అధికంగా ఉందని ఫిర్యాదులు అందుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆ పత్రిక పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు అడ్డుకుంటుండడం, సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్‌లు వస్తుండడంతో అధికారులు వీధి కుక్కలపై చర్యలు తీసుకోలేకపోతున్నారని ఆ వార్తలో ప్రస్తావించారు. కాగా, కేంద్ర మంత్రి ఎస్.పి.సింగ్ బఘేల్ ఈ నెల 22న పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ గత ఏడాది దేశ వ్యాప్తంగా 37 లక్షల కుక్క కాటు కేసులు నమోదయ్యాయని చెప్పారు. వారిలో రాబిస్ వ్యాధి కారణంగా 54 మంది మరణించినట్టు తెలిపారు.

అంతర్గత కమిటీ రాజ్యాంగ విరుద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)



హైకోర్టు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ శీల్ నాగు, జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్‌తో (మార్చి 22న) అంతర్గత కమిటీని నియమించడం రాజ్యాంగ విరుద్ధమైనప్పుడు దాని ముందు విచారణకు ఆయన ఎందుకు హాజరయ్యారని కోర్టు ఆయన్ను నిలదీసింది. ఆ కమిటీని వేసినప్పుడే దాని చట్టబద్ధతను ఎందుకు సవాల్ చేయలేదని ప్రశ్నించింది. విచారణ పూర్తయ్యేదాకా ఎందుకు ఎదురుచూశారని అడిగింది. ఆ డబ్బు ఎవరిదో కమిటీ కనుగొంటుందన్న ఉద్దేశంతోనే దాని ముందు ఆయన హాజరయ్యారని జస్టిస్ వర్మ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. డబ్బు వ్యవహారంలో జస్టిస్ వర్మను అంతర్గత కమిటీ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. ఈ మేరకు మే 4వ తేదీన తన నివేదికను చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సమర్పించింది. దరిమిలా పదవికి రాజీనామా చేయాలని.. లేదంటే తప్పనిసరి స్వచ్ఛంద పదవీవిరమణ చేయాలని జస్టిస్ వర్మకు సీజేఐ సూచించారు. తానే తప్పూ చేయలేదంటూ ఆయన అందుకు నిరాకరించడంతో కమిటీ నివేదికను రాష్ట్రపతి, ప్రధానమంత్రికి సీజేఐ పంపించారు. దీనిపై కేంద్రం జస్టిస్ వర్మను పార్లమెంటు ఉభయ సభల్లో అభిశంసన తీర్మానం ద్వారా తొలగించాలని నిర్ణయించింది. ప్రస్తుత సమావేశాల్లోనే తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో అంతర్గత కమిటీ ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమని, న్యాయమూర్తిగా తనను తొలగించాల్సిందిగా సీజేఐ సిఫారసు చేయడాన్ని కూడా రాజ్యాంగవిరుద్ధం, ఆయన అధికార పరిధికి మించినదిగా ప్రకటించాలని కోరుతూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఎలాంటి ఫిర్యాదూ లేకుండానే జస్టిస్ వర్మపై అంతర్గత విచారణ ప్రారంభించారని సిబల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే ఆయనపై ఆరోపణలను పత్రికా ప్రకటన ద్వారా బహిరంగ పరచడంతో అసాధారణ మీడియా ట్రయల్ జరిగిందని తెలిపారు. 'ఆ డబ్బు ఎవరిదో, ఎంత దొరికిందో తన నివేదికలో కమిటీ స్పష్టం చేయలేదు. తగు గడువివ్వకుండానే రాజీనామానో, స్వచ్ఛంద పదవీవిరమణో చేయాలని.. లేదంటో తొలగింపు ప్రక్రియ మొదలుపెడతామని సీజేఐ హెచ్చరించారు' అని పేర్కొన్నారు. అయితే ఆయన పిటిషన్‌లో మూడు లోపాలను ధర్మాసనం ప్రస్తావించింది. 'పిటిషన్ ఇలా దాఖలుచేసి ఉండాల్సింది కాదు. సెక్రటరీ జనరల్ కాకుండా సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను కక్షిదారుగా చేర్చారు. మొదటి కక్షిదారుగా సుప్రీంకోర్టు. మీ వంటి సీనియర్ న్యాయవాది నుంచి మేం ఇది ఆశించలేదు. అంతర్గత కమిటీ రిపోర్టును పిటిషన్‌తో జతచేయలేదు. దానిపై మీరు వాదనలు వినిపించాలనుకుంటే అది కచ్చితంగా ఉండాల్సిందే' అని స్పష్టంచేసింది. నివేదికను జతచేస్తామని సిబల్ తెలిపారు. జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రక్రియ ఏ విధంగా రాజ్యాంగ విరుద్ధమో వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఈ సందర్భంగా సూచించింది. వ్యవస్థీకృత చట్టప్రక్రియ ద్వారా తప్ప మరే విధంగానూ న్యాయమూర్తి ప్రవర్తనపై విచారణ జరడానికి వీల్లేదని ఆయన బదులిచ్చారు.

ట్రిపుల్ ఎక్స్ వర్సెస్ కేంద్రం

జస్టిస్ వర్మ తన పిటిషన్‌లో తన పేరును పొందుపరచలేదు. 'ఎక్స్‌ఎక్స్‌ఎక్స్ వర్సెస్ కేంద్రప్రభుత్వం'గా పేర్కొన్నారు. పిటిషన్‌లో ఇలా గుర్తింపు దాచుకోవడం అసాధారణమేమీ కాదు. సాధారణంగా అత్యాచార, లైంగిక వేధింపుల బాధితులు, మైనర్లు, జువెనైల్స్ తమ గుర్తింపు బహిర్గతం కాకుండా 'ట్రిపుల్ ఎక్స్' అని పేర్కొంటుంటారు. ఇక్కడ జస్టిస్ వర్మ తన గుర్తింపును దాచిపెట్టడం గమనార్హం.

అనుకూల ఆదేశాల కోసమే వెళ్లారా?

అంతర్గత కమిటీ విచారణ జరపడానికి వీల్లేదని రాజ్యాంగ ధర్మాసనం చెబుతోందా అని కోర్టు అడిగింది. తనకు అనుకూలమైన ఆదేశాలు వస్తాయనే ఉద్దేశంతోనే జస్టిస్ వర్మ విచారణకు హాజరైనట్లుగా ఉందని వ్యాఖ్యానించింది. కమిటీ నివేదిక అభిశంసన తీర్మానానికి ఆధారం కారాదని సిబల్ అన్నారు. అభిశంసనకు ఆదే ఆధారమని ఎవరు చెప్పారని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. సీజేఐ లేఖను సిబల్ ప్రస్తావించారు. 'లేఖలు పంపడం అంటే పార్లమెంటే అభిశంసించాలని చెప్పడం ఎలా అవుతుంది' అని ధర్మాసనం ప్రశ్నించింది. వాదనలను నిర్దిష్ట పాయింట్లతో ఒక్క పేజీలో సమర్పించాలని.. కక్షిదారుల మెమోను కూడా సవరించుకుని రావాలని ఆదేశించింది.

భాషా ఉగ్రవాదంపై ఉద్యమం!

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై వివక్ష
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ ధ్వజం



బోల్‌పూర్, జూలై 28: దేశవ్యాప్తంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీల మీద దాడులు జరుగుతున్నాయని, అది భాషా ఉగ్రవాదంతో సమానమని పశ్చిమ బెంగాల్ సీఎం మమత ధ్వజమెత్తారు. 'వివిధ రాష్ట్రాలకు వలస వెళ్లిన బెంగాలీలను ఓటరు లిస్టులోంచి తొలగించి, ఎన్నార్సీ (దేశ పౌరుల జాబితా)ని దొడ్డిదారిన అమలు చేయటానికి కేంద్రం, ఎన్నికల సంఘం కుట్ర పన్నుతున్నాయి. నేను ప్రాణత్యాగానికైనా సిద్ధపడతాగానీ.. బెంగాలీ అస్తిత్వాన్ని లాక్కోవటానికి ఎవర్నీ అనుమతించను' అని పేర్కొన్నారు. తాను జీవించి ఉన్నంతకాలం బెంగాల్‌లో ఎన్నార్సీని అమలు చేయనియ్యబోనని, నిర్బంధ శిబిరాలను ఏర్పాటు కానివ్వబోనని మమత స్పష్టం చేశారు. బెంగాలీల మీద వివక్షకు వ్యతిరేకంగా మమత సోమవారం రాష్ట్రవ్యాప్త భాషా ఉద్యమాన్ని పశ్చిమ బెంగాల్‌లోని బోల్‌పూర్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'మాకు ఏ భాషతోనూ శత్రుత్వం లేదు. భిన్నత్వంలో ఏకత్వమే మన దేశానికి పునాది. కానీ, మా భాషను సంస్కృతిని ధ్వంసం చేయటానికి చూస్తే మాత్రం మేం శాంతియుతంగా, శక్తిమంతంగా, రాజకీయంగా ఎదుర్కొంటాం' అని తెలిపారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణను ఉద్దేశించి మాట్లాడుతూ, కేంద్రం తరఫున ఓ మాజీ కేంద్రమంత్రి అసలైన ఓటర్లను కూడా ఓటరు లిస్టులోంచి తొలగిస్తున్నారని, బెంగాలీలు తమ సొంతదేశంలో నిర్వాసితులు కావటాన్ని తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దేశ స్వాతంత్ర్యోద్యమానికి, అనేక సంఘ సంస్కరణ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన బెంగాల్.. తన సొంత అస్తిత్వం కోసం కూడా పోరాడగలదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వేధింపులకు గురవుతున్న బెంగాలీలు తిరిగి సొంతరాష్ట్రానికి రావాలని మమత పిలుపునిచ్చారు.

భారత్-పాక్ పోరును నేనే ఆపా

నేను అమెరికా అధ్యక్షుడిని కాకపోతే ఆరు యుద్ధాలు జరుగుతుండేవి: ట్రంప్

లండన్, జూలై 28: భారత్-పాక్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చెప్పారు. తాను అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కాకపోయి ఉంటే ప్రస్తుతం ప్రపంచంలో ఆరు యుద్ధాలు జరుగుతుండేవని అన్నారు. స్కాట్‌లాండ్‌లో సోమవారం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను లేకపోయి ఉంటే ఈ రోజున ఆరు ప్రధాన యుద్ధాలు జరుగుతుండేవి. భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతుండేది. వాణిజ్య సుంకాలను అస్త్రంగా చేసుకొని థాయిలాండ్-కంబోడియాల మధ్య యుద్ధాన్ని ఆపించా. రవాండా-డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో మధ్య శాంతి ఒప్పందం కుదిరేలా చేశా. సెర్బియా-కొసావోల మధ్య ఘర్షణ తలెత్తకుండా చూశా" అని చెప్పారు. గాజాలో ప్రస్తుత పరిస్థితి ఏమిటని ఓ విలేకరి ప్రశ్నించినప్పుడు 'గాజాకు సహాయంగా అమెరికా చాలా ధనం పంపించింది. కానీ హమాస్ దాన్ని అపహరించింది' అన్నారు.

వరంగల్.. హనుమకొండ.. రెండు జిల్లాలెందుకు!?

ఒకే నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించడం ఏమిటి!?.. వీటి ఏర్పాటుతో ప్రజలకు పెరిగిన కష్టాలు

- హనుమకొండనూ కలిపి వరంగల్ జిల్లాగా కొనసాగించాలి
- అశాస్త్రీయ జిల్లాల విభజనపై ప్రొఫెసర్లు, మేధావుల నిరసన
- జిల్లాల ఏకీకరణపై మరోసారి ఉద్యమానికి శ్రీకారం



వరంగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ జిల్లా కలెక్టరేట్‌తోపాటు ఇతర కీలక కార్యాలయాలన్నీ హనుమకొండలో ఉన్నాయి! వరంగల్ జిల్లావాసులు కలెక్టర్‌ను కలుసుకోవాలంటే హనుమకొండకు రావాల్సిందే. వరంగల్, హనుమకొండ జిల్లా కార్యాలయాలూ పక్కపక్కనే! మరి, వరంగల్, హనుమకొండ.. రెండు జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు ఒరిగిందేమిటి!? ఆ రెండు జిల్లాల ప్రజల్లో ఇప్పుడు ఇదే ప్రశ్న! అందుకే, చరిత్రాత్మక వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేసి.. వరంగల్, హనుమకొండ జిల్లాలుగా చేయడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆ రెండు జిల్లాలనూ మళ్లీ కలపాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి! ఈ దిశగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యావంతులు, వివిధ పార్టీల నేతలు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ నేతలు తమ పదవులు, వ్యాపారాల కోసం ఎంతో ఘన చరిత్ర ఉన్న వరంగల్ నగరాన్ని రెండుగా విభజించి అభివృద్ధి జరగకుండా కుట్ర చేశారని ఆరోపిస్తూ తెలంగాణ ఉద్యమ వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో సదస్సులు, చర్చా వేదికలు నిర్వహిస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల విభజనపై న్యాయ నిపుణులతో కమిటీ వేస్తామని, శాస్త్రీయబద్ధంగా జిల్లాల ఏర్పాటు ఉంటుంద"ని కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, రెండేళ్లు కావస్తున్నా.. ఇప్పటి వరకూ బీఆర్ఎస్ ప్రభుత్వం విభజించిన కొత్త జిల్లాలతోనే పాలన సాగుతోందని తప్పుబడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వరంగల్ జిల్లాలో హనుమకొండ జిల్లాను విలీనం చేయాలన్న ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఆరు ముక్కలైన వరంగల్ జిల్లా

చిన్న జిల్లాలతోనే సుపరిపాలన సుగమం అవుతుందంటూ జిల్లాల పునర్విభజనకు బీఆర్ఎస్ సర్కారు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2016 అక్టోబరు 11వ తేదీన ఉమ్మడి 10 జిల్లాలను 31 జిల్లాలుగా మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. చరిత్రాత్మక వరంగల్ జిల్లాను వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాలుగా విభజించింది. ఆ తర్వాత 2019 ఫిబ్రవరి 19న భూపాలపల్లి జిల్లాలో తొమ్మిది మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా ఉన్న ములుగును ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసింది. ఫలితంగా.. వరంగల్ జిల్లా ఆరు ముక్కలైంది. అనంతరం, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ జిల్లాలను 2021 ఆగస్టు 12న వరంగల్, హనుమకొండ జిల్లాలుగా ఏర్పాటు చేసింది. వరంగల్ నగరాన్ని రెండుగా చీల్చి రెండు జిల్లాలకు హెడ్ క్వార్టర్ చేసింది. వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయడంపై అప్పట్లోనే చరిత్రకారులు, తెలంగాణ ఉద్యమకారుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ప్రధానంగా వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల విభజనపై ప్రజల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లాకు కనీసం పరిపాలన సాగించేందుకు హెడ్‌క్వార్టర్ కూడా లేకుండాపోయింది. పాలనాపరమైన కార్యకలాపాలన్నిటికీ ప్రజలు హనుమకొండకు రావాల్సి వస్తోంది. గత ప్రభుత్వ నిర్వాకంతోనే చరిత్రాత్మక ఏకశిలా నగరం రెండు ముక్కలైందనే వాదన ఉంది. పైగా జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అన్ని శాఖల అధికారులు ఇద్దరిద్దరు ఉండటంతో వారికి చెల్లించే వేతనాలు, సదుపాయాలు, ఇతరత్రా ఖర్చులన్నీ ప్రభుత్వానికి అదనపు భారంగా మారాయి. ఏ పని ఉన్నా హనుమకొండ జిల్లా ప్రజలు, వరంగల్ జిల్లా ప్రజలు హనుమకొండకే రావాల్సి వస్తోంది. దీంతో రెండు జిల్లాల అవసరం ఏముందని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సైతం గత ప్రభుత్వం జిల్లాలను శాస్త్రీయ పద్ధతిలో విభజన చేయలేదని, త్వరలోనే ఓ కమిటీ వేసి జిల్లాల విభజనపై పరిశీలన చేస్తామని ప్రకటించారు. దాంతో, గత ఏడాది ఆగస్టులో చేపట్టిన వరంగల్, హనుమకొండ జిల్లాల ఏకీకరణ ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండటంతో రెండు జిల్లాలను కలిపి వరంగల్ జిల్లాగా ఏర్పాటు చేయాలని మరోసారి ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

మద్దతుగా ఉద్యమాలు

వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేయడంపై మొదటి నుంచీ కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీతోపాటు బీఆర్ఎస్‌లోని ఓ వర్గం, ఇతర సంఘాలు వ్యతిరేకిస్తూ వచ్చాయి. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ఈ రెండు జిల్లాల విలీనానికి మద్దతు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, తెలంగాణవాదులు, వివిధ సంఘాల నేతృత్వంలో రెండు వారాలుగా ఉద్యమాన్ని మొదలు పెట్టారు. రెండు జిల్లాల్లోని అన్ని ప్రాంతాల ప్రజల మద్దతును కూడా కట్టి త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తామని కేయూ ప్రొఫెసర్ కూరపాటి నారాయణ తెలిపారు.

కన్వర్ట్ అయ్యింది మోదీ కాదు.. రాహుల్



హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): "ప్రధాని మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. వాస్తవానికి కన్వర్ట్ అయ్యింది మోదీ కాదు.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీనే. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలి" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. బీసీల సంక్షేమంపై కాంగ్రెస్‌ది నటనేనని, మాటలు చెప్పడం తప్ప.. చేతల్లో చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. ఈ నటనకే ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని దుయ్యబట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. బీసీల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆలోచిస్తుంటే.. వారి సంక్షేమం గురించి బీజేపీ ఆలోచిస్తోందని చెప్పారు. బీసీల ముసుగులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలన్న కాంగ్రెస్ కుట్రనే బీజేపీ వ్యతిరేకిస్తోందని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 2న ధర్నాచౌక్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. ప్రధాని మోదీ నిర్ణయం మేరకు జనగణనలోనే కులగణన చేయడం ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల గణాంకాలు స్పష్టంగా వెలుగులోకి రానున్నాయని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలకే పెద్దపీట వేస్తామని ప్రకటించారు. కాగా, మంగళ, బుధ వారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాంచందర్‌రావు పర్యటించనున్నారు.

ప్రధాని మోదీని బీసీ కాదనడం సిగ్గుచేటు

- సీఎం రేవంత్‌పై ఎంపీ ఆర్. కృష్ణయ్య ధ్వజం

న్యూఢిల్లీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీని బీసీ కాదనడం సిగ్గు చేటని ఎంపీ ఆర్.కృష్ణయ్య.. సీఎం రేవంత్ రెడ్డి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు దేశంలోని 70 కోట్ల మంది బీసీలను అగౌరవపరిచేలా ఉన్నాయన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో ఆర్.కృష్ణయ్య మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీని బీసీ కాదనడానికి రేవంత్‌రెడ్డి ఏమన్నా రెవెన్యూ ఇన్‌స్పెక్టరా? తహశీల్దారా? అని ప్రశ్నించారు. బీజేపీని బీసీ వ్యతిరేక పార్టీగా రేవంత్ రెడ్డి విమర్శించడం తగదని హితవు పలికారు. బీసీని దేశ ప్రధానిని చేసిన ఘనత బీజేపీదేనని, కేంద్ర మంత్రివర్గంలో 27మంది బీసీలకు చోటుకల్పించిందని అన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ బహిరంగ విచారణ

- రెండు డివిజన్ బెంచీలపై 100కు పైగా కేసులు స్వీకరణ
- పోలీసుల పనితీరు మీదే అధిక ఫిర్యాదులు

హైదరాబాద్ సిటీ, జూలై28(ఆంధ్రజ్యోతి): "చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడు అనుమానాస్పద మృతి చెందితే, పోలీసులు రోడ్డుప్రమాదంగా కేసు నమోదు చేశారంటూ ఓ తల్లి ఫిర్యాదు. ఆస్తి తగాదాలలో సొంత చెల్లెళ్లే అన్నను పొట్టన పెట్టుకున్నారంటూ మృతుడి భార్య ఆవేదన. అర్థాంతరంగా ఉద్యోగంలో నుంచి తనను తొలగించారని ఓ యువకుడి రోదన. ఇలా ఒకటా, రెండా... భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవ హక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం వేదికగా సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్ -1 లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ - 1లో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ -2లో మొత్తం 52కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలోనూ జైళ్లలోని పరిస్థితులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కొన్ని కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులమీద సాయంత్రం వరకు విచారణ కొనసాగింది. తెలంగాణ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి రవి గుప్త, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్‌తో పాటు పలువురు ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, జిల్లా పోలీసు అధికారులు పలు కేసుల నేపథ్యంలో విచారణకు హాజరయ్యారు. రకరకాల సమస్యలతో బెంచ్‌ను ఆశ్రయించిన వారికి విజయభారతి ధైర్యం చెబుతూ, వారికి తగిన న్యాయం అందిస్తామని మాట ఇచ్చారు. అంతేకాదు, కేసు విచారణలో జాప్యం తలెత్తితే సంప్రదించాల్సిందిగా కొంతమంది బాధితులకు తన వ్యక్తిగత ఫోన్ నెంబరు కూడా ఇచ్చారు. రోజులో 88కేసులు విచారించగా, అందులో దాదాపుగా సగానికి సగంపైగా పోలీసుల పనితీరు మీద ఫిర్యాదులు ఉండడం గమనార్హం.

రేపు జేఎన్‌టీయూ 'వన్‌టైమ్ చాన్స్' పరీక్షల ఫలితాలు.!

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 'వన్ టైమ్ చాన్స్' పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు స్పందిస్తూ.. రెండు, మూడు రోజుల్లో ఫలితాలను విడుదల చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. పదేళ్లకు ముందు ఇంజనీరింగ్, ఫార్మసీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ కోర్సులు చదివిన పూర్వ విద్యార్థుల్లో, తమ బ్యాక్‌లాగ్ సబ్జెక్టులను పూర్తి చేయలేక పోయిన వారి కోసం జేఎన్‌టీయూ 'వన్‌టైమ్ చాన్స్' పేరిట మరో అవకాశాన్ని ఇచ్చింది. సుమారు రెండు వేలమంది దరఖాస్తు చేసుకోగా, జూన్ నెలాఖరులోగా ఫలితాలు వస్తాయని అభ్యర్థులు ఆశించారు. అయితే, సుమారు 25వేలకు జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాల్సి రావడం, 20 ఏళ్ల కిందట అభ్యర్థులు చదివిన సబ్జెక్టుల జవాబు పత్రాలను దిద్దేందుకు ఆచార్యులు దొరకక పోవడంతో ఫలితాల వెల్లడిలో జాప్యం ఏర్పడినట్లు తెలిసింది.



నగరంలో ఎమ్మెల్యే ఇంటి ఆవరణలో బైఠాయించిన ఫార్మాసిటీ బాధిత రైతులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి ఇల్లు ముట్టడి

- ఎన్నికల హామీ నెరవేర్చాలని ఫార్మాసిటీ బాధితుల ఆందోళన
- వారం, 10 రోజుల్లో కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేస్తా
- ఫార్మాసిటీ ఏర్పాటు చేయం: మల్‌రెడ్డి

యాచారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో తమకిచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలుపుకోవాలని కోరుతూ ఫార్మాసిటీ బాధిత రైతులు ఆందోళన బాట పట్టారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను రైతుల పేరిట ఆన్‌లైన్ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల ఫార్మాసిటీ బాధిత రైతులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటిని ముట్టడించారు. 'మా భూములు.. మాకే కావాలి' తదితర డిమాండ్లతో ప్లకార్డులను ప్రదర్శించారు. న్యాయం జరిగేవరకు కదలేది లేదని భీష్మించారు. ఈ సంగతి తెలుసుకున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయబోమని స్పష్టం చేశారు. వారం, పది రోజుల్లో కలెక్టరేట్‌లో కలెక్టర్, టీజీఐఐసీ అధికారులు, ఆర్‌డీఓ, తహసీల్దార్లతోపాటు ప్రతి గ్రామం నుంచి ముగ్గురు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. రాజకీయాలకతీతంగా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రైతులను ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

పాతికేళ్లకే కుప్పకూలుతున్నారు!

- 20-30 ఏళ్ల వారిలో పెరుగుతున్న హృద్రోగాలు
- జన్యు పర, పుట్టుకతో గుండె సమస్యలుంటే అధిక శారీరక శ్రమతో గుండెపోటు
- అధిక కొవ్వు, ధూమపానమూ ముప్పే

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్లకే గుండె లయ తప్పుతోంది. అప్పటివరకు ఆడి పాడిన యువత.. చూస్తుండగానే కుప్పకూలిపోతోంది. ఇటీవల ఈ తరహా కేసులు ఎక్కువవుతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో షటిల్ ఆడుతూ ఓ యువకుడు గుండెపోటుతో కుప్పకూలి మరణించిన ఘటన ఆందోళన రేకెత్తిస్తోంది. తమ వద్దకు వచ్చే గుండె జబ్బు బాధితుల్లో యువకులే ఎక్కువగా ఉంటున్నారని హృద్రోగ నిపుణులు కూడా చెబుతున్నారు. ఒకప్పుడు 50, 60 ఏళ్ల వయసు దాటిన వారిలోనే కనిపించే గుండె జబ్బులు.. ఇప్పుడు 20-30 ఏళ్ల వయసు వారిలోనూ చోటు చేసుకుంటున్నాయని హెచ్చరిస్తున్నారు. రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడడం, కండరాల వాపు వంటి వాటితో పాటు అంతకుముందు కుటుంబంలో ఎవరికో ఒకరికి ఈ జబ్బులు ఉంటే ఈ పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. చిన్నప్పటి నుంచే జంక్ ఫుడ్‌ను అధిక మొత్తంలో తీసుకుంటుండటం వల్ల కొవ్వు శాతం పెరిగి గుండె స్పందనల్లో తేడాలొస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరికి పుట్టుకతోనే గుండె జబ్బులు వస్తాయంటున్నారు. ఇక మాదక ద్రవ్యాలు, ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ గుండె సమస్యలొచ్చే ముప్పు అధికమని అంటున్నారు. అందుకే 25 ఏళ్లు దాటినప్పటి నుంచే గుండె ఆరోగ్యాన్ని తెలిపే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

గుర్తించని గుండె సమస్యలు..



'కొంతమంది యువకుల్లో జన్యుపరమైన లేదా పుట్టుకతో వచ్చే గుండె సమస్యలు ఉండవచ్చు. దీంతో తీవ్రమైన శారీరక శ్రమ లేదా ఒత్తిడి సమయంలో ఆకస్మిక గుండెపోటుకు దారితీయవచ్చు. అలాగే మధుమేహం, అధిక రక్తపోటు రక్తనాళాలను దెబ్బతీసి, కొవ్వు పేరుకుపోయి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. మధుమేహం ఉంటే 2 నుంచి 3 రెట్లు ఎక్కువ ముప్పు. కొవిడ్ వైరస్ గుండె కండరాలకు వాపు (మయోసైటిస్) కలిగించవచ్చు. ఇది కూడా గుండెపోటు ప్రమాదాన్ని పెంచవచ్చు. యువతలో గుండెపోటు నివారించడానికి పండ్లు, కూరగాయలు, చేపలు, చికెన్, తృణధాన్యాల వంటి ఆహారాన్ని తీసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి'

\- శరత్‌రెడ్డి, మెడికవర్ ఆస్పత్రి హృద్రోగ నిపుణుడు

తొలి గంటలోనే చికిత్స అత్యవసరం



'అకస్మాత్తుగా గుండెపోటు వచ్చే వారిలో సగం మంది ఆస్పత్రికి చేరకుండానే మరణిస్తున్నారు. గుండెపోటు వచ్చిన తొలి గంట (గోల్డెన్ అవర్) లోనే తక్షణ చికిత్స అందిస్తే బాధితుడి ప్రాణాన్ని కాపాడవచ్చు. రోగికి తక్షణమే కార్డియో పల్మోనరీ రిససిటేషన్ (సీపీఆర్) చేయాలి. లేదంటే మరణం సంభవిస్తుంది'

\- పీఎస్ రామచంద్ర, శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రి చీఫ్ కార్డియాలజిస్టు

అమెరికాలో గుండెపోటుతో నిజామాబాద్ జిల్లా వాసి మృతి



హరికృష్ణ (ఫైల్)

కోటగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడిన నిజామాబాద్ జిల్లా వాసి గుండెపోటుకు గురై మృతి చెందారు. వారాంతపు సెలవులను ఆస్వాదించేందుకు బోటింగ్‌కు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన వడ్లమూడి రాధాకృష్ణ, సరస్వతి దంపతుల కుమారుడు హరికృష్ణ (49).. ఆయన 25 ఏళ్ల క్రితమే అమెరికాకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారు. ప్రస్తుతం వర్జీనియాలో అంటూ అక్కడే పనిచేస్తున్నారు. ఆయనకు భార్య శిల్ప, యుక్త, సరయు అనే ఇద్దరు ఆడ పిల్లలున్నారు. అయితే శనివారం తన స్నేహితుడి కుటుంబంతో కలిసి అక్కడి ఓ నదిలో బోటింగ్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే హరికృష్ణ ఒక్కసారిగా గుండెపోటుకు గురై నదిలో పడిపోయారు. స్నేహితుడి కూతురు నదిలో దూకి హరికృష్ణను ఒడ్డుకు చేర్చి సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఆట మధ్యలో ఆగిన యువకుడి గుండె!

- షటిల్ ఆడుతూ కుప్పకూలి మృతి
- హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఘటన
- మృతుడి స్వస్థలం ఖమ్మం జిల్లా తల్లాడ



గుండ్ల రాకేశ్ (ఫైల్)

ఉప్పల్/తల్లాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రోజూ మాదిరిగానే స్నేహితులతో కలిసి షటిల్ ఆడేందుకు వెళ్లిన ఓ యువకుడు ఆట మధ్యలోనే కుప్పకూలి ప్రాణాలొదిలాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ ఉపసర్పంచ్ జి.వెంకటేశ్వర్‌రావు కుమారుడు రాకేశ్ (26) హైదరాబాద్‌లోని ఓ ఈవీ వాహన కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే ఎప్పటిలాగే స్నేహితులతో కలిసి ఉప్పల్ భగాయత్‌లోని ఎలైట్ బ్యాడ్మింటన్ అకాడమీకి ఆదివారం రాత్రి వచ్చాడు. ఈ క్రమంలోనే రాత్రి 8 గంటల సమయంలో వారితో షటిల్ ఆడుతూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే సహచరులు అతడిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే రాకేశ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనకు సంబంధించి అకాడమీ సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం రాకేశ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు తల్లాడకు తీసుకెళ్లి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

రేపే నింగిలోకి 'నిసార్'

- జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగానికి నేడు కౌంట్‌డౌన్

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాసా-ఇస్రో సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టనుంది. ఈ రాకెట్ ద్వారా బుధవారం సాయంత్రం 'నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్' (నిసార్) ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపనుంది. ఈ ప్రయోగానికి కౌంట్‌డౌన్‌ను మంగళవారం మధ్నాహ్నం 2:10 గంటలకు ప్రారంభించి.. 27:30 గంటలపాటు కొనసాగించనున్నారు. ఆ తర్వాత షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి బుధవారం సాయంత్రం 5:40 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ సోమవారం షార్‌కు చేరుకుని ప్రయోగ సన్నాహాల్లో పాల్గొన్నారు. మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) మధ్నాహ్నం నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగింది. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలతో పాటు ఇస్రో ఛైర్మన్ కూడా పాల్గొని, ప్రతి అంశాన్నీ సుదీర్ఘంగా చర్చించారు. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) సమావేశమైంది. రాకెట్‌లోని అన్ని వ్యవస్థల పనితీరు, తదితర అంశాలపై చర్చించిన అనంతరం ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నాసా-ఇస్రో సంయుక్తంగా రూపొందించిన ఉపగ్రహం కావడంతో అమెరికా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు చేరుకున్నారు. నిసార్ ఉపగ్రహం మొత్తం 12 రోజుల్లో భూమిని మ్యాప్ చేయగలదని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ అన్నారు. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. 'నిసార్ ఉపగ్రహంలో ఎస్ బ్యాండ్ సింథటిక్ అపెర్చర్‌ను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశాం. ఎల్ బ్యాండ్ సింథటిక్ అపెర్చర్‌ను నాసా రూపొందించింది. నిసార్ ఉపగ్రహం మేఘాలు ఆవరించినా, వర్షం కురిసినా, అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ 24 గంటలూ స్పష్టమైన ఫొటోలు తీసి భూమికి పంపగలదు. మట్టి పెళ్లలు విరిగిపడటం, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను గుర్తించి అప్రమత్తం చేయగలదు' అని నారాయణన్ వివరించారు.



ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్

బీసీల సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం

- బీసీ కవులు, కళాకారులు ఒక్కటి కావాలి: జాజుల
- బీసీ కల్చరల్ ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక

పంజాగుట్ట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : బీసీల సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కళాకారుల ఆత్మీయ కలయిక పేరుతో విస్తృతస్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం బీసీ కవులు, కళాకారులు ఒక్కటవ్వాలన్నారు. ఈ సందర్భంగా వారు బీసీ కల్చరల్ ఫోరం వేదికను ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరావత్ అనిల్, మహాత్మ జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాల కమిటీ ఛైర్మన్ వి. చిన్నశ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. బీసీల గురించి అత్యుత్తమ పాట రాసిన వారికి రూ.5 లక్షలు, రెండో పాటకు రెండు లక్షలు, మూడో అత్యుత్తమ పాటకు లక్ష రూపాయల చొప్పున నగదు బహుమతులు అందజేస్తానని వి.చిన్న శ్రీశైలం యాదవ్ ప్రకటించారు. అనంతరం బీసీ కల్చరల్ ఫోరం నూతన కార్యవర్గాన్ని జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కోదారి శ్రీను, ఉపాధ్యక్షులుగా అభినయ శ్రీనివాస్, అంబటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా దరువు అంజన్న, కోశాధికారిగా రామలింగం ఎన్నికయ్యార

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మార్పులేని మణిపూర్

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతిపాలనను మరో ఆర్నెల్లు పొడిగించాలని కేంద్రం నిర్ణయించుకుంది. రాష్ట్రంలో పరిస్థితులు మెరుగుపడ్డాయన్న కేంద్రం వాదన సరైనదే అయినప్పుడు ఈ కొనసాగింపు అవసరం నిజానికి ఉండకూడదు. పగ్గాలు మరో ఆర్నెల్లు కేంద్రం చేతిలోనే ఉండాలని అనుకుంటున్నారంటే, రాష్ట్రం ఇంకా గాడినపడలేదని ఒప్పుకున్నట్టే. తమకు ఎంతో ప్రీతిపాత్రుడైన బీరేన్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికంటే మణిపూర్ తొలి ఆర్నెల్ల రాష్ట్రపతి పాలనలో మెరుగుపడిందనీ, మరికొంతకాలం ఇలాగే తమ చేతుల్లోనే కొనసాగితే పూర్తిగా బాగుపడిపోతుందని కేంద్రం తాను నమ్ముతూ, మననూ నమ్మమంటున్నదేమో!

వచ్చే ఏడాది ఫిబ్రవరి 13వరకూ వర్తించబోయే ఈ కొనసాగింపుతో మణిపూర్ ఏడాది రాష్ట్రపతిపాలన పూర్తిచేసుకుంటుంది. రెండేళ్లపాటు మతాల మధ్య చిచ్చురాజేసి, రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చేసిన ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఈ ఏడాది ఫిబ్రవరి 13న రాజీనామా చేయడంతోనే రాష్ట్రపతిపాలన అమలులోకి వచ్చింది. ప్రభుత్వ వ్యవస్థలన్నీ కుప్పకూలి, యంత్రాంగం నిర్వీర్యమై, అరాచకం ప్రబలిపోవడంతో ఇక నేరుగా రాష్ట్రాన్ని గుప్పిట్లోకి తీసుకోకతప్పదని కేంద్రం భావించింది. సంక్షోభ నివారణకు ఉద్దేశించిన తాత్కాలిక చర్యగా ప్రజలు రాష్ట్రపతిపాలనను భావిస్తారు కనుక, సాధ్యమైనంత త్వరలో దానిని ఎత్తివేసి ప్రజాప్రభుత్వాన్ని నెలకొల్పే పని మొదలవుతుందని కూడా ఆశిస్తారు. అయితే, మణిపూర్ విషయంలో కేంద్రం నిర్ణయం ఇందుకు విరుద్ధంగా ఉన్నందున, రాష్ట్రంలో శాంతిభద్రతలను ప్రతిష్ఠించి, సమాజాన్ని సాధారణస్థితికి తెచ్చే కృషిలో ప్రభుత్వ ప్రయత్నాలు పరిపూర్ణంగా ఫలించలేదని అనుకోవాలి.

బీరేన్‌సింగ్ దిగినవెంటనే రాష్ట్రంలో పరిస్థితులు మారిపోతాయన్న భ్రమలు ఎవరికీ లేవు. ఆఖరునిముషం వరకూ ఆయన ముఖ్యమంత్రిగా కాక, ఒక మీతీ నాయకుడిలాగానే వ్యవహరించడంతో, రాష్ట్రం మతవిద్వేషాలతో భగ్గుమన్నది, మీతీలకూ కుకీ–జో తెగలకు మధ్య అవిశ్వాసం పతాకస్థాయికి చేరింది. పోలీసు బలగాలను మీతీ మిలిటెంట్ గ్రూపుల జోలికి పోకుండా నిరోధించారాయన. 'వాళ్ళను ఆయుధాలు దోచుకోనివ్వండి' అంటూ మీతీలపక్షాన ఆయన చేసిన వ్యాఖ్యలు ఆడియోటేపుల రూపంలో లీకై, వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ పోయి, ఆ గొంతు బీరేన్‌దేనని నిర్ధారణ జరిగి, తనతోపాటు బీజేపీ పెద్దలు పరువుకూడా తీశారు. బీరేన్‌ను తప్పిస్తే తప్ప, హింసకు అడ్డుకట్టపడదని, పరిస్థితులు మారవని మీతీయేతర జాతులూ తెగలూ 2023 నుంచీ మొత్తుకుంటూనే ఉన్నాయి. అయినా, ఢిల్లీ పెద్దలు దిగిరాలేదు. రెండేళ్ళపాటు ఆయన చిత్తం వచ్చినట్టు వ్యవహరించాడు. ఎప్పుడైతే బీరేన్‌కు వ్యతిరేకంగా పార్టీలోనే నిప్పురాజుకొని, స్పీకర్ కేంద్రంగా తిరుగుబాటు రాజకీయం సాగి, కాంగ్రెస్ ఎత్తులతో బీజేపీప్రభుత్వం కూలిపోవడం ఖాయమని తేలిపోయిందో, కేంద్రం ఆయనను నిర్దాక్షిణ్యంగా వదిలించుకుంది. అవిశ్వాసతీర్మానానికి తావులేకుండా ఢిల్లీపెద్దలు రాష్ట్రపతిపాలన విధించి, రాష్ట్రం చేజారిపోకుండా జాగ్రత్తపడ్డారు. బీరేన్ నిష్క్రమణ తరువాత, హింస క్రమంగా నియంత్రణలోకి వచ్చింది, ఆయుధాల స్వాధీనం కూడా జోరందుకుంది. ఇటీవల మీతీ రాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' నాయకుడు కనాన్ సింగ్‌ను సైతం సీబీఐ అరెస్టు చేసింది. అప్పుడు కాస్తంత హింస రేగినా, గతంతో పోల్చితే మీతీల జోరుతగ్గి, కుకీ–జో తెగల విశ్వాసం పెరిగింది.

సాధ్యమైనంత త్వరలో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడుతుందని, అందుకు కేంద్రహోంమంత్రి సానుకూలంగా ఉన్నారని బీరేన్‌సింగ్ ఈ మధ్య తరచుగా తెరమీద కనిపిస్తూ హామీలు ఇస్తున్నారు. తొలి ఆర్నెల్ల రాష్ట్రపతిపాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడినప్పటికీ, బీరేన్ కారణంగా నిలువునా చీలిన సమాజాన్ని దగ్గరచేసే ప్రయత్నాలు జరగలేదు. పౌరసమాజ భాగస్వామ్యంతో పాటు, రాష్ట్రంలో రాజకీయవాతావరణం నెలకొన్నపక్షంలో ఆ అగాధాన్ని పూడ్చడానికి వీలుపడుతుంది. సాధ్యమైనంత వేగంగా రాష్ట్రపతి పాలనకు స్వస్తిచెప్పి, అన్ని జాతులు, తెగల సముచిత ప్రాతినిధ్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినపక్షంలో మణిపూర్‌లో మార్పు చూడగలం.

అమెరికా 'రియల్' సంక్షోభంలో మన ఎన్నారైలు

కొంతకాలం కిందట అమెరికాలో రియల్ ఎస్టేట్ గృహాల కొనుగోళ్లు ఒక ఉద్యమంలా నడిచాయి. కరోనా దెబ్బకు వర్క్ ఫ్రం హోం కల్చర్ వచ్చిన తర్వాత 'మూన్ లైటింగ్' పేరుతో ఏకకాలంలో రెండు మూడు ఉద్యోగాలు చేస్తూ ఇబ్బడిముబ్బడిగా సంపాదించినవారు చాలామంది ఉన్నారు. వారు ఆర్జన మొత్తం నగదుగా ఉంటే వృథా అయిపోతుందని జాగ్రత్త పడి ఇళ్లు కొనడం మొదలుపెట్టారు. అవన్నీ కూడా లోన్ ద్వారా ఈఎంఐలతో కొన్న ఇళ్లు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగ ముఖచిత్రం ఇప్పుడు సమూలంగా మారిపోయింది. పెద్ద ఉద్యోగాల్లో ఉంటున్నవారు కూడా ఎంతకాలం స్థిరంగా ఆ స్థాయిలో ఉండగలమో చెప్పలేమని ఆందోళన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో ఇళ్లు కొన్న చాలామంది ఇప్పుడు వాటిని అమ్మకానికి పెడుతున్నారు. అలాగే ఉద్యోగంలో ఉన్నప్పుడు ఇల్లు కొనేశాక, లేఆఫ్‌లు అయిన సందర్భాల్లో, మరొక ఉద్యోగం వెతుక్కునేలోగా రుణానికి ఈఎంఐలు కడుతూ ఆస్తిని నిలుపుకోలేకపోతున్నారు. ఒత్తిడికి గురవుతున్నారు. అమెరికాలో ప్రస్తుతం కుదేలవుతున్న రియల్ ఎస్టేట్, గృహనిర్మాణరంగం ఇక్కడి భారతీయ సమాజంపై తీవ్ర ప్రభావాన్నే చూపుతోంది. తగు జాగ్రత్తలు తీసుకోకుండా ఇళ్లు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు వాటిని అమ్ముకోవడం వీలుకాక అగచాట్లు పడుతున్నారు.



ఐటీ వాతావరణం నెమ్మదించిన తర్వాత ఇళ్ల కొనుగోళ్లకు రుణాలు పుట్టడం గగనంగా మారుతున్నది. ప్రత్యేకించి భారతీయ సమాజానికి ఈ పోకడ తీవ్రత బాగా తెలుస్తోంది. గతంలో చెల్లింపుల్లో తేడా వస్తే ఇల్లు దక్కుతుంది గనుక రుణసంస్థలు రుణాలు ఇచ్చేందుకు వెనకాడేవి కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. రుణాలు కట్టలేని వారి నుంచి ఇళ్లను స్వాధీనం చేసుకున్నా వాటిని మళ్లీ అమ్ముకోవడం ఆ సంస్థలకు కూడా భారమే. అందుకే ఆచితూచి అప్పులిస్తున్నాయి.

కరోనా కాలంలో గృహ కొనుగోలుకు రుణాలిచ్చే సంస్థలు చాలా ఉదారంగా వ్యవహరించాయి. అప్పట్లో ఉన్న పరిస్థితుల్లో ఆ సంస్థల వ్యాపారం మొత్తం శవాసనం వేసింది గనుక కొత్త కస్టమర్లను ఆకర్షించడానికి అతి తక్కువ వడ్డీరేట్లకు రుణాలు ఆఫర్ చేశారు. ఆ రోజుల్లో 2శాతం వడ్డీ వంతున తీసుకున్న రుణాలకే, వినియోగదారులు ఇప్పుడు 7శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఎందుకంటే కొత్త వినియోగదార్లను ఆకర్షించడానికి అడ్జస్టబుల్ మార్ట్‌గేజ్ విధానాల్లో రెండుమూడేళ్ల పాటు మాత్రమే తక్కువ వడ్డీ వర్తించేలా రుణాలిచ్చారు. ఏదైతేనేం వడ్డీ తక్కువ కదా అని ఇళ్లు కొన్నవాళ్లు, వడ్డీలు పెరిగిన తర్వాత భరించలేకపోతున్నారు.

తాహతు చూసుకోకుండా ఇళ్లు కొనేసి ఇబ్బందులు కొనితెచ్చుకోవడానికి మరో కారణం కూడా ఉంది. అమెరికాకు పిల్లల్ని పంపిన, భారతీయ నగరాల్లోని తల్లిదండ్రులు "అక్కడ ఎప్పుడు ఇల్లు కొంటున్నావు" అంటూ వెంటపడతారు. పరిచయస్తుల్లో ఎవరి పిల్లలైనా ఇల్లు కొంటే వెంటనే తమ పిల్లలను కూడా ఇల్లు కొనాలని ప్రేరేపిస్తున్నారు. ఇలాంటి ఒత్తిడుల మధ్య అవసరాన్ని, తాహతును చూసుకోకుండా ఇల్లు కొనేసిన వాళ్ల ఇప్పుడు అమ్మకాలకు సిద్ధమవుతున్నారు. అమ్మేవాళ్ల రోజురోజుకూ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నారు గానీ కొనేవాళ్లే కనిపించడం లేదు. ఇందుకు మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. ఐటీ వాతావరణం నెమ్మదించిన తర్వాత ఇళ్ల కొనుగోళ్లకు రుణాలు పుట్టడం గగనంగా మారుతున్నది. ప్రత్యేకించి భారతీయ సమాజానికి ఈ పోకడ తీవ్రత బాగా తెలుస్తోంది. ఇళ్ల మార్కెట్ స్తంభించడానికి ఉన్న కారణాల్లో గంటల వారీ చెల్లించే వేతనాలు బాగా తగ్గడం కూడా ఒక కారణం. హెచ్1 ఉన్న వారికి ఇప్పటికీ రుణం వస్తుంది గానీ రుణ ప్రక్రియ క్లిష్టంగా మారింది. వారి ఉద్యోగాల కాంట్రాక్టు ఎప్పటిదాకా ఉందో గమనించి గానీ రుణం ఇవ్వడం లేదు. గతంలో చెల్లింపుల్లో తేడా వస్తే ఇల్లు దక్కుతుంది గనుక రుణసంస్థలు రుణాలు ఇచ్చేందుకు వెనకాడేవి కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. రుణాలు కట్టలేని వారి నుంచి ఇళ్లను స్వాధీనం చేసుకున్నా వాటిని మళ్లీ అమ్ముకోవడం ఆ సంస్థలకు కూడా భారమే. అందుకే ఆచితూచి అప్పులిస్తున్నాయి.

ఈ సమస్యకు మూలకారణం భారతీయ సమాజం ఆలోచనా ధోరణిలో కూడా ఉన్నదని చెప్పాలి. ఎన్నారైలు ఆర్థిక ఒత్తిడిని భరించగలమా లేదా అనే ఆచరణాత్మక దృక్పథం లేకుండా కొనుగోళ్లకు వెళుతున్నారు. కొత్తగా ఉద్యోగం ప్రారంభించిన యువతరం కూడా బీఎండబ్ల్యూ, బెంజి కార్లు కొనాలనుకుంటున్నారే తప్ప మధ్యశ్రేణి కార్లను తీసుకుని, ఆర్థికంగా స్థిరపడిన తర్వాత అప్‌గ్రేడ్ అవుదాం అనుకోవడం లేదు. ఇళ్ల కొనుగోలు విషయంలోనూ ఇదే జరుగుతున్నది. తమ తాహతు చూసుకోకుండా కొనేయడం అన్నది వారిని అనివార్యంగా కష్టాల్లోకి నెడుతున్నది. ఇప్పుడు కొనకపోతే మళ్లీ ఇళ్లు దొరకవేమో అన్నంత ఆత్రంగా ఎగబడి కొంటున్నారు. నిజానికి అమెరికా చాలా విశాలమైన దేశం. అయినప్పటికీ ఇళ్ల కోసం విచక్షణ లేకుండా ఎగబడటం వలన ఇప్పుడు మార్కెట్ దారుణంగా తయారైంది.

తమ సంపాదన వృథా కాకుండా పెట్టుబడులుగా మార్చుకోవాలనుకునే ఆలోచన మంచిదే గానీ.. ఆ పెట్టుబడులను స్వదేశంలో పెట్టుకోవటం మంచిది. భారత్‌లో రియల్ ఎస్టేట్ మార్కెట్ చాలావరకు స్థిరంగా ఉంది. అమెరికాలో ఉన్నంత డోలాయమాన పరిస్థితులు లేవు. ఆచితూచి అడుగు వేస్తే నష్టపోకుండా ఉంటారు.

○ కృష్ణమోహన్ దాసరి
జర్నలిస్ట్, డల్లాస్

శోకధ్రువ ప్రపంచంలో గాజాకాష్ఠం!

గాజాను తలచుకుంటే తల తిరిగి పడిపోతామేమో, గుండె పగిలి చస్తామేమో నన్న భయంతో ప్రపంచం అటువైపు కన్నెత్తి చూడడం లేదనిపిస్తోంది. ఇరవై మాసాల కాలంలో 70,000 మందిని, అత్యధికంగా పిల్లలను, మహిళలను బలి తీసుకున్న ఇజ్రాయెల్, దాని వెన్ను దన్ను అమెరికా అచ్చోసిన ఆంబోతుల్లా విశ్వం నడివీధుల్లో జోర విరుచుకు తిరుగుతున్నాయి. ఈ ఘన కార్యానికి గాను ట్రంప్‌కి ఈ ఏడాది నోబెల్ బహుమతి ఇవ్వాలని నరహంతకుల్లో నంబర్ వన్ జాబితాలో చేరిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సిఫారసు చేశాడు, పులికి తోడేలు వంత పాడినట్టు!

గాజా నేడొక నరరక్త జీవనది. ఈ రోజుటి లెక్క రేపటికి మాయమై మృతుల కొత్త సంఖ్య తెర మీదికి వస్తున్నది. చైనా, రష్యా సహా ఎవరూ దీనికి అడ్డుకట్ట వేయలేక పోవడం కంటే దయనీయస్థితి ఉండదు. అందుకే గాజాలో ఈ నిరంతర అగ్నివర్షం ఒక కలలా అనిపిస్తున్నది, మనం మానవేతర అమానుష సమాజంలో బతుకుతున్నామనే నమ్మలేని నిజం కళ్లకు కడుతున్నది. ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలతో అమెరికా విశ్వవిద్యాలయాలు అట్టుడికి పోతే ట్రంప్ ప్రభుత్వం ఆ ప్రదర్శనలలో పాల్గొన్న విదేశీ విద్యార్థులను బంధించి స్వదేశాలకు పంపించివేయటమే గాక, హార్వర్డ్ వర్సిటీకి నిధులను నిలిపివేసింది. కొలంబియా, కార్నెల్, నార్త్ వెస్ట్రన్ వంటి ప్రముఖ కళాశాలలపై కక్షతో వ్యవహరించింది. గాజన్ల రక్తంలో ట్రంప్ తనివితీరా స్నానం చేయడం ఎంతవరకు వెళ్లిందంటే వేలాదిమంది పాలస్తీనియన్లను బలి తీసుకోవడాన్ని ఖండించిన ఐక్యరాజ్యసమితి నియమిత హక్కుల స్వతంత్ర ఉద్యమకారిణి ఫ్రాన్సెస్కా ఆల్బనీస్‌పై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది.

ట్రంప్ రెండోసారి సారథ్యంలో అమెరికా తన పునాది ఆదర్శాలైన స్వేచ్ఛ, అవకాశాలు, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, సమానత్వం అనే మహత్తర అంశాలకు స్వస్తి చెబుతున్నది. ఒకప్పుడు అలీనోద్యమాన్ని నిర్మించిన ఇండియా ఇప్పుడు ట్రంప్‌కి ఇజ్రాయెల్‌కి దాసోహమంటున్నది. అమానుషాలను ప్రతిఘటించడంలో ప్రపంచం రోజురోజుకీ బలహీనమైపోతున్నది. దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సంఘటితం కాలేకపోతున్న అశక్తత నలువైపులా తాండవిస్తున్నది. దీనికి కారణాలను వెతికి అరికట్టకపోతే పాత రాచరికాలు ఆధునిక రూపంలో తిరిగి పుంజుకునే ప్రమాదం కనిపిస్తున్నది. అప్పుడు నియమబద్ధ అంతర్జాతీయ వ్యవస్థకు అంతిమ దినాలు దాపురిస్తాయి. ట్రంప్ ఆగ్రహ అనుగ్రహాలను బట్టి ప్రతి ఒక్కరూ బతకవలసి వస్తుంది. ట్రిగ్గర్ మీద వేలుపెట్టి దేశదేశాలను భయపెడుతున్న ట్రంప్ విధానాలను అదుపులో ఉంచే దిశగా మానవాళి లోతుగా ఆలోచించాలి. జనరల్ అసెంబ్లీ అభీష్టాన్ని కాలరాసే భద్రతా మండలికి శాశ్వతంగా తెరపడాలి.

బలవంతులు యూదు మత విశ్వాసాల ఆధారంగా ఇజ్రాయెల్ దేశానికి పాలస్తీనాలో ఉనికి కల్పించినప్పుడు అరబ్ దేశాలు సంఘటితంగా ప్రతిఘటించాయి. ఈజిప్ట్, సిరియా, లెబనాన్, ఇరాక్‌లు అరబ్ లీగ్ పతాకం కింద పోరాడాయి. అటువంటి అరబ్ ఐక్యత ఇప్పుడు గాలికి పేలపిండి అయిపోయింది. వాస్తవానికి యూదులకు అవసరమైన దానికంటే ఎక్కువ పాలస్తీనా భూభాగాన్ని మొదట్లోనే వారికి కట్టబెట్టారు. అప్పట్లో పాలస్తీనా జనాభాలో సగం మంది కంటే తక్కువమందిగా ఉన్న యూదులకు సగం పాలస్తీనా కంటే ఎక్కువ భూభాగం లభించింది. 1967లో ఆరు రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్ తన భూభాగాన్ని విశేషంగా విస్తరించుకున్నది. జోర్డాన్, ఈజిప్ట్, సిరియాలలో భాగాలను, జెరూసలేం పాత నగరాన్ని, సినాయి ద్వీపకల్పాన్ని, గాజాను, జోర్డాన్ నది పశ్చిమ తీరాన్ని, గోలాన్ హైట్స్‌ను దురాక్రమించుకున్నది. అగ్గికి ఆజ్యంలా టెల్ అవివ్‌కి బదులు జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించి అమెరికా తన రాయబార కార్యాలయాన్ని అక్కడికి తరలించింది.



ఏ దేశ సార్వభౌమాధికార పరిధులనూ గౌరవించే సంస్కారం, మర్యాద అమెరికాకు లేవు. ట్రిగ్గర్ మీద వేలుపెట్టి దేశదేశాలను భయపెడుతున్న ట్రంప్ విధానాలను అదుపులో ఉంచే దిశగా మానవాళి లోతుగా ఆలోచించాలి. నాటి సోవియట్ యూనియన్‌లా అమెరికాకు ఒక ప్రత్యామ్నాయ ధ్రువం తయారు కావడం నేటి తక్షణావసరం. కనీసం అలీనోద్యమం మాదిరిగా శాంతికాముక దేశాలన్నీ ఏకమై ట్రంపరితనాన్ని గట్టిగా ఎదిరించాలి. పిల్లి మెడపై కత్తిని వేలాడదీసే ఎలుకలు కావాలిప్పుడు.

ఇజ్రాయెల్ పుట్టినప్పటి నుంచి ఇంతవరకు అమెరికా దానికి చేసిన సాయం 300 బిలియన్ డాలర్ల దాకా ఉంటుంది. ఇందులో ఎక్కువ భాగం సైనిక సాయమే. 2023 అక్టోబర్ 7న హమాస్ మెరుపు దాడి చేసిన తర్వాత ఇజ్రాయెల్‌కు అమెరికా చేసిన అదనపు సైనిక సాయం విలువ 4.86 బిలియన్ డాలర్లు. మరొక సమాచారం ప్రకారం 2023 అక్టోబర్ 7 అనంతరం ఇజ్రాయెల్‌కు అమెరికా 17.19 బిలియన్ డాలర్ల సైనిక సాయం అందించడానికి నిర్ణయించింది. ఈ పొగరుతో ఇజ్రాయెల్ ఒక్క పాలస్తీనియన్ల పైనే కాదు ఇతర అరబ్ దేశాలపైనా దాడులకు దిగుతోంది. తాజాగా, సిరియాలోని డ్రూజ్ అనే మైనారిటీ వర్గంతో శాంతి చర్చలు విఫలం కావడంతో ఆ వర్గానికి దన్నుగా, సిరియా రాజధాని డమాస్కస్ పైనే ఇజ్రాయెల్ దాడులు చేపట్టింది. ఇటీవలనే ఇరాన్ నాయకులను కొందరిని హతమార్చిన అమెరికా ఇంతకుముందు 2020 జనవరిలో ట్రంప్ మొదటి విడత పరిపాలనా కాలంలో ఇరాన్ ముఖ్య సైనికాధికారి సోలేమానిని డ్రోన్ దాడి ద్వారా హతమార్చింది. మొన్న మొన్న మరికొందరు కీలక ఇరాన్ అధికారులను పొట్టనపెట్టుకున్నది. దేశాధినేత అలీ ఖమేనీనే హతమార్చాలని చూసింది. ఆయన కొన్ని రోజులు బంకర్‌లో తల దాచుకున్నారు. ఏ దేశ సార్వభౌమాధికార పరిధులనూ గౌరవించే సంస్కారం, మర్యాద అమెరికాకు లేవు. దానిని, దాని విష పుత్రిక ఇజ్రాయెల్‌నూ ఎదుర్కోడం దక్షిణాసియా దేశాలకు సాధ్యం కాదు. అక్కడి పాలకులు తమ ప్రజల్లోని పోరాట శక్తిని తామే చంపివేస్తున్నారు. దీనికి తోడు అంతటా ఆవహించిన పెట్టుబడిదారీ మారణాస్త్రమైన వినియోగ సంస్కృతి అక్కడా వేళ్లూనుకున్నది.

వాస్తవానికి ప్రపంచ ఆయిల్ నిల్వలలో అధిక శాతం ఉన్న పశ్చిమాసియా దేశాలు ఆర్థికంగా అత్యంత బల సంపన్నమైనవి. ప్రపంచ చమురు నిల్వల్లో 60 శాతం వరకు పశ్చిమాసియాలో ఉన్నాయని కొన్ని అంచనాలు చెబుతున్నాయి. అత్యధికంగా ఆయిల్ నిల్వలున్నది సౌదీ అరేబియా కాగా దానికి చేరువలో ఆ తర్వాత స్థానంలో ఇరాన్ ఉన్నది. ఇంకా ఇరాక్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కతర్, ఒమన్ తదితర దేశాల్లో ఆయిల్ నిల్వలు దండిగా ఉన్నాయి. ఇంత ఆర్థిక శక్తి ఉన్నందుకు, ఇందుకు తగ్గట్టు పరిశోధన రంగంలో ముందుండి అంతర్గత విబేధాలు లేకుండా ఉండి ఉంటే పశ్చిమాసియా దేశాలు అమెరికా సహా మొత్తం ప్రపంచాన్ని చెప్పుచేతల్లో ఉంచుకోగలిగేవి. ప్రధాన ఆయిల్ ఉత్పత్తి దేశాలు సౌదీ, ఇరాన్‌ల మధ్య నిన్న మొన్నటి వరకు వైషమ్యాలు తీవ్ర స్థాయిలో ఉండేవి. ఈ రెండింటి మధ్య గల సున్నీ (సౌదీ) షియా (ఇరాన్) తేడాలను అమెరికా వాడుకుంటూ వచ్చింది. సౌదీ అరేబియా అమెరికా జేబులో బొమ్మగా అమరిపోతే అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇరాన్ సవాలుగా నిలబడింది. చైనా చొరవతో ఇటీవలనే ఈ రెండు దిగ్గజ దేశాలు దగ్గర అవుతుండడం మంచి పరిణామం.

ఒకవైపు ఆయుధ బలంతో ఇంకోవైపు సుంకాల అంకుశాలతో ట్రంప్ దేశ దేశాలను వణికిస్తున్నాడు. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమాన్ని అడ్డుకునే నెపంతో అమెరికా దానిపై ఆంక్షలు విధించి దాడులకు తెగబడుతున్నది. ఇంకోవైపు అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌కు లొంగిపోయేలా చేసే ఎత్తుగడను పాటిస్తున్నది. ఈజిప్ట్–ఇజ్రాయెల్ మధ్య అమెరికా ప్రోత్సాహంతో 1977లోనే శాంతి ఒప్పందం కుదిరింది. అప్పుడు ఈజిప్ట్ అధినేత అన్వర్ సాదత్ ఒక గొప్ప సత్యాన్ని చెప్పాడు. "మధ్య (దక్షిణాసియా) ప్రాచ్యంలో 99శాతం కార్డులు వాషింగ్టన్ చేతుల్లో ఉన్నాయి. సోవియట్ యూనియన్ కుప్పకూలడం ఆ ప్రాంతాన్నంతటినీ అమెరికా చెప్పుచేతల్లోకి నెట్టివేసింది" అని సాదత్ తేల్చి చెప్పాడు. అరబ్–ఇజ్రాయెల్ మధ్య అమెరికా కుదిర్చిన ప్రతి ఒప్పందం ఇజ్రాయెల్ శక్తిని పెంచి పాలస్తీనాను, అరబ్ ఐక్యతను దారుణంగా దెబ్బతీసింది. పాలస్తీనా అథారిటీ (పీఏ) పట్టు కోల్పోయి హమాస్‌ను అక్కడి ప్రజలు నమ్మడం బలపడిన తర్వాత వారి మధ్య అనైక్యతను చూపి అరబ్ దేశాలు పాలస్తీనా పోరాటానికి మద్దతు తగ్గించివేశాయి.

అరబ్–ఇజ్రాయెల్ మధ్య 2020లో ట్రంప్ ప్రభుత్వం కుదిర్చిన అబ్రహామ్ ఒప్పందాలు అరబ్ ఐక్యతకు పూర్తిగా తెరదించి పాలస్తీనా ప్రజలను దిక్కు మొక్కు లేనివారుగా చేశాయి. చైనా తర్వాత అయినా మరో దృఢమైన శక్తిగా ఎదగాలని చూస్తున్న ఇండియా కలలను సైతం ట్రంప్ కాల రాస్తున్నాడు. మోదీతో స్నేహం ట్రంప్ మోసకారి నాటకమే అనడానికి నిదర్శనం రష్యా ఆయిల్ కొంటున్నందుకు ట్రంప్ 100 శాతం సుంకాలు విధించదలచిన దేశాల్లో ఇండియా కూడా ఉండడమే. మరోవైపు యూరప్ దేశాలనూ ఆయన భయపెడుతున్నాడు. ఉక్రెయిన్ విషయంలో ఆయన తీసుకున్న విధానం దీనిని ఎత్తిచూపుతున్నది. అందుచేత ఇప్పుడు ప్రపంచం తక్షణం పట్టించుకోవలసిన విషయం– ప్రతి రోజూ 50 నుంచి 100 దాకా స్త్రీలూ, పిల్లల ప్రాణాలను అమెరికా–ఇజ్రాయెల్‌లకు బలి ఇచ్చుకుంటున్న గాజాను ఈ నర రక్త వరద నది నుంచి కాపాడడం. అంతేగాక నాటి సోవియట్ యూనియన్‌లా అమెరికాకు ఒక ప్రత్యామ్నాయ ధ్రువం తయారు కావడం నేటి తక్షణావసరం. కనీసం అలీనోద్యమం మాదిరిగా శాంతికాముక దేశాలన్నీ ఏకమై ట్రంపరితనాన్ని గట్టిగా ఎదిరించాలి. పిల్లి మెడపై కత్తిని వేలాడదీసే ఎలుకలు కావాలిప్పుడు.

■ గార శ్రీరామమూర్తి
సీనియర్ పాత్రికేయులు

నవ్య నాటకబ్రహ్మ రతన్ థియాం

ప్రముఖ నాటక ప్రయోక్త, భారతీయ నాటకరంగ స్రష్ట అనదగ్గ దర్శకుడు పద్మశ్రీ రతన్ థియాం ఈ నెల 23న కన్నుమూశారు. రతన్ థియాంను పోలిష్ నాటక ప్రయోక్త గ్రోటోవిస్కితోను, బ్రిటిష్ నాటక దర్శకుడు పీటర్ బ్రూక్‌తోనూ పోలుస్తారు. థియాం బహుముఖ ప్రజ్ఞాశాలి. చిత్రకారుడు, రచయిత, మణిపురి నృత్యకారుడే కాక హిందూస్థానీ సంగీతంలోనూ ఆయన నిపుణుడు. థియాం 1948లో జన్మించారు. 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'లో శిక్షణ పొందారు (అనంతర కాలంలో ఆ సంస్థకు డైరెక్టర్‌గా పనిచేశారు).



థియాం యువకుడిగా ఉన్నప్పుడు క్యూబా వెళ్లి చెగువేరాలా విప్లవకారుడు అవ్వాలి అనుకున్నారట! ఆయన నాటకాల్లో విప్లవభావాలు కనిపిస్తుంటాయి. సంప్రదాయాన్ని, సమకాలీనతను రెంటినీ థియాం సమ్మిళితం చేశారు. 70, 80వ దశకాలలో వచ్చిన 'థియేటర్ ఆఫ్ రూట్స్' ఉద్యమం ఆ కాలపు నాటక ప్రయోక్తలను ఎంతగానో ప్రభావితం చేసింది. మీతీ భాషలో థియాం రాసిన 'చక్రవ్యూహం' అనే నాటకం ఆనాటి నాటకవేత్తలకు ఓ కొత్త మార్గాన్ని చూపింది. సంస్కృత నాటక రచనను కానీ, పాశ్చాత్య రచనను కానీ థియాం తన సాంస్కృతిక నేపథ్యం నుంచి కొత్తగా చూసి, దానికి తనదైన ప్రదర్శనా భాషను అందిస్తారు. ఆయన ఇంఫాల్‌లో 'కోరస్ రిపర్టరి'ని స్థాపించారు.

ఒకసారి.. ఇబ్సెన్ రాసిన 'వెన్ వుయ్ డెడ్ అవేకెన్' ప్రదర్శనను భారత నాటకరంగ మహోత్సవంలో భాగంగా ఢిల్లీలోని కమాని ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్నారు. ఆడిటోరియం ప్రేక్షకులతో కిక్కిరిసిపోయి ఉంది. నటుల సంభాషణలు అర్థం కావడం లేదు. కానీ ప్రేక్షకులు మాత్రం నిశ్శబ్దంగా, కుతూహలంగా చూస్తున్నారు. ఒక్కో సీన్‌లోని దృశ్యాలు ప్రేక్షకులను ఓ కొత్త ఊహాలోకంలోకి తీసుకెళ్తున్నాయి. చీకటిలో, నిశ్శబ్దంలో పారదర్శకమైన కాంతి– కదులుతున్న బోటు మీదనో, ఒక ఆయుధం మీదనో, ఒక నటి తలపైనో పడుతుంటే ప్రేక్షకులు కొత్త అనుభవం పొందుతున్నారు. స్టేజీ మీద పావురాల జంటలు ఎగురుతుంటాయి. ఒక సీన్‌లో నీడలాంటి సాల్వేడార్ డాలి చిత్రం, కరిగిపోతున్న గడియారం కనిపిస్తుంది. ఇలా.. థియాం నాటకాలు చూస్తుంటే పెయింటింగ్స్ జీవం పోసుకుని కదులుతున్నట్టుగా ఉంటాయి. రతన్ థియాం నాటక ప్రయోగంలో రెండు ముఖ్యమైన అంశాలు ఉంటాయి. ఒకటి– చీకటి, రెండు– నిశ్శబ్దం. ఈ రెండూ రంగస్థలంపై చాలా ముఖ్యమైనవి. 'వెర్బల్ డ్రామా'లో చిక్కుకున్న మన నాటక పరిషత్‌లు ఆయన నాటకాల నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.

– జి.ఆర్ శివ్వాల

ప్రాంతీయ అస్తిత్వం: భ్రమలూ, వాస్తవాలూ!

'ప్రాంతేతరుల విగ్రహాల ఏర్పాటు తెలంగాణ అస్తిత్వానికి వ్యతిరేకం' అని ఈ మధ్య ఒక వార్త చదివాను. ఈ వార్త, 'తెలంగాణ పరిరక్షణ వేదిక' వారికి సంబంధించినది. "టాంక్ బండ్‌పై ఉన్న ఆంధ్ర ప్రాంత వైతాళికుల విగ్రహాలను గౌరవంగా ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని తీర్మానించారు. వాటి స్థానంలో తెలంగాణ స్ఫూర్తిప్రదాతల విగ్రహాలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు" అని కూడా, ఆ వార్తలో ఉంది. "ఇంకెన్నాళ్ళు ఆంధ్రోళ్ళకు జాగా? మాకెందుకు మీ విగ్రహాలు?" అంటూ కూడా, ఆ సమావేశం జరిగినట్టు ఆ వార్తలో ఉంది. ఆ వార్త, ప్రాంతీయ అస్తిత్వం గురించీ, దానికి ఒక గుర్తుగా భావించే విగ్రహాల గురించీ, మరోసారి ఆలోచించేలా చేస్తుంది.

ప్రాంతీయ అస్తిత్వ స్పృహ కలిగించే ఒక భ్రమ ఏమిటంటే, ఒక ప్రాంతం అంతా, ఒకే రాయినించీ చెక్కిన శిల్పం అని! ఆ భ్రమలో పడినప్పుడు, ఆ ప్రాంతంలోనే ఉన్న అసమానతలూ, వైరుధ్యాలూ కనపడవు. అవి ఏవంటే: ప్రతీ ప్రాంతంలోనూ (ప్రస్తుత విగ్రహ తరలింపు ఉద్యమకారులు ప్రస్తావిస్తున్న 'ఆంధ్రోళ్ళ'న్న ఆంధ్రప్రదేశ్‌తో సహా, అన్ని ప్రాంతాలలోనూ), ఏ శ్రమలూ చెయ్యని ఆస్తిపర వర్గాలూ– ప్రధానంగా శ్రమల మీదే జీవించే శ్రామిక వర్గాలూ ఉంటాయి. అంటే, ఒక ప్రాంతంలో జనాభా, భూములూ, పరిశ్రమలూ, గనులూ, రవాణా వంటి అనేక రకాల ఉత్పత్తి సాధనాలను ఆస్తిగా కలిగిన వారిగానూ; అవేవీ లేనివారిగానూ, ఉన్నా అతి తక్కువ స్థాయిలో కలిగివున్న వారిగానూ, విడిపోయి ఉంటారు. 'ఉన్నత స్థాయి' మేధా శ్రమలు చేసేవారూ, 'అట్టడుగు స్థాయి' శారీరక శ్రమలు చేసేవారూ ఉంటారు. ప్రతీ ప్రాంతంలోనూ, అనేక కులాలు, వాటి మధ్య ఎన్నో అసమానతలుండడమూ చూడవచ్చు. ఒకే ప్రాంతంలో, మళ్ళీ కొన్ని ప్రాంతాలు 'అభివృద్ధి' చెందినవనీ, 'వెనకబడినవి' అనీ కొన్ని తేడాలు కనిపిస్తాయి. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో, స్త్రీ–పురుష అసమానత్వమూ ఉంటుంది. స్థానికంగా ఉన్న ఇన్ని రకాల అసమానత్వాల్నీ, వైరుధ్యాల్నీ, ప్రాంతీయ అస్తిత్వ స్పృహ అనే మాయతెర కప్పివేస్తుంది. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమం జరిగిన కాలంలో, కొంత బలహీనంగానైనా, కొన్ని అసమానతల గురించీ, అణచివేతల గురించీ స్పృహ ఉండేది. అందుకే అప్పట్లో 'సామాజిక తెలంగాణ' కావాలనీ, 'ప్రజాస్వామిక తెలంగాణ' రావాలనీ, నినాదాలు కొన్ని వినవచ్చాయి. అలా అన్న ఉద్యమకారుల్లో కొందరు మేధావులు, ఆకర్షణీయమైన 'నియామకాలు' పొంది, పదేళ్ళ పాటు అప్పటి కొత్త పాలకుల ఒడిలో, బరువెక్కిన 'పర్సు'లతో, సేద తీరారు. మరికొందరు ఇప్పటి పాలకుల ఒడిలో సేద తీరుతున్నారు.

ఇప్పుడు ఈ కొత్త వార్త ప్రకారం, ఆ నినాదాలు తెరమరుగై, స్థానిక విగ్రహారాధనా నినాదం మొదలైంది. 'గౌరవంగా'నే అయినా, స్థానికేతరుల విగ్రహాలను తరలించాలన్నప్పుడు, 'ఆంధ్రోళ్ళు' మాత్రమే స్థానికేతరులా అనే ప్రశ్న వస్తుంది. తెలంగాణలో పుట్టిపెరిగిన వారు కానివారందరూ, స్థానికేతరులే అవుతారు గదా? అలాంటప్పుడు, అంబేద్కర్ విగ్రహాన్ని మధ్యప్రదేశ్‌లోని మహోవ పట్టణానికీ, పూలే విగ్రహాన్ని మహారాష్ట్రలోని పూణే నగరానికీ, జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని బిహారులోని చాంద్వా గ్రామానికీ, గాంధీ విగ్రహాన్ని గుజరాత్‌లోని పోరుబందరుకీ, ఇలా 'గౌరవంగా'నే తరలించాల్సిందే గదా?

2009లో టాంక్ బండ్ ఘటన తర్వాత, ఈ వార్త వల్ల, మరోసారి తేలింది ఏమంటే: విగ్రహాలకు ప్రాంతీయ బేధాలుంటాయి అని! అంతేకాదు, వాటికి కులపరమైనా, రాజకీయపరమైనా బేధాలూ, శతృత్వాలూ ఉంటాయి! ఈ విషయం, విగ్రహారాధకులకు తెలియనిది కాదు. దేశంలో కొన్ని చోట్ల, అంబేద్కర్ విగ్రహాల్నీ, పెరియార్ విగ్రహాల్నీ వికృత పరిచినప్పుడూ, విరగ్గొట్టినప్పుడూ; త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసినప్పుడూ, ఆ శతృత్వాల గురించి వినలేదా, చూడలేదా? యాభై ఏళ్ళనాడు, కలకత్తాలో, గత కాలపు సంఘసంస్కర్తల విగ్రహాలను, నక్సల్బరీ ఉద్యమకారులు విరగ్గొట్టలేదా?

స్థానిక విగ్రహారాధకులు అందరూ, అందరి విగ్రహాలనీ అంగీకరిస్తారని ఏమీ లేదు. వారి రాజకీయ వైఖరిని బట్టో, మత విశ్వాసాల్ని బట్టో, కులాభిమానాన్ని బట్టో, కులమతాల దామాషాలను బట్టో, వాదనలు చేసే అవకాశం ఉంది. స్ఫూర్తిప్రదాతల విగ్రహాలలో 'ఫలానా మతం వారివి ఇన్నీ, ఫలానా కులం వారివి ఇన్నీ, మళ్ళీ అందులో ఫలానా వారే స్ఫూర్తిప్రదాతలు'– ఇలా ప్రతిపాదనలు చేయడానికి అవకాశం ఉంది. ఒకరు నిజాం విగ్రహం వద్దు, పటేల్ విగ్రహం ఉండాలనొచ్చు! ఇంకొకరు రాజా వెంకట్రామారెడ్డి విగ్రహం వద్దు, భాగ్యరెడ్డి వర్మ విగ్రహం ఉండాలనొచ్చు.

విగ్రహాల తయారీ అనేది, నిస్సందేహంగా ఒక గొప్ప కళే! అయినా, వాటిని బహిరంగ ప్రదేశాలలో పెట్టడం వల్ల, విగ్రహాల రూపంలో ఉన్న ఆ వ్యక్తులకి అవమానమే! దుమ్మూ, ధూళితో; పిట్టల రెట్టలతో కొన్నాళ్ళు – జయంతులలో, వర్ధంతులలో వచ్చేవరకూ – అలా అశుభ్రంగా పడివుండడం ఒక అవమానం. ఆ విగ్రహాల అసలు మనుషుల భావజాలాన్ని వ్యతిరేకించేవారి దాడులు, ఇంకో రకం అవమానం! వర్గాలుగా, వర్గ విభాగాలుగా; వందల కులాలుగా, వేల ఉపకులాలుగా, చీలిపోయివున్న సమాజంలో, విగ్రహాలు– అవి స్థానికులవైనా, జాతీయస్థాయి వారివైనా, అంతర్జాతీయస్థాయి వారివైనా– దాడులకూ, అగౌరవాలకూ గురికావలిసిందే! అందుకే, ఆ విగ్రహాలను, వాటి ఆరాధకులు, స్వంత మ్యూజియంలలోనో, ఇళ్ళల్లోనో, తమ సంస్థల ఆవరణల్లోనో పెట్టుకుని 'పరిరక్షించు'కోవాలి. అంతేగానీ, బహిరంగ ప్రదేశాలలో పెట్టడం సరికాదు!

స్థానికేతరుల విగ్రహాలను తరలించాలన్నప్పుడు, 'ఆంధ్రోళ్ళు' మాత్రమే స్థానికేతరులా అనే ప్రశ్న వస్తుంది. తెలంగాణలో పుట్టిపెరిగినవారు కానివారందరూ, స్థానికేతరులే అవుతారు గదా? అలాంటప్పుడు, అంబేద్కర్ విగ్రహాన్ని మధ్యప్రదేశ్‌లోని మహోవ పట్టణానికీ, పూలే విగ్రహాన్ని మహారాష్ట్రలోని పూణే నగరానికీ, జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని బిహారులోని చాంద్వా గ్రామానికీ, గాంధీ విగ్రహాన్ని గుజరాత్‌లోని పోరుబందరుకీ, ఇలా 'గౌరవంగా'నే తరలించాల్సిందే గదా?



అసలు, 'వైతాళికులు', 'మహానాయకులు', 'త్యాగధనులు', 'సంస్కర్తలు', 'విప్లవకారులు', 'మహా కవులు'– అనే పేర్లతో, కోట్లాది మానవుల్లో కొందరిని విడదీసి, వారి విగ్రహాలు తయారు చేయించడం సమానత్వ సూత్రానికి విరుద్ధం. ఆ 'గొప్ప, గొప్ప' వారందరూ, అలా గొప్ప స్థాయికి రావడానికి, అనేక అనుకూల పరిస్థితులుండడమే కారణం. వాళ్ళు పుట్టుకతోనే మహాత్ములు కాదు. వాళ్ళు, తమకు చేతనైనదీ, చేయగలిగినదీ చేశారు. వాళ్ళనెవరూ బలవంతం చెయ్యలేదు. వాళ్ళేమీ, తమని విగ్రహాలుగా మలచమనీ, ఆరాధించమనీ కోరలేదు. పైగా, వాళ్ళల్లో కొందరి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక భావాలు, అసమానతలకూ, అణచివేతలకూ అనుకూలమైనవిగానూ, కొందరివి వ్యతిరేకమైనవిగానూ ఉంటాయి. ప్రాంతీయ అస్తిత్వం మత్తులో, అందరినీ నెత్తిన పెట్టుకోవాలా?

శిల్పకళాకారులు, భుక్తి కోసం కాక, కళా దృష్టితో, తమ కళాభినివేశాన్ని వ్యక్తపరచుకోవడానికి, శిల్పాలని చెక్కడం, విగ్రహాలను తయారు చేయడం, సహజంగా జరగవలిసిన కార్యం. అలాకాక, ప్రభుత్వాల కోసమో, ఉద్యమ సంస్థల కోసమో, కొంత 'కిరాయి'కి జరగవలిసిన కార్యం కాదు.

రైతుల ఆత్మహత్యలతో, కులోన్మాద హత్యలతో, క్రూరమైన కార్మిక వ్యతిరేక చట్టాలతో, పౌరహక్కుల్ని కాలరాసే నిర్బంధ చట్టాలతో, నిరుద్యోగ సమస్యతో, అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితికి వ్యతిరేకంగా ఏ కార్యక్రమాలు చెయ్యాలో, అసమానతలకు గురి అవుతున్న వారిని ఎలా సంఘటితపరచాలో, ఆలోచించడం మాని జరిపే ఈ స్థానిక విగ్రహారాధనా ఉద్యమం, మైకు ముందు మేధోకాలక్షేపానికి తప్ప దేనికి పనికివస్తుంది?

"ఔర్ భీ దుఖ్ హై జమానే మె మొహొబ్బత్ కే సివా" ("ప్రపంచంలో, ప్రేమని మించిన దుఃఖం ఉంది!") అన్నాడు ఫైజ్ అహమద్ ఫైజ్ అనే కవి. 'ప్రేమ' అన్న చోట, 'స్థానిక విగ్రహాల మీద ప్రేమ' అనే మాటని పెట్టుకోవాలి ఇప్పుడు!

● బి.ఆర్. బాపూజీ

ఆరోగ్యంతో చెలగాటం


- నగరంలో ఇష్టారాజ్యంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్ల తీరు
- కల్తీ పదార్థాలతో ఆటలాడుతున్న నిర్వాహకులు
- జీడబ్ల్యూఎంసీలో ఫుడ్‌సేఫ్టీ వింగ్ జాడేది?




7



అగలయ్య గుట్ట మీద కామ క్రీడలు







గుట్టలపై ఛీ..ఛీ..

అశ్లీల, అసభ్య చేష్టలకు పాల్పడుతున్న జంటలు

- నగరంలోని అగ్గలయ్య, పద్మాక్షి, సిద్ధేశ్వర గుట్టలే స్థావరాలు
- వారి ప్రవర్తన చూసి నివ్వెరపోతున్న పర్యాటకులు, భక్తులు
- ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్న పోకిరీలు
- వేధింపుల బారిన పడిన వారు పోలీసులను ఆశ్రయిస్తున్న వైనం

వరంగల్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొన్ని పర్యాటక స్థలాలు అశ్లీల కార్యకలాపాలకు నెలవుగా మారాయి. ప్రధానంగా గుట్టలపైన గల రహస్య ప్రదేశాలు ఇందుకు వేదికగా నిలుస్తున్నాయి. యువతీ యువకుతో పాటు, వివాహేతర సంబంధాలు పెట్టుకున్న వారికి ఇవి అడ్డాగా మారాయి. లాడ్జిల్లో చిరునామాలు అడుగుతుండటంతో, బ్యాచ్‌లర్స్ రూమ్‌లలో ఇంటి యాజమానులు ప్రశ్నిస్తుండటంతో ఏ నిఘా లేని గుట్టలను ఎంచుకుంటున్నారు. హనుమకొండలోని పద్మాక్షి, అగ్గలయ్య గుట్టలతో పాటు, సిద్ధేశ్వర ఆలయ పరిసరాలు, న్యూశాయంపేటలోని దేనగుట్ట పరిసరాలు, వరంగల్ ఉర్సు గుట్ట, కాజీపేటలోని క్వారీ గుట్టలతో పాటు నగరంలోని ఇంకా అనేక స్థలాల్లో జంటలు అశ్లీల చేష్టలకు పాల్పడుతున్నాయి. గుట్టల పైన గల పచ్చని మైదాన ప్రాంతంలో, రాళ్ల మధ్య ఉన్న గుహల్లో ఏకాంతంగా గడుపుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పగలు, రాత్రిళ్లు గుట్టలపై జంటలు సంచరిస్తునట్లుగా వెల్లడిస్తున్నారు. వీరి విశృంఖల చేష్టలతో భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. దర్శనం పేరిట వచ్చి పురోహితులు, భక్తుల కళ్లుగప్పి గుట్టల్లోని గుహల్లోకి జారుకుంటున్నట్లు పేర్కొంటున్నారు.

పోకిరీల దాడులు.. వేధింపులు..

గుట్టల్లోని గుహలు, చెట్లపొదల మధ్య ఏకాంతంగా గడుపుతున్న జంటలను కొందరు పోకిరీలు పట్టుకుని బెదిరిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. జంటలు సన్నిహితంగా ఉన్న ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేయడం పరిపాటిగా మారింది. ఏకాంతంగా గడిపిన ఫొటోలు, వీడియోలను చూపి అప్పటికప్పుడు డబ్బులు దండుకునే వారు కొందరైతే, వాటిని సేవ్ చేసుకొని ఆర్థిక అవసరాలు ఏర్పడినప్పుడల్లా బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలుచేసే వారు మరికొందరు. కొన్ని సందర్భాల్లో యువకులతో ఏకాంతంగా వున్న యువతులను బెదిరిస్తూ.. తమతో గడపాలని వేధిస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఇలా గుట్టల్లో జరిగిన అనేక సంఘటనలు పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లినట్లు సమాచారం.

హనుమకొండలోని అగ్గలయ్య గుట్టపైన కొన్ని నెలల కిందట భద్రాచలానికి చెందిన ఓ యువతి.. నగరానికి చెందిన యువకుడు ఏకాంతంగా గడుపుతుండగా ముగ్గురు యువకులు బెదిరించి డబ్బులు తీసుకోవడమే కాకుండా, యువతికి తరచుగా ఫోన్ చేస్తుండటంతో ఆమె షీటీమ్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో వారు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని హనుమకొండ పోలీసులకు అప్పగించారు.



సోమవారం ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ తన కెమెరా నిఘా నేత్రంతో గుట్టలను పరిశీలించినప్పుడు అనేక జంటలు అశ్లీల చేష్టలకు పాల్పడుతున్న దృశ్యాలు కనిపించాయి. తాము బహిరంగ ప్రదేశంలో వున్నామన్న ఇంగితాన్ని మరిచి వారు ప్రవర్తిస్తున్న తీరు నివ్వెరపరిచింది. పర్యాటక స్థలాలను, పవిత్ర ప్రదేశాలను అపవిత్రం చేస్తున్న జంటలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

- బ్లాక్‌మెయిలర్ చేతిలో ప్రభుత్వం నడవడం బాధాకరం
- కాంగ్రెస్ బోగస్ హామీల వల్ల ప్రజలు మోసపోయారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న దయాకర్‌రావు

హసన్‌పర్తి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని ఒక బ్లాక్‌మెయిలర్ చేతిలో ప్రభుత్వం నడవడం బాధాకరమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హసన్‌పర్తిలోని డీఎస్‌కే గార్డెన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ అధ్యక్షుడు బండి రజనీకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసిందన్నారు. బోగస్ హామీల వల్ల ప్రజలు మోసపోయారన్నారు. తెలంగాణలో సరైన పాలన లేక ప్రజలు ఆరిగోస పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒక మోసపూరితమైన పథకమన్నారు. సర్వేలన్నీ బీఆర్‌ఎస్ పార్టీ వైపే ఉన్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం సీట్లు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని అన్నారు. ప్రజలు రేవంత్‌రెడ్డి పాలనలో అసమ్మతితో ఉన్నారని అన్నారు. భవిష్యత్తులో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తను కలుపుకొని పోయి పార్టీ గెలుపు కోసం కష్టపడేలా నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ క్లస్టర్ ఇంచార్జీలు కందుకూరి చంద్రమోహన్, పావుశెట్టి శ్రీధర్, బిల్ల ఉదయ్‌రెడ్డి, రాజునాయక్, ఎల్లావుల కుమార్‌యాదవ్, మ్యాక భగవాన్‌రెడ్డి, పెసరు శరత్‌రెడ్డి, విక్టర్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్‌తో పాటు ఆయా గ్రామాల కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కబంధ హస్తాల్లో విద్యారంగం

- 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' సినిమాను ఆదరించాలి
- నటుడు ఆర్. నారాయణమూర్తి



వడ్డేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల్లో విద్యారంగం చిక్కుకుందని దర్శక నిర్మాత, నటుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కిన 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' సినిమా ఆగస్టు 22న విడుదలవుతుందని దీన్ని ఆదరించాలని కోరారు. పేపర్ లీకేజీ అనేది సర్వసాధారణంగా మారిందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీక్ అవ్వడం ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం అంటే సమాజాన్ని నాశనం చేయడమేనని దుయ్యబట్టారు. సేవారంగంగా ఉండాల్సిన విద్యా రంగాన్ని వ్యాపార రంగంగా మార్చారని నారాయణమూర్తి మండిపడ్డారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ , ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు సాయి, విద్యార్థి సంఘాల నాయకులు వేల్పుల చరణ్, రవితేజ, వినయ్, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' చదువులు

పాఠశాల స్థాయిలోనే 'పని' నేర్చుకునేలా కార్యాచరణ



ఫ్యాషన్ డిజైన్‌లో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్య
- కొత్తగా 19 కోర్సులు ప్రారంభం
- సంప్రదాయ వృత్తి కోర్సులకు ఇవి భిన్నం
- స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా బోధన
- ఉమ్మడి జిల్లాలో 30 పాఠశాలల్లో అందుబాటులో కోర్సులు



ఫ్యాషన్ డిజైన్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

హనుమకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో వృత్తి విద్య కోర్సులను మరింతగా అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల లభ్యత, వృత్తి విద్యా కోర్సుల అధ్యయనానికి సామగ్రి అమర్చేందుకు తగిన వసతులు ఉన్న పాఠశాలలను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా 241 ఎంపిక చేసింది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 30 పాఠశాలలు ఉన్నాయి. ఆరు జిల్లాల్లో- హనమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అయిదేసి పాఠశాలల చొప్పున ఎంపికయ్యాయి. హనుమకొండ జిల్లాలో ఎల్కతుర్తిలోని మాడల్ హైస్కూల్, కమలాపూర్‌లో మాడల్ హైస్కూల్, భీమదేవరపల్లిలోని మాడల్ హైస్కూల్, హనుమకొండలోని మర్కజీ ఉన్నత పాఠశాల, ఆత్మకూరులోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ) వీటిలో ఉన్నాయి.

19 రకాల వృత్తి కోర్సులు

మొత్తం 19 రకాల వృత్తి విద్య కోర్సులను అందుబాటులో ఉంచి పదో తరగతి వరకు ఉన్న పాఠశాలలకు వాటిలో రెండు కోర్సులను ఎంచుకోవాలని ప్రభుత్వం సూచించింది. పదో తరగతి పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి కల్పించే జనాదరణ పొందిన కోర్సులు అందిస్తారు. ఇందుకు అర్హతలున్న బోధకులను నియమిస్తారు. విద్యార్థుల ఆసక్తి మేరకు అదే ఆవాసంలో లేదా సమీప పట్టణంలో మంచి ఆదరణ కలిగిన రెండు కోర్సులను ఎంచుకొని తమకు సమాచారం ఇస్తే అందుకు తగిన ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుంది. పదో తరగతి కీలకం కావడంతో రెగ్యులర్ తరగతుల బోధనకు అంతరాయం కలుగకుండా అదనపు సమయంలో వృత్తి విద్య నేర్పిస్తారు. పాఠశాల బోధనతో పాటు ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తారు. వ్యవసాయానికి సంబంధించిన కోర్సులలో క్షేత్ర సందర్శన కూడా ఉంటుంది. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా కోర్సులను ఎంపిక చేసుకునే బాధ్యత ఆయా పాఠశాలల ఉపాధ్యాయులదే. పదో తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో రెండు దశల్లో వృత్తి విద్య బోధిస్తారు. 9వ తరగతి విద్యార్థులకు లెవల్-1 పేరిట ఏదైనా కోర్సు నేర్చుకోవాలని మానసికంగా సిద్ధం చేస్తారు. రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసే నాటికి విద్యార్థులు నేర్చుకున్న అంశంలో పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తారు. మిగతా రెండు దశలను ఇంటర్ వరకు ఉన్న విద్యా సంస్థల్లో అమలు చేస్తారు.

కొత్త కోర్సులు

అగ్రికల్చర్ టెక్నాలజీ, బ్యూటీషియన్, ఎలక్ట్రికల్ వైరింగ్, ఐటీ టెక్నాలజీ, హోమ్ పర్నీచర్, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్, ప్లంబింగ్, స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీస్ అండ్ ఇన్సురెన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్ కేర్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, ఆటోమోటివ్, రిటైల్ మార్కెటింగ్ తదితర కోర్సులను పదో తరగతిలోపే నేర్చుకోవచ్చు. ఆసక్తి ఉంటే ఇంటర్మీడియట్‌లో గానీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల్లోగానీ చేరి అనుబంధంగా నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు.

నైపుణ్యాలు లేక...

నైపుణ్యాలు లేకపోవడంతో ఎంతో మంది గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ పట్టభద్రులు నేడు ఉపాధికి నోచుకోలేకపోతున్నారు. అలాగని మార్కెట్‌లో అవకాశాలు లేవని కాదు. కావల్సిందల్లా వాటిని ఒడిసిపట్టుకునేందుకు కావల్సిన నైపుణ్యాలే అని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. చదువుతో పాటు భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా స్కిల్స్ నేర్చుకుంటున్న వారిని గ్లోబల్ కంపెనీలు వెతికి మరీ పట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రపంచ వ్యాప్త డిమాండ్‌కు తగ్గట్టుగా వృత్తి విద్య కోర్సులను బోధిస్తోంది. విద్యార్థులకు పదో తరగతిలో పాటు వృత్తి విద్యను నేర్పిస్తే చదువు పూర్తయిన తర్వాత స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశముంటుంది. ఈ ఆలోచనతోనే పదేళ్ల క్రితం ఆదర్శ పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులు ప్రవేశపెట్టారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పీఎం శ్రీ పాఠశాలలకూ విస్తరిస్తోంది. ఒక్కో బడిలో రెండేసి కోర్సులు ప్రవేశపెడుతున్నారు.

పలు అవకాశాలు:

ఇంటర్ ఒకేషనల్ కోర్సుగానీ, ఐటీఐ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యార్థులకు అవకాశాలున్నాయి. ఒకేషనల్ వారు జనరల్ విద్యార్థులతో సమానంగా బీఏ, బీకాం, డిగ్రీల్లో ప్రవేశాలు పొందవచ్చు . బ్రిడ్జి కోర్సుతో బీఎస్‌సి డిగ్రీ చేయవచ్చు. ఇంటర్ ఒకేషనల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైనవారు నేరుగా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో చేరొచ్చు. రెండేళ్ల ఒకేషనల్ పూర్తి చేసినవారు బ్రిడ్జి కోర్సుతో నేరుగా ఎప్‌సెట్‌కు కూడా హాజరుకావొచ్చు.

6న మీనాక్షి పాదయాత్ర

- వర్ధన్నపేట నియోజకవర్గంలో కొనసాగేలా ప్లాన్
- హసన్‌పర్తి నుంచి ఆరెపల్లి వరకు..
- నేడో రేపో స్పష్టత వచ్చే అవకాశం



వర్ధన్నపేట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట నియోజకవర్గంలో ఆగస్టు 6న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర ఉండనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 31 నుంచి జరిగే ఈ పాదయాత్ర వివిధ జిల్లాల్లోని నియోజకవర్గాల నుంచి చివరగా వర్ధన్నపేట నియోజకవర్గంలో ముగిసే విధంగా షెడ్యూల్ ఖరారైంది. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావులు మీనాక్షి నటరాజన్ పర్యటనపై రూట్‌మ్యాప్ నిర్ణయించనున్నట్లు తెలుస్తోంది. పర్యటన ఖరారైనప్పటికీ తిరిగే ప్రాంతాలను ప్రకటించకపోవడంతో గందరగోళం నెలకొంది. దీనిపై నేడో రేపో క్లారిటీ వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే మీనాక్షి వర్ధన్నపేట నియోజకవర్గంలోని హసన్‌పర్తి మండలంలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు 6వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రమదానంతోపాటు వర్కర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి ముఖాముఖిగా ప్రజల సమస్యలను తెలుసుకుంటారు. పాదయాత్ర కూడా హసన్‌పర్తి నుంచి ఆరెపల్లి వరకు జరగనుందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి...

- 'ప్రజావాణి'కి తప్పక హాజరుకావాలి...
- అధికారులకు కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం
- రికార్డులో స్థాయిలో 283 వినతులు
- దరఖాస్తులు పెండింగ్‌లు పెట్టొద్దు: వరంగల్ ఎ.సి. సంధ్యారాణి

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్ర జావాణికి ప్రతీ ఒక్క జిల్లా అధికారి తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో రికార్డు స్థాయిలో వివిధ సమస్యలపై 283వినతులు వచ్చాయి. ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఓపికగా ప్రజల సమస్యలు వింటూ సంబంధిత శాఖ అధికారిని పిలిచి సమస్యపై విచారణ చేసి పరిష్కరించాలన్నారు.

ఎక్కువ వినతులు రెవెన్యూ, మున్సిపల్, డబుల్ బెడ్‌రూమ్‌లకు సంబంధించిన సమస్యలు వచ్చాయి. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో గత వారం జిల్లా అధికారులకు ఇచ్చిన హాస్టల్ తనిఖీకి సంబంధించిన వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ (మిగతా 8వ పేజీలో...)



బాధితురాలి సమస్య తెలుసుకుంటున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

కొడుకులు పట్టించుకోవడం లేదు..



మాది రాంపూర్ గ్రామం. మాకున్న 5ఎకరాల 10గుంటల భూమిని కొడుకులకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాం. అందులో నుంచి మాకు తెలియకుండా కొంత భూమిని అమ్ముకున్నారు. ఇప్పుడు మమ్మల్ని పట్టించుకోకుండా, మా బాగోగులు చూసుకోకుండా ఇంట్లో నుంచి వెళ్లగొడుతున్నారు. దీనిపై 3నెలల నుంచి కలెక్టరేట్ ప్రజావాణికి వస్తున్నప్పటికీ న్యాయం జరగడం లేదు. ఆర్‌డీవోను ఎన్ని సార్లు కలిసినా పట్టించుకోవడం లేదు. మా కొడుకులకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసిన భూమిని మాకు అప్పగించి న్యాయం చేయాలని చందరాజు నారాయణ - శాంతమ్మ దంపతులు కోరారు.



కాళోజీ వర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

33 జీవోను అమలు చేయాలి..

హెల్త్ యూనివర్సిటీ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

వరంగల్ మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మెడికల్ అడ్మిషన్లలో స్థానికత కోసం తీసుకొచ్చిన జీవో నెంబర్ 33ని తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హెల్త్ యూనివర్సిటీ ఎదుట సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ అడ్మిషన్లలో గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 7 ఏళ్లలో నాలుగేళ్లు తెలంగాణ రాష్ట్రంలో చదివిన వారిని లోకల్‌గా పరిగణించేవారు. దీని వల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో చదవకపోయినా 6,7,8,9 తరగతులు చదివినట్లు తప్పుడు స్టడీ సర్టిఫికెట్లతో అడ్మిషన్లు పొందిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకు న్యాయం చేయాలనే దృక్పథంతో జీవో 33ని తీసుకువచ్చిందన్నారు. జీవో 33 ప్రకారం స్థానికేతరులుగా పరిగణించబడే 135 మంది కోర్టుకుపోవడం వల్ల తెలంగాణ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొన్నారు. దీంతో సుమారు 120 మందికిపైగా తెలంగాణ మెడికల్ సీట్లు తెలంగాణేతరులు పొందారని పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా జీవో 33ని పకడ్బందీగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పాత్రికేయులు విశ్లేషణాత్మక వార్తలు రాయాలి

వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులు విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలు రాయాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. వరంగల్ హంటర్‌రోడ్డులో గల తాళ్లపద్మావతి స్కూల్లో రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నిజనిర్ధారణ అనేది జర్నలిజంలో ఒక భాగమని, జర్నలిస్టులు ఖచ్చితంగా నిజాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలు రాయాలని సూచించారు. భవిష్యత్తులో పత్రికల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించనుందని అన్నారు. జడ్పీ సీఈవో రామిరెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డేటా జర్నలిజం గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం జర్నలిస్టులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేష్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు తోట భావనారాయణ, ఉడుముల సుధాకర్‌రెడ్డి, మార్కండేయ, డీపీఆర్వో ఆయూబ్‌అలీ, తాళ్లపద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ వరుణ్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

అనితారెడ్డికి ధైర్యదీప్తి అవార్డు

హనుమకొండ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని సాయిమీర కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి ధైర్యదీప్తి అవార్డుతోపాటు ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని నిర్వాహకులు బహూకరించి సత్కరించారు. అనితారెడ్డి సామాజిక సేవా, అనాథ పిల్లలకు, దివ్యాంగులకు ఆపన్నహస్తం అందిస్తున్న క్రమంలో ఆమె సేవానిరతిని చాటుతూ ఈ అవార్డును ప్రత్యేకంగా అనితారెడ్డికి అందజేస్తున్నట్లు నిర్వాహకుల పక్షాన సాయిమీర కల్చరల్ సొసైటీ చైర్మన్ పోతనాచారి, కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ తిరుపతయ్యలు తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వండి

● గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ● ప్రజావాణిలో 109 దరఖాస్తుల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజా వాణి ద్వారా ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కమిషనర్ హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. నగర ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులకు మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల పై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 109 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, హెచ్‌వో రమేష్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇలా..

● గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ వినాయకనగర్ కాలనీలో చాలా కాలంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ లేకపోవడం వల్ల స్థానిక ప్రజల చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు గతంలో ఫిర్యాదు చేయగా వచ్చి రోడ్డు, డ్రైనేజీ ప్రతిపాదనలు చేసి తిరిగి రాలేదు. అన్ని వర్గాల ప్రజలు ఉండే ఈ కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు వేసి సహకరించాలని కాలనీ వెల్ఫేర్ సొసైటీ నాయకులు కమిషనర్‌కు విన్నవించారు.

● మడికొండ 46వ డివిజన్ మెర్సీషాపు నుంచి వెలువడే దుర్గంధం వద్ద ఈగలు, దోమలు ఇండ్లలోకి వస్తున్నాయి, దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మోడెం లావణ్య అనే మహిళ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దుర్వాసన వల్ల ఇప్పటికే రోగాల బారిన పడుతు న్నామని, అధికారులు స్పందించా లని కోరింది.

● వరంగల్ 36వ డివిజన్ అబ్బనికుంట మైసమ్మ నుంచి స్టేష న్‌కు వెళ్లే రోడ్డు కాల్వలు తీసి కాంట్రాక్టర్ వదిలివేయడంతో రెండు మాసాలుగా నల్లా నీరు రావడం లేదని పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన సుమారు 50 మంది కమి షనర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు కాంట్రాక్టర్‌ను పిలిపించి తీసిన మట్టిని పూడ్చి వేసి ప్రతీ ఇంటికి నల్లాలు వచ్చే విధంగా చొరవ చూపాలన్నారు.

● ఏనుమాముల నుంచి నర్సంపేట రోడ్డు వరకు శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌సిటీ లేఔట్, గరీబ్‌నగర్, కీర్తినగర్‌ల నుంచి వచ్చే మురికినీరు కాలనీలలోని ఇండ్ల చుట్టుపక్కల నిలిచి ఉండడం వల్ల చాలా అసౌకర్యంగా ఉందని, పరిష్కార మార్గం చూపాలని కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

ఫిర్యాదులు ఇలా..

ఇంజనీరింగ్	- 30
హెల్త్, శానిటేషన్	- 09
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	- 10
టౌన్‌ప్లానింగ్	- 49
తాగునీటి సరఫరా	- 05
హార్టికల్చర్	- 02
ఎలక్ట్రికల్	- 05
మొత్తం=	109

దోచుకున్నది కల్వకుంట్ల కుటుంబమే..

● బీజేపీలో విలీనంపై ఎందుకు స్పందించడం లేదు?

● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రపాలకుల కంటే తెలంగాణ రాష్ట్ర సంపదను దోచుకున్నది కల్వకుంట్ల కుటుంబమేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీలో విలీనం కానున్న బీఆర్ఎస్ పార్టీని మైనారిటీ నాయకులు నమ్మవద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిపై కేటీఆర్ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. చర్చలో తాను ఒక్కడినే వస్తానని, దమ్ముంటే చేసిన అభివృద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న అభివృద్ధిని కేటీఆర్ అడ్డుకునే విధంగా మాట్లాడుతున్నాడని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకోసం బీఆర్ఎస్ నాయకులు 300మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వచ్చే నెల 15లోపు అర్హులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

బతుకమ్మ బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకున్న ఎమ్మెల్సీ కవిత.. లిక్కర్ స్కామ్ చేయడం మహిళలకే కలంకంగా మారిందని ఎమ్మెల్యే నాయిని దుయ్యబట్టారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు క్లియరెన్స్ తెచ్చుకోలేని దద్దమ్మలు బీఆర్ఎస్ నాయకులని విమర్శించారు. కాళేశ్వరం నిర్మించిన వాళ్లే మళ్లీ నిర్మాణం చేపట్టాలని చెప్పడం వారు చేసిన అవినీతికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేశారని అన్నారు. పశ్చిమ నియోజక వర్గంలోని 29, 11వ డివిజన్లు వరంగల్ జిల్లాలో కలిశాయని, దీంతో సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, ఈవీ శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● రూ.15 లక్షల విలువ చేసే 30 కిలోల సరుకు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



నిందితుడి అరెస్టు చూపుతున్న కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి

హసన్‌పర్తి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద సుమారు రూ.15,14,500 విలువ చేసే 30.290 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌లో సోమవారం ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా, మోహన తాలూకా, కర్బాబడికి చెందిన ఆశిష్‌కుమార్ నాయక్ అలియాస్ లిపునాయక్ (27) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. దీంతో ఆయనకు వచ్చే ఆదాయం సరిపోక అక్రమంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. సుమారు 6 ఏళ్ల కిందట అతడికి పరిచయస్తుడైన చాందిపుట్‌కు చెందిన జమీర్‌తో గంజాయి రవాణా చేస్తూ ఒరిస్సాలో పోలీసులకు పట్టుబడి సర్కిల్ జైలులో 9 నెలల జైలు శిక్ష అనుభవించాడు. అయినప్పటికీ అతడిలో మార్పు రాలేదు. జైలు నుంచి తిరిగి వచ్చిన తరువాత ఒరిస్సాలోని గజపతి జిల్లా, గండపదర్‌కు చెందిన ప్రశాంత్ మాలిక్ వద్ద ఒక కిలో గంజాయి రూ.1500లకు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన మహదేవ్ కాలేకు రూ.4500లకు అమ్మి లాభం పొందేవాడు.

ఇదే క్రమంలో ఈనెల 24న ప్రశాంత్ మాలిక్ వద్ద 30.290 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా వాటిని ఒక్కో పాకెట్ 2 కిలోల చొప్పున 15 పాకెట్లుగా తయారు చేసి లగేజీ బ్యాగులలో సర్దుకున్నాడు. 25న పదిహేను పాకెట్లను రెండు లగేజీ బ్యాగులలో తీసుకొని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు వచ్చి కోనార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి 26న వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రైల్వేస్టేషన్‌లో పోలీసు వారి తనిఖీలను చూసి ఎవరికీ అనుమానం రాకుండా అక్కడి నుంచి తప్పించుకొని వరంగల్ చుట్టు పక్క ఏరియాలో రెండు రోజులు గడిపాడు. అనంతరం 28న వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీసు తనిఖీలు చేస్తున్నారని తెలుసుకొని ఉదయం మహారాష్ట్రకు వెళ్లటకు మరో రైల్వే స్టేషన్ కోసం ఆరా తీశాడు. దీంతో హసన్‌పర్తిలోని ఎల్లాపూర్ రైల్వే స్టేషన్ అనువుగా ఉందని తెలుసుకొని ఆటోలో రైల్వే బ్రిడ్జి దగ్గర దిగి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై దేవేందర్‌తో పాటు పోలీసు సిబ్బందిని చూసి ఆశిష్‌కుమార్ పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసు సిబ్బంది అతన్ని పట్టుకొని సుమారు రూ.15,14,500 విలువ చేసే 30.290 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన ఎస్సై దేవేందర్ పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్సైలు శీలం రవిందర్, సుజిత్‌రెడ్డి, క్రైం కానిస్టేబుల్ క్రాంతి కుమార్, ప్రకాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే..

అత్యధిక స్థానాలు మనమే గెలుస్తాం: ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి(కొడకండ్ల) జూలై 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని సర్వేలు చెబుతున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొడకండ్ల రెండు ఎంపీటీసీ స్థానాల క్లస్టర్ల సన్నాహక సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా మాజీ మంత్రి దయాకర్‌రావు హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలతో ప్రజలు మోసపోయారన్నారు. తెలంగాణలో బ్లాక్‌మెయిలర్ చేతిలో ప్రభుత్వం ఉందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రైతు భరోసా నిధులు విడుదల చేసిందన్నారు. ప్రజలు, నిరుద్యోగ యువకులు, మహిళలు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వస్తాయని చూస్తున్నారని తెలిపారు. నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు. అనంతరం కొడకండ్లకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగపుత్ర కులస్తులు సింగారం ధర్మేందర్, శ్రీనివాస్, కొప్పు వెంకటయ్య, హరీష్, గోదుమల రవి, వెంకటయ్యలు బీఆర్ఎస్‌లో చేరగా, ఎర్రబెల్లి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశానికి సిందే రామోజీ అధ్యక్షత వహించగా, కొడకండ్ల మండల ఇన్‌చార్జి బబ్బూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో నాయకులు మోహన్‌గాంధీ నాయక్, పేరం రాము, దీకొండ వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.



కొడకండ్లలో ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గంగపుత్ర కులస్తులు

శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు

హనుమకొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా శైవ క్షేత్రాలను సందర్శించే భక్తుల కోసం పంచారామ దర్శన యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు సోమవారం ఆర్ఎం డి.విజయభాను ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3న హనుమకొండ బస్టాండ్ నుంచి బస్సు ప్రారంభమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలు అమరావతి, అమరలింగేశ్వర స్వామి, భీమవరం శ్రీసోమేశ్వర స్వామి, సామర్లకోట భీమేశ్వర స్వామి దర్శించుకోవచ్చని తెలిపారు. ఈ యాత్ర ఆగస్టు 3న ఆదివారం తిరిగి మంగళవారం హనుమకొండకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు బస్సు టికెట్ ధర ఒకరికి రూ.2300, పిల్లలకు రూ.1400 ఉంటుందని, ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్లు : 9063407493 / 7780565971 / 9866373825 / 9959226047 లకు సంప్రదించాలని ఆర్ఎం విజయభాను ప్రకటనలో పేర్కొన్నారు.

నకిలీ వైద్యులపై కేసు నమోదు

వరంగల్ మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేయూ పోలీసు స్టేషన్‌లో ముగ్గురు నకిలీ వైద్యులపై కేసులు నమోదు అయినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య కుమార్ తెలిపారు. భీమారం ప్రాంతంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద సిరి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ నిర్వాహకుడు బి.కృష్ణ ప్రసాద్ (ల్యాబ్ టెక్నీషియన్), శ్రీ బాలాజీ క్లినిక్ నిర్వాహకుడు ఆర్.శ్రీకాంత్ (ల్యాబ్ టెక్నీషియన్), జవహర్ నగర్ ప్రాంతంలో మై హెల్త్ హాస్పిటల్ నిర్వాహకుడు కె.శరత్‌కుమార్ (బిఫార్మసీ, ప్రభుత్వ ఉద్యోగి)లు ఎలాంటి అర్హత లేకున్నా వైద్యం నిర్వహిస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ముగ్గురిపై ఎన్ఎంసీ చట్టం 34 54 టీఎస్ ఎంపీఆర్ చట్టం 22, బీఎన్ఎస్ 318, 319 ప్రకారం కేసు నమోదు అయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లాలయ్య కుమార్, చైర్మన్ డాక్టర్ కె.నరేశ్ కుమార్‌లు మాట్లాడుతూ.. ఎలాంటి అర్హత లేకుండా అలోపతి, మోడర్న్ మెడిసిన్ వైద్య సేవలు అందించవద్దని, ప్రథమ చికిత్స ముసుగులో ఇష్టం వచ్చినటు వైద్యం చేస్తే చట్ట ప్రకారం ఒక యేడాది జైలుశిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. 9154382727కు నకిలీ వైద్యుల గురించి సమాచారం అందించాలని తెలిపారు.

గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం

నర్సంపేట టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. మహేశ్వరం గ్రామానికి చెందిన చిదురాల వీరస్వామి భార్య నాలుగేళ్ల కిందట అనారోగ్యంతో, కుమారుడు మూడేళ్ల కిందట ఉరివేసుకొని మృతి చెందాడు. దీంతో ఇదే గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన కందకట్ల రాధికను ఏడాది కిందట వీరస్వామి వివాహం చేసుకున్నాడు. రాధిక పేరు మీద ఉన్న ఒక ఎకరం ఆరు గుంటల భూమిని సాగు చేసుకుంటూ వీరస్వామి, రాధిక దంపతులు జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వీరస్వామి నర్సంపేట పట్టణానికి చెందిన ఇద్దరు మధ్యవర్తుల సహాయంతో అప్పు కోసం ప్రయత్నించే సందర్భంలో ఏకంగా తన భూమిని అప్పు ఇస్తానన్న మహిళ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ విషయంపై గ్రామంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా తన పేరుపై రిజిస్ట్రేషన్ అయిన భూమిని వీరస్వామికి ఇవ్వనని ఆ మహిళ చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన వీరస్వామి సోమవారం ఇంట్లో ఉన్న గడ్డి మందును సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడడంతో అపస్మారక స్థితిలో ఉన్న వీరస్వామిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై నర్సంపేట పోలీసులను అడుగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నేటి నుంచి బొగత సందర్శనకు అనుమతి

వాజేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని బొగత జలపాత సందర్శనకు పర్యాటకులను అనుమతిస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 23 నుంచి బొగత సందర్శనను అధికారులు నిలిపివేశారు. దీంతో వందల సంఖ్యలో వచ్చిన పర్యాటకులకు నిరుత్సాహం తప్పలేదు. ప్రస్తుతం వర్షాలు, బొగత వరద నీరు తగ్గడంతో జలపాతం సందర్శనకు అనుమతిచ్చారు. కేవలం సందర్శకులు జలపాతాన్ని చూడ్డానికి మాత్రమే రావాలని, ఈత కొలనులో దిగి స్నానాలు చేయటానికి అనుమతి లేదని అధికారులు ప్రకటించారు. ఇది ఇలా ఉండగా బొగత సందర్శన అనుమతులపై అధికారుల ప్రకటనలు గందరగోళానికి దారితీశాయి. జిల్లాలోని జలపాతాలకు అనుమతులు లేవని ఉన్నతాధికారులు ఆదివారం ప్రకటించారు. ఇదే క్రమంలో స్థానిక ఫారెస్టు అధికారులు మాత్రం మరో ప్రకటనలో జలపాతం సోమవారం నుంచి సందర్శనకు అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పర్యాటకులు అయోమయానికి గురవుతున్నారు.



వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2305	1521
పల్లికాయ (సూక)	5900	3450
పల్లికాయ (పచ్చిది)	5200	1575
కందులు	6100	3022
పెసళ్లు	7052	3022
పత్తి	7820	5300
పసుపు (కాడి)	10599	9534
పసుపు (గోల)	10070	8700
తేజ మిర్చి	10000	8500
తేజ ఏసీ	13200	11500
వండర్‌హాట్	10500	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	13000	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆరోగ్యంతో చెలగాటం



వరంగల్ కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో ఆహార పదార్థాల తయారీలో నాణ్యత కొరవడుతోందనే ఆరోపణలున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్, ఫాస్‌ఫుడ్ సెంటర్లలో నిల్వ చేసిన ఆహారాన్ని వడిస్తున్నట్లు తెలుస్తోంది. అందమైన, ఆకర్శణీయమైన భవనాలలో హోటళ్లు నడుపుతున్న నిర్వాహకులు.. ఆహార పదార్థాల తయారీలో శుచి, శుభ్రత పాటించడం లేదనే విమర్శలున్నాయి. కలుషితమైన ఆహారాన్ని వడ్డిస్తూ వినియోగదారుల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు హోటళ్ల యజమానులు ప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి కెమికల్స్‌తో కూడిన కల్తీ ఆహారాన్ని అందిస్తుండడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది.

- నగరంలో ఇష్టారాజ్యంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్ల తీరు
- కల్తీ పదార్థాలతో ఆటలాడుతున్న నిర్వాహకులు
- అపరిశుభ్ర వాతావరణంలో వంటశాలలు, పదార్థాలు
- నిల్వ చేసిన ఆహార పదార్థాలకు కెమికల్స్ జోడింపు
- కల్తీ ఆహారం తిని వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- జీడబ్ల్యూఎంసీలో ఫుడ్‌సేఫ్టీ వింగ్ జాడేది?

ఫుడ్ హబ్‌గా..

వరంగల్ నగరానికి హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేరుంది. ఈ ప్రాంతం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతూ పర్యాటక, విద్య, వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి చెందుతోంది. ఈక్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు సైతం ఇక్కడి 5 స్టార్స్, 3 స్టార్స్ హోటళ్లలో సేద తీరుతారు. వరంగల్ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కోట్ల రూపాయల ఆహార వ్యాపారం జరుగుతోంది. అలాగే వరంగల్ నగరంలో రుచికరమైన ఆహార పదార్థాలు విరివిగా లభిస్తుంటాయి. అయితే కొన్ని ఆహార కేంద్రాల్లో ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ధనార్జనే ధ్యేయంగా కల్తీ ఆహారాన్ని అందిస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నట్లు ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు చెబుతున్నాయి. కొన్ని పేరు మోసిన రెస్టారెంట్లలో కిలోల కొద్ది మటన్, చికెన్, చేపలు, ప్రాన్స్, గుడ్లు, పిండి పదార్థాలకు విషపూరితమైన కెమికల్స్ అద్ది నిల్వ చేస్తున్నారు. చాలా రోజులుగా ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన ఆహార పదార్థాలను జనాలకు పెట్టి వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

నిబంధనలు గాలికి..

వరంగల్ నగరంతో పాటు చుట్టుపక్కల కొన్ని హోటళ్లు,

గ్రేటర్ పరిధిలో హోటళ్ల లెక్క	
హోటళ్లు	829
టిఫిన్ సెంటర్లు	659
బార్ అండ్ రెస్టారెంట్లు	123
బేకరీలు	360
స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు	1280
ఫుడ్ వ్యాన్లు	140
ఐస్‌క్రీస్ పార్లర్లు	89



రెస్టారెంట్లు, దాబాలలో నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదు. జిడ్డుతో నల్లగా ఏర్పడిన వంట గది గోడలు, వంట పాత్రలు, శుద్ధిలేని నీరు, పాడైపోయిన వంట నూనె, గతంలోవంటకు ఉపయోగించిన ఆయిల్, ఎక్కువ రోజులు నిల్వ చేసిన మాంసం, చేపలు, కాలం చెల్లిన వంట పదార్థాలు, కుళ్లిపోయిన కూరగాయలు చాలా చోట్ల హోటళ్లలో కనిపిస్తున్నాయి.

మటన్, చికెన్‌తో పాటు కలిపి పెట్టిన వంట పదార్థాలు కుళ్లిపోకుండా ప్రమాదకర కెమికల్స్ వాడుతున్నారు. చాలా హోటళ్లలో పెద్దపెద్ద ఫ్రిజ్‌లలో క్వింటాళ్ల కొద్ది మాంసం నిల్వచేసి ఉంచుతున్నా పట్టించుకున్న వారు లేరు. హోటళ్లకు ఒక్కసారిగా ఎంత మంది కస్టమర్లు వచ్చినా అప్పటికప్పుడు ఫ్రిజ్‌లో పెట్టిన ఆహారాన్ని అరగంటలో అందిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు.

తనిఖీలు ఏవీ?

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లపై ఆహార నియంత్రణ శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో ఆడిందే ఆటగా సాగుతోంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు, మునిసిపల్ సిబ్బంది దాడులు చేసినా నిర్వాహకుల ప్రవర్తనలో మార్పు రావడం లేదు. నిర్వాహకులు ఉన్నతాధికారులను మేనేజ్ చేస్తూ విషయం బయట పడకుండా జాగ్రత్త పడ్డారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్ల వంటశాలలు అపరిశుభ్రంగా కనిపించడం చూసి నామమాత్రపు జరిమానాలు విధిస్తున్నారు. వరంగల్ మునిసిపల్ పరిధిలోని కొన్ని బడా హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లు, బార్లు కొందరు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో నడుస్తుండడంతో అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

కబేళాకు వెళ్లకుండానే మాంసం

వరంగల్ నగరంలో ఉన్న 829 హోటళ్లు, రెస్టారెంట్లలో సొంతంగా కోసిన మటన్, చికెన్ వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో ఉన్న కబేళాలో అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత జంతువులను వధిస్తారు. తర్వాత జీడబ్ల్యూఎంసీ ముద్ర తొంటికి వేసి మాంసాన్ని విక్రయించేందుకు అనుమతులు ఇస్తారు. కానీ, కొందరు నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా నగరం చుట్టుపక్కల వ్యాధుల బారిన పడిన మేకలు, గొర్రెలు తెచ్చి హోటళ్ల సమీపంలో వధించి యథేచ్ఛగా ఆహార విక్రయాలు జరుపుతున్నారు. ఇదంతా సంబంధిత శాఖకు, జీడబ్ల్యూఎంసీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ప్రచారం ఉంది.

గ్రేటర్‌లో ఫుడ్‌సేఫ్టీ విభాగం ఏదీ?

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి 66 డివిజన్లకు విస్తరించినా ఆహార కల్తీ నియంత్రించేందుకు ఒక్కరు కూడా లేకపోవడం విచారకరం. గతంలో ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రీషన్ కోర్సు చదివిన ఇద్దరు అధికారులు పని చేసేవారు. ఇక్కడి పరిస్థితులు నచ్చక తిరిగి వెనక్కి వెళ్లినట్టు తెలిసింది, దీంతో పదేళ్లుగా జీడబ్ల్యూఎంసీకి ఫుడ్ సేఫ్టీ విభాగం లేకపోవడంతో నగరంలో హోటళ్ల కల్తీకి రెక్కలొచ్చాయి. ప్రజా ఫిర్యాదులు అందినప్పుడే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు తూతూ మంత్రంగా తనిఖీ చేసి నామమాత్రపు జరిమానాలు విధిస్తున్నారు. తర్వాత నెలవారి గార్బే జ్ (చెత్త) పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్టు తెలిసింది. అయితే ప్రస్తుతం శానిటేషన్ విభాగంలో ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ కోర్సు పూర్తి చేసిన సిబ్బంది ఉన్నా వారికి అవకాశం ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆరోగ్య శాఖ సూచనలు ఇలా..

- ప్రతీ హోటల్ నిర్వాహకుడు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ కలిగి ఉండాలి.
- వంట పనుల్లో శుభ్రమైన నీటిని వాడాలి.
- వంటగది, ప్లేట్లు, టేబుళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండాలి.
- పదార్థాల నిల్వ పద్ధతులు శాస్త్రీయంగా ఉండాలి.
- వంట మనుషులకు ప్రతీ నెల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
- వంట మనుషులు, సర్వీస్ చేసేవారు తప్పకుండా గ్లౌజులు, మాస్కులు, క్యాపులు ధరించాలి.
- ఫుడ్ ప్యాకింగ్ డెలివరీలో హైజీన్ పాటించాలి.
- సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1800 11 2100 లేదా 9643987222 నెంబర్‌కు ఆహార కల్తీ ఫొటోలు పంపిస్తే దర్యాప్తు చేసి సమస్య పరిష్కరిస్తారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి..



నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసి అందించే వారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. వేడినీటితో ప్లేట్లు, ఆహార పదార్థాలు శుభ్రం చేయాలి. వ్యర్థనీరు వెళ్లేందుకు సరైన మార్గం కలిగి ఉండాలి. విక్రయించగా మిగిలిన వస్తువులు, ఆహార పదార్థాలు నిల్వ ఉంచకూడదు. హోటళ్ల, రెస్టారెంట్ల నిర్వాహకులు గ్లౌజులు, మాస్కులు, టోపీలు తప్పకుండా వాడాలి. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై చర్యలు చేపడతాం.

– డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో

ఆయుర్వేద వైద్య కళాశాలల్లో సీట్లకు గండి

- మూడు బోధన ఆస్పత్రుల్లో సిబ్బంది, వసతుల కొరత
- రెండు కళాశాలల్లో సీట్ల తగ్గింపునకు పొంచి ఉన్న ప్రమాదం
- గత ఏడాది వరంగల్‌లో నాలుగు సీట్లకు కోత
- 2009 నుంచి కండీషన్ అనుమతులతోనే బీఏఎంఎస్ ప్రవేశాలు
- సీఎం సారూ.. ఆయుర్వేద వైద్య విద్యను కాపాడండి..

గిర్మాజిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద వైద్య విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ఉన్న రెండు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలల్లో ఈ ఏడాది బీఏఎంఎస్ సీట్లకు గండిపడే ప్రమాదం ఏర్పడింది. రెండు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలు, వీటికి అనుబంధంగా ఉన్న మూడు బోధన ఆస్పత్రుల్లో సిబ్బంది, మౌలిక సదుపాయాల కొరతతో ఆయుర్వేద వైద్య విద్య డోలాయమాన పరిస్థితిని ఎదుర్కుంటోంది. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్ఎం) ప్రమాణాలు, నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల నాలుగు బీఏఎంఎస్ సీట్లు కోల్పోగా, ఈ ఏడాది మరెన్ని సీట్లకు గండిపడుతుందోననే ఆందోళన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

వరంగల్ జిల్లా కేంద్రంలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బీఏఎంఎస్ 63 సీట్లు, హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బీఏఎంఎస్ 63 సీట్లు, పీజీలో 49 సీట్లు ఉన్నాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్ష మెరిట్ ఆధారంగా ఎంబీబీఎస్ తరహాలోనే బీఏఎంఎస్‌కు ప్రవేశాలు జరుగుతాయి. ఎంబీబీఎస్, బీడీఎస్ తరువాత బీఏఎంఎస్(బ్యాచులర్ ఆఫ్ ఆయుర్వేద మెడిసిన్ అండ్ సర్జరీ)కు విద్యార్థులు ప్రాధాన్యత ఇస్తారు. ఆయుర్వేద వైద్య విద్య ప్రమాణాలు, నిబంధనలను నేషనల్ కమిషన్ ఆఫ్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్ఎం) నిర్దేశిస్తూ ఆయుర్వేద వైద్య విద్యను పర్యవేక్షిస్తుంటుంది. దేశంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలల్లో అవసరమైన బోధన, బోధనేతర సిబ్బంది, అనుబంధ బోధన ఆస్పత్రుల్లో అవసరమైన వైద్యులు, పారామెడికల్, నాల్గవ తరగతి సిబ్బందితో పాటు వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు ఎన్‌సీఐఎస్ఎం ప్రమాణాల మేరకు ఉంటేనే ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలల్లో బీఏఎంఎస్ సీట్లకు ఎన్‌సీఐఎస్ఎం అనుమతి ఇస్తుంది. ఇందుకు గాను ప్రతి సంవత్సరం అక్టోబరు, నవంబరులో ఎన్‌సీఐఎస్ఎం బృందం ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలు, ఆస్పత్రులను తనిఖీ చేసి తగిన సిబ్బంది, మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రవేశాలకు అనుమతులు ఇస్తుంది.



వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల

రాష్ట్ర ప్రభుత్వం ఆయుర్వేద వైద్య విద్యపై సవతి తల్లి ప్రేమను చూపుతూ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో నియామకాలు చేపట్టక పోవడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో తెలంగాణలో ఆయుర్వేద వైద్య ప్రమాదంలో పడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌సీఐఎస్ఎం బృందాలు తనిఖీకి వచ్చినపుడు సిబ్బంది, మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం హామీ పత్రాలు ఇస్తుండటంతోనే ప్రవేశాలకు అమతులు లభిస్తున్నాయి. ఎన్‌సీఐఎస్ఎం కండీషన్‌లతోనే 2009 నుంచి గత విద్యా సంవత్సరం (2024-25) వరకు రాష్ట్రంలో బీఏఎంఎస్ ప్రవేశాలు జరిగాయి. అయితే రాష్ట్ర ప్రభు త్వం తమ హామీలను అమలు చేయకపోవడంతో గత విద్యా సంవత్సరం లో వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగు బీఏఎంఎస్ సీట్లను ఎన్‌సీఐఎస్ తగ్గించింది. దీంతో గత ఏడాది నలుగురు విద్యార్థులు ఆయుర్వేద వైద్య విద్యను చదువుకోలేక పోయారు. ప్రభుత్వం ఆయుర్వేద వైద్యంపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుండటంతో హైదరాబాద్‌లోని చార్మినార్, ఎర్రగడ్డ, వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రుల్లో కనీసం పారిశుధ్య సిబ్బంది లేని పరిస్థితి నెలకొంది.

వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద కాలేజిలో 44 పోస్టులు ఖాళీ

వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో కలిపి మొత్తం 67 సాంక్షన్ పోస్టులు ఉండగా, 44 ఖాళీలు ఉన్నాయి. ఇందులో ప్రిన్సిపాల్ 01 పోస్టు, ప్రొఫెసర్లు 04, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 07, లెక్చరర్లు 15, లైబ్రేరియన్ 01, ఆఫీసు సూపరింటెండెంట్ 01, ల్యాబ్ టెక్నిషియన్ 04 పోస్టులతో పాటు ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే డిపార్టుమెంట్‌లలో అవసరమైన పరికరాలు, తరగతి గదులు, లైబ్రరీలో పుస్తకాలు, లెక్చరర్ హాల్, హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది.

హైదరాబాద్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ కాలేజీలో బోధన పోస్టులు 42 ఖాళీ

హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ పోస్టుతో పాటు 42 బోధనపోస్టులు ఖాళీగా ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో 25, పోస్టు గ్రాడ్యుయేట్ విభాగంలో 17 బోధన పోస్టులు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నాయి. ఇందులో పీజీ ప్రొఫెసర్ పోస్టులు 02, రీడర్ 01, సీనియర్ లెక్చరర్స్ 07, టెక్నికల్ అసిస్టెంట్స్ 07 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెసర్ 03, అసిస్టెంట్ ప్రొఫెసర్ 07, లెక్చరర్స్ 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు నాన్‌టీచింగ్‌లో 65 సాంక్షన్ పోస్టులకు గాను 41 ఖాళీగా ఉన్నాయి.

వరంగల్ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలో 36 పోస్టులు ఖాళీ

వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి 120 పడకల జీవో ఉన్నా 60 పడకల స్థాయి సాంక్షన్ పో స్టులు 61 మాత్రమే ఉన్నా యి. ఇందులోనూ మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్, రేడియోగ్రాఫర్, నాల్గ వ తరగతి సిబ్బంది తదితర 36 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాకుండా ఈ ఆస్పత్రిలోని ఎక్స్‌రే యూనిట్ మూతపడి సుమారు 15 ఏళ్లు అవుతోంది. నిత్యం 70 మంది ఇన్ పేషంట్లు, 300 మంది అవుట్ పేషంట్ రోగులు వైద్య చికిత్స పొందుతున్న ఈ ఆస్పత్రిలో కనీసం పారిశు ధ్య, సెక్యూరిటీ సిబ్బందిలేరు. ఇదే తరహాలో హైదరాబాద్‌లోని చార్మినార్, ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రుల్లోనూ వైద్యులు, పారామెడికల్, నాల్గవ తరగతి, పారిశుధ్య సిబ్బంది తోపాటు అవసరమై వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల కొరతతీవ్రంగా ఉన్నట్లు తెలిసింది.

ఆయుర్వేద వైద్య విద్యపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ఎన్‌సీఐఎస్ఎం ప్రమాణాలకు అనుగుణంగా రెండు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలు, మూడు ఆయుర్వేద వైద్య బోధన ఆస్పత్రుల్లో సిబ్బంది నియామకాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తే బీఏఎంఎస్ ప్రవేశాలకు ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్య విద్యార్థులు అంటున్నారు. లేనట్లయితే ఎప్పటి మాదిరిగానే కండీషన్ అనుమతులు, సీట్ల కోత తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం అల్లోపతి వైద్య విద్యపై ఏర్పాటు చేసిన విధంగానే ఆయుర్వేద వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులపై మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కరించి ఆయుర్వేద వైద్య విద్యను కాపాడాలని ఆయుర్వేద వైద్యులు ముఖ్యమంత్రినికి కోరుతున్నారు.

అడవిలో గొర్రెల గల్లంతు

- మూడు రోజులుగా గాలింపు.. కనిపించని జాడ

బయ్యారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అడవిలో గొర్రెలు గల్లంతైన ఉదంతం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన నరాల రమేష్‌కు చెందిన 120 గొర్రెలు ఈ నెల 26న సమీప పెద్ద గుట్ట అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లాడు. శనివారం గుట్టపై విస్తారంగా కురిసిన వర్షానికి గొర్రెల మంద చెల్లాచెదురయ్యాయి. సుమారు 60 గొర్రెలు దారిమళ్లి గల్లంతయ్యాయి. నాటి నుంచి జీవాల కోసం రమేష్ కుటుంబ సభ్యులు, యాదవులు అటవీప్రాంతంలో వెతికినా వాటి జాడ తెలియలేదు. జీవాల విలువ సుమారు రూ. 10 లక్షలు ఉంటుందని అంచనా. అడవిలో తప్పిపోయిన గొర్రెలు ఎటు పోయాయో అర్థం కాక బాధితులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఈ విషయం సోషల్ మీడియాలో వైరలై చర్చనీయాంశంగా మారింది.

ఒకే కాన్పులో ముగ్గురి జననం

తల్లీబిడ్డలు క్షేమం



ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు శిశువులు

మహబూబాబాద్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాన్పులో ఒక్కరు జన్మించడం సహజం. అక్కడక్కడ కవలలు జన్మిస్తారు. వీటికి భిన్నంగా ఒకే కాన్పులో ముగ్గురు జన్మించిన అరుదైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు గుండబోయిన సురేష్ భార్య కల్యాణి ఈ నెల 26న ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మిట్ అయింది. శనివారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో ప్రసవం కోసం అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేశారు. మొదటి కాన్పులో కల్యాణి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఇద్దరు ఆడ శిశువులు కాగా, ఒక మగబిడ్డ. ముగ్గురు పిల్లలతోపాటు తల్లి ఆరోగ్యం నిలకడగా ఉన్న ట్లు వైద్యులు తెలిపారు. ఒకే కాన్పులో ముగ్గురు జన్మించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హాలహాలుడిగా రుద్రేశ్వరుడు

- వైభవంగా తొలి శ్రావణ సోమవారం వేడుకలు



హనుమకొండ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శివప్రీతికర సోమవారం తొలి శ్రావణ సోమవారం వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి రుద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయంలో కొలువై ఉన్న ఉత్తిష్ట గణపతికి క్షీరాభిషేకం, రుద్రేశ్వరుడికి అఘోర పాశుపద ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో మామిడాల గణపతి శోభ భక్తుల సహకారంతో ప్రత్యేక మహాన్నదానం నిర్వహించారు. రుద్రేశ్వరుడికి 200 మంది పుణ్య దంపతులతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించడమే గాక స్వామి వారికి 51 కిలోల పెరుగన్నంతో అన్నసూక్త మంత్రపఠనంతో హాలహలుడిగా అలంకరింపజేసి అన్నపూజ నిర్వహించారు. లోక కల్యాణార్థం తొలి శ్రావణ వేడుకల సందర్భంగా నమయ చమకాలతో పాశుపత రుద్రహోమం నిర్వహించారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవో అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గంగు ఉపేంద్రశర్మతోపాటు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌శర్మ, శ్రవణాచారి, ఆలయ సిబ్బంది మధుకర్, రజిత సేవలందించారు. ఏనుగుల రాకేశ్‌రెడ్డితోపాటు అనేక మంది ప్రముఖులు దర్శించారు.

నేడు నాగుల పంచమి

శ్రావణ మాసంలో పంచమి తిథితో కూడిన వేళ మంగళవారం నాగుల పంచమి వేడుకలను భక్తులు ఆచరించనున్నారు. ముఖ్యంగా వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహింపజేయనున్నట్లు ఈవో తెలిపారు.



వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో భక్తుల సందడి

పంటలకు ప్రాణమొచ్చింది..



వరంగల్ మండలం పైడిపల్లిలో వరినాట్లు వేసిన దృశ్యం

- వరుస వర్షాలతో చెలక పంటలకు జీవం
- పత్తి, వరి, మక్కజొన్న చేన్లలో కలుపు పనులు షురూ
- నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నరైతులు
- ఆగస్టు చివరి వరకు నాటుకోవచ్చంటున్న అధికారులు



వరంగల్ వ్యవసాయం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజులుగా కురిసిన వర్షాలతో పంటలకు ప్రాణమొచ్చింది. నెల రోజులుగా వర్షాలు లేక కొనఊపిరితో ఉన్న చేన్లకు జీవం వచ్చింది. దీంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ముందుగా ప్రవేశించి తొలకరి వర్షాలు పడడంతో రైతులు పత్తి, మక్కజొన్న, కంది తదితర విత్తనాలు వేశారు. వరి నార్లు పోశారు. ఆ తరువాత వర్షాలు లేకపోవడంతో బావులు, బోరుబావుల కింద ఉన్నవారు ఎలాగోలా పంటలను కాపాడుకున్నారు. నీటి వసతి లేని వారు బిందెలతో మొక్కలకు నీరుపోసి కాపాడుకున్నారు. అయినప్పటికీ నెల రోజులుగా వర్షాలు కురవక పోవడంతో పంటలు ఎండిపోయే దశలో వర్షాలు సమృద్ధిగా పడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

నిండుతున్న చెరువులు, కుంటలు..

జిల్లాలోని ఖానాపూర్ మండలం పాకాల సరస్సు పూర్తి స్థాయి నీటి మట్టం 30.3 ఫీట్లు కాగా, ఇప్పటికే 26.2 ఫీట్లకు చేరింది. ఆయకట్టు కింద 29,500 ఎకరాల్లో వరి సాగు అవుతోంది. వానాకాలం పంటకు సరిపడా నీళ్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మరో నాలుగు ఫీట్ల నీరు చేరితే మత్తడి పడుతుంది. ఇప్పటికే నల్లబెల్లి మండలం వెంకటపాలెం చెరువు, సంగెం మండలం కుంటపల్లి చెరువు, నెక్కొండ మండలం పత్తిపాక చెరువు మత్తడి పోస్తున్నాయి. వాటితో పాటు మాధన్నపేట, రంగాయ చెరువు, గురిజాల పెద్ద చెరువు, దుగ్గొండి పెద్ద చెరువు, గుండం చెరువు, దేశాయిపల్లి గణేష్ చెరువు, వెంకటాపురం ఊరచెరువుల్లోకి 60-70 శాతం నీరు చేరింది. మరో రెండు మూడు భారీ వర్షాలు కురిస్తే మత్తడి పోసే అవకాశం ఉంది. ఇక గీసుగొండ, పర్వతగిరి, రాయపర్తి, వర్ధన్నపేట, చెన్నారావుపేట, వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లోని చెరువులలో కొంతవరకు నీరు చేరింది.



వరంగల్ మండలం ఆరెపల్లిలో ఏపుగా పెరిగిన పత్తి

ఊపందుకున్న సాగు పనులు

ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలలోకి నీరు చేరడంతో వ్యవసాయ సాగు పనులు ఊపందుకున్నాయి. తొలకరి వర్షాలకు వేసిన పత్తి పంటలు ఇప్పుడు పూత దశలో ఉన్నాయి. మక్కజొన్న ఏపుగా ఎదిగింది. తొలకరి వర్షాలకు వరి నార్లు పోసిన వారు ఇప్పుడు నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే 40 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. పత్తి, మక్కజొన్న, కంది, తదితర పంటల్లో కలుపు తీసి ఎరువులు వేస్తున్నారు. అలాగే పత్తి పంటకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. మరోవైపు వరి నార్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

పంటలు పండుతాయన్న ధీమా పెరిగింది..



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంటలు, చెరువుల్లోకి నీళ్లు వచ్చాయి. పంటలకు అదునుగా వర్షాలు కురువడంతో సాగుకు ఇబ్బంది లేకుండా ఉన్నది. ఇలాగే మధ్య మధ్యలో వర్షాలు కురిస్తే నీళ్లకు ఇబ్బంది ఉండదు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీళ్లు వస్తే పంటలు విరివిగా పండుతాయి.

– ఆర్.శ్రీనివాస్, రైతు, మొగిలిచర్ల

వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి..



నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి. కొద్ది రోజులుగా వర్షాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో వర్షాలు పడడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. పత్తి, కంది, మక్కజొన్న పంటలు కలుపు తీసి ఎరువులు వేసుకుంటున్నారు. వరి నాట్లు పడుతున్నాయి. ఆగస్టు చివరి వరకు నాట్లు వేసుకోవచ్చు. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. కాబట్టి పంటలకు ఏమీ ఇబ్బంది ఉండదని అనుకుంటున్నాం.

– కె.అనురాధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మున్సిపాలిటీ ఎదుట కూరగాయల వ్యాపారుల ధర్నా

కాజీపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్లపై కూరగాయల అమ్మకాలు నిషేధించాలని, మార్కెట్‌లోనే అమ్మకాలు జరపాలని డిమాండ్ చేస్తూ కూరగాయల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం వ్యాపారులు ధర్నా చేశారు. మార్కెట్ నుంచి భారీ ర్యాలీగా వచ్చి మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి బైటాయించి మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం మాట్లాడుతూ.. అన్ని సౌకర్యాలతో ఉన్న మార్కెట్‌లో కూరగాయాలు అమ్మకాలు జరపాలని డిమాండ్ చేశారు. రోడ్లపై కూరగాయల అమ్మకాలు నిలిపివేయాలని అందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట బైటాయించారు. సాయంత్రం అధికారులు రావడంతో వారికి వినతి పత్రం ఇచ్చి ధర్నా విరమించారు. ఈ ధర్నాలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బిక్షపతి, సభ్యులు ఏసు, చిన్న, విజయ్, నాగరాజు, కొమురయ్య, కళమ్మ, వెంకటమ్మ రాజేశ్వరీ, తోపాటు వ్యాపారులు పాల్గొన్నారు.

ఐసీసీసీ సమన్వయంతో పారిశుధ్య నిర్వహణ జరగాలి

• శానిటేషన్ అధికారులతో మేయర్ గుండు సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) సమన్వయంతో నగరంలోని పారిశుధ్య నిర్వహణ జరగాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యాలయంలో శానిటేషన్, ఐసీసీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడారు. కమర్షియల్ గార్బేజ్ వసూలు చేసి జవాన్లు రోజు వారిగా చేస్తున్న చెత్తకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐసీసీసీకి అందించాలన్నారు. ఇకపై ఏ వాహనం ఏ ప్రాంతంలో పనిచేస్తుంది అని ఐసీసీసీ నుంచి పర్యవేక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సూపర్‌వైజర్లు భాస్కర్, నరేందర్, శ్రీను, సురేష్, ఐటీ మేనేజర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేయర్ జన్మదిన వేడుకలు

మేయర్ గుండు సుధారాణి జన్మదినం సందర్భంగా సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. గ్రేటర్ వరంగల్ కార్యాలయంతో పాటు కాకతీయ మ్యూజికల్ గార్డెన్, ప్లానిటోరియం ప్రాంతంలో మేయర్‌తో పాటు కమిషనర్ మొక్కలు నాటారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణికి గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు మహిళా కార్పొరేటర్లు చాంబర్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

▸▸ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



పరిమళ కాలనీలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వడ్డేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. సోమవారం హనుమకొండ 56వ డివిజన్‌లోని పరిమళకాలనీ, సురేంద్రపురి కాలనీలలో రూ.1 కోటి 10లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. చారిత్రక వరంగల్ నగరాన్ని తెలంగాణలో రెండో రాజధానిగా చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని పేర్కొన్నారు. మామునూరు విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్కు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, భద్రకాళి దేవస్థానం అభివృద్ధి వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు శనిగరపు అనిత, కాంగ్రెస్ శ్రేణులు కందుకూరి పూర్ణచందర్, రుద్రోజు మణీంద్రనాథ్, చింత రమేష్ గౌడ్, భూక్య విజయ్ నాయక్, లావుడ్య రవినాయక్, వల్లకొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మడికొండ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెంలో రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో తట్టెడు మట్టి కూడా పోయలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు, పంపిణీ చేశామన్నారు. అలాగే అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజల నిత్య జీవితానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత సాధికారతకు చర్యలేవీ?

• లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ కడియం కావ్య

• సమాధానం ఇచ్చిన కేంద్ర మంత్రి మాండవియా

హనుమకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో యువత సాధికారతకు కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యవస్థాపకత లక్ష్యంగా తీసుకువచ్చిన పథకాల వివరాలను తెలియజేయాలని కేంద్ర మంత్రిని కావ్య కోరారు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా సమాధానం ఇచ్చారు. రాష్ట్రీయ యువ స్వశక్తికరణ్ కార్యక్రమ్(ఆర్‌వైఎస్‌కే), నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్), మైభారత్ వంటి కార్యక్రమాలు తెలంగాణలో అమలవుతున్నాయని వివరించారు. మైభారత్ 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా వరంగల్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏక్‌పెడ్ మాకే నామ్, స్కిల్స్ ఫర్ సక్సెస్, జిల్లా స్థాయి క్రీడా పోటీలు, వికసిత్ భారత్- యువ ఉత్సవ్‌లాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. తాజాగా ప్రకటించిన రూ.2లక్షల కోట్ల ప్రధాన మంత్రి ప్యాకేజీ ద్వారా ఐదేళ్లలో 4.1 కోట్ల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ- ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా, పీఎంఈజీపీ, స్కిల్ ఇండియా మిషన్ వంటి జాతీయ పథకాలను రాష్ట్రంలో మరింత వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతిభ కలిగిన యువత ఉన్నారని తెలిపారు. వారికి సరైన అవకాశాలు కల్పిస్తే వారు జాతీయ అభివృద్ధికి దోహదపడతారని అన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు సహకరించాలి

• హనుమకొండ జిల్లా జడ్జి పట్టాభి రామారావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పట్టాభి రామారావు

వరంగల్ లీగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల కేసుల పరిష్కారానికి న్యాయవాదులు తోడ్పడాలని హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి కం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ కె.పట్టాభి రామారావు కోరారు. సోమవారం 90 రోజుల మీడియేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. న్యాయవాదులనుద్దేశించి జిల్లా జడ్జి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన రాజీ మార్గంద్వారా పరిష్కరించి కక్షిదారులకు సహకరించాలని న్యాయవాదులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి జి. రామలింగం, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి సన్మానం

వరంగల్ మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 108 గ్రీన్ హెల్త్ సర్వీసులో సేవలు అందిస్తూ 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నజీరుద్దీన్ ఆధ్వర్యంలో ఈఎంటీ శ్రీనివాస్, ఈఎంటీ కంజుల వేణులను సోమవారం హనుమకొండ 108 కార్యాలయంలో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నజీరుద్దీన్ మాట్లాడుతూ.. పేద ప్రజల ప్రాణాలు కాపాడి ఎన్నో అవార్డులు, రివార్డులను వారు పొందడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో ఈఎంటీ మరిజ లక్ష్మణ్, 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి బి.దేవేందర్‌రావు, దస్తగిరి, చైతన్య, సురేందర్, స్వాతి, మమత, లవన్ కుమార్, కోటిలింగం, అశోక్‌రెడ్డి, 102 ఉద్యోగులు సురేశ్,చందు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాంతాల్లో స్పాంజ్ పార్కుల ఏర్పాటు తప్పనిసరి

వరంగల్ కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో స్పాంజ్ పార్కుల ఏర్పాటు తప్పనిసరని సీడీఎంఏ డాక్టర్ టీకే శ్రీదేవి అన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ అధికారులతో సీడీఎంఏ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరం నుంచి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరై స్పాంజ్ పార్కుల ఏర్పాటు గల అవకాశాలపై తెలియజేశారు. ఈ సందర్భం గా సీడీఎంఏ మాట్లాడుతూ.. స్పాంజ్ పార్కుల ఏర్పాటు చెన్నై నగరంలో విజయవంతంగా కొనసాగుతోందని, భారీవర్షాలు కురిసే క్రమంలో డ్రైనేజీలపై పూర్తిభారం పడకుండా అందుకు అనుగుణంగా నిర్మించిన రీచార్జి బోర్‌వెల్స్‌లోకి ఆ నీటిని పంపించి నిల్వ చేయడంతో పాటు భూగర్భ జలాలు పెరుగడానికి దోహదం చేస్తాయన్నారు. నగరంలో స్పాంజ్ పార్కు ఏర్పాటు చేయల్సిన అవసరం ఉందన్నారు. స్పాంజ్ పార్కుల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సీడీఎంఏ కమిషనర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో స్పాంజ్ పార్క్ ఏర్పాటుకు అవకాశం ఉందని, ఇందుకోసం అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనను పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ. మహేందర్, హెచ్ఓ రమేష్, డీఈ కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

కేయూ కె-హబ్ కార్యాలయం సందర్శన

కేయూ క్యాంపస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని టీహబ్ ప్రతినిధులు సోమవారం కేయూలోని టీహబ్‌ను సందర్శించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రూసా నోడల్ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి, కె-డైరెక్టర్ సవితాజ్యోత్స్నలతో హబ్ వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాస్‌లు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కెహబ్-టీహబ్‌ల మధ్య ఎంఓయూలపై చర్చించారు. కెహబ్ మౌలిక సదుపాయాలను పరిశీలించారు. స్టార్టప్‌ల స్థాపన, ఇంక్యూబేషన్ కేంద్రాల ఏర్పాటు లపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది హబీబ్, కిరణ్, సిద్ధార్థ్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

మడికొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తులలోకెల్ల ఉన్నతమైనదని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతి రెడ్డి అన్నారు. మడికొండ ఎస్సీ బీసీ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాలలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవిరెడ్డి మాలకొండారెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయురాలు కట్టా శ్రీదేవి ఉద్యోగ విరమణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవిని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీదేవి సేవలు మరువలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఎంఈవో బండారు మనోజ్‌కుమార్, జెడ్పీహెచ్ ప్రధానోపాధ్యాయురాలు బీరం సంధ్యారాణి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ, వేణుఆనంద్, మల్లారెడ్డి, లింగారావు, మన్నె చంద్రయ్య, ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

(5వ పేజీ తరువాయి)

స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రజావాణికి ఉదయం 10:30 గంటలకు ప్రతీ జిల్లా అధికారి హాజరై ముగిసేవరకు ఉండాలన్నారు. కొందరి అధికారుల పనితీరు బాగాలేదని, ఇప్పటికైనా సరిచేసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీనుతోపాటు సంబంధిత జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థలం మంజూరు చేయండి..

నాకు ఇందిరమ్మఇల్లు మంజూరైంది. అయితేఇల్లు కట్టుకోవడానికి స్థలం లేదు. ప్రభుత్వం స్థలం మంజూరు చేసి ఆదుకోవాలని హనుమకొండకు చెందిన దివ్యాంగుడు రావుల ఆనంద్‌కుమార్ వినతపత్రం అందజేశారు.

ప్రజావాణిలో అందిన వినతులను వెంటవెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్(ఎ.సి.) సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణిలో మొత్తం 152 వినతులు అందగా వాటిని శాఖల వారీగా ఎండార్స్ చేశారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 60 వినతులు, హౌసింగ్ పీడీ 28, జిల్లా సంక్షేమ శాఖ 7, జీడబ్ల్యూఎంసీ 6, సివిల్ సప్లయ్ 2, డీఆర్‌డీఏ 3, బీసీ డెవలప్‌మెంట్ శాఖ 5, వ్యవసాయశాఖ 5, డీపీవో 3, జిల్లా ఉపాధి శాఖ 5, ఎంజీఎం 2, సీపీ 2, ఏసీపీ నర్సంపేట 3, మునిసిపల్ కమిషనర్ నర్సంపేట 3, జిల్లా మార్కెఫెడ్‌కు 5 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, హౌసింగ్ పీడీ గణపతి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, సివిల్ సప్లయాస్ డీఎం సంధ్యారాణి, డీఈవో జ్ఞానేశ్వర్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

• ప్రైవేటు పాఠశాల వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన



పాఠశాల వద్ద మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్

హనుమకొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డులో ఓ ప్రైవేటు పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న పోలెపాక శ్రీనివాస్ (50) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. కాగా, మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం భట్టుపల్లి (కొత్తపల్లి హవేలి)కి చెందిన పోలెపాక శ్రీనివాస్ 20ఏళ్లుగా వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం పాఠశాలకు వచ్చిన శ్రీనివాస్‌కు గుండెపోటు రావడంతో పాఠశాలలోనే మృతి చెందాడు. అయితే శ్రీనివాస్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు పాఠశాల వద్ద ఆందోళన చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

జల సవాళ్ల పరిష్కారానికి కొత్త పద్ధతులు అవసరం

▸▸ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

▸▸ నిట్‌లో హైడ్రాలజి ఎక్స్‌ట్రీమ్‌పై వర్క్‌షాప్



ప్రొఫెసర్ వెంకటరమణ శ్రీధర్‌ను సత్కరిస్తున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

హనుమకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పుల వల్ల తలెత్తుతున్న జల సంబంధిత సవాళ్లను ఎదుర్కోవడంలో ఆధునిక హైడ్రాలజిక్ మోడలింగ్ అవసరం ఎంతోఉందని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. వరంగల్ నిట్‌లో హైడ్రాలజీ ఎక్స్‌ట్రీమ్‌పై పది రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. 'హైడ్రాలజీ ఎక్స్‌ట్రీమ్స్ విశ్లేషణ, నమూనాల అభివృద్ధిలో పురోగతులు'అనేఅంశంపై గ్లోబల్ ఇనిషియేటివ్ ఆఫ్ అకెడెమిక్ నెట్‌వర్క్స్ (జియాన్) కింద ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి మాట్లాడుతూ.. భారత పరిశోధకులు, ప్రాక్టీషనర్లలో నైపుణ్యాన్ని పెంపొందించడం. వరదలు, కరువు వంటి హైడ్రాలజిక్ ఎక్స్‌ట్రీమ్స్‌ను అధ్యయనం చేయటానికి ఆధునిక పద్ధతులను రూపొందించడంలో ఇలాంటి వర్క్‌షాపు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ వర్క్‌షాపునకు దేశమంతటి నుంచి 61 మంది ప్రముఖ పరిశోధకులు, అధ్యాపకులు, నిపుణులు ఇందులో పాల్గొంటున్నారు. ఈ వర్క్‌షాప్‌ను సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ కీసర వెంకటరెడ్డి సమన్వయ పరుస్తున్నారు. యూఎస్ఏలోని వర్జీనియా టెక్ విశ్వవిద్యాలయానికి చెందిన బయలాజికల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటరమణ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైడ్రాలజిక్ మోడలింగ్, వాతావరణ భిన్నతలు, జలవనరుల నిర్వహణపై తన అనుభవాన్ని పంచుకున్నారు. ప్రారంభోత్సవ సభలో అంతర్జాతీయ సంబంధాల డీన్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు, నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 28 నుండి ఆగస్టు 6వ తేదీ వరకు కొనసాగుతుంది.

కేయూలో సినీనటుడు నారాయణమూర్తి సందడి

కేయూ క్యాంపస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో సినీనటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి సందడి చేశారు. సోమవారం మధ్యాహ్నం కేయూను సందర్శించారు. లైబ్రరీలో చదువుతున్న విద్యార్థులతో కరచాలనం చేస్తూ ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ముచ్చటించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఇతర విద్యార్థి సంఘాల బాధ్యులు సంతోష్, అనిల్‌ల నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆగస్టు 22న తన దర్శక నిర్వహణలో రూపొందిన 'వర్సిటీలో పేపర్ లీక్' సినిమా విడుదల అవుతోందని చెప్పారు. యువత, తల్లిదండ్రులు సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను సినిమా ఇతివృత్తంగా నిర్మించినట్లు చెప్పారు. తన సినిమాలో వరంగల్‌కు చెందిన రచయిత మోటపలుకుల రమేశ్ రాసిన గీతాన్ని ఆలపించి అబ్బుర పరిచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు, లైబ్రరీ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే సీసీఎస్ సభ్యుల సంక్షేమమే ధ్యేయం

కాజీపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో షేర్ హోల్డర్‌ల సంక్షేమమే సొసైటీ ధ్యేయమని సీసీఎస్ అధ్యక్షుడు చిలుక స్వామి అన్నారు. కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సీసీఎస్ రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం చిలుక స్వామి మాట్లాడారు. రైల్వేలో ఏసొసైటీలో లేని విధంగా తమ సొసైటీ సభ్యులకు, వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మృతి చెందిన షేర్‌హోల్డర్ నామినీలకు ఏ సొసైటీలో లేని విధంగా రూ.13లక్షల వరకు రుణాలు మాఫీ చేయడమే కాకుండా వారు జమచేసుకున్న నగదును అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం షేర్ హోల్డర్‌ల కుటుంబ సభ్యులు లక్ష్మీప్రసన్న, బి. సరిత, కవిత, జి.అనూషలకు రూ.12లక్షల వరకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు ఆర్.రామ్మోహన్, డైరెక్టర్లు డి.శ్రీనివాస్ యాదవ్, దేవులపల్లి రాఘవేందర్, టి. క్రిష్ణయ్య, ఎ.రమేష్, ఎ. రాజేందర్, కె.శ్రీనివాసరావు, డి.కుమార్ పాల్గొన్నారు..

కలెక్టరేట్‌లో ఎఫ్‌సీడీఏ కమిషనర్ సమీక్ష

హనుమకొండ కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కమిషనర్ కె.శశాంక సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా నిర్వహించారు. ఈ సమీక్షలో వరంగల్, హనుమకొండ జిల్లాల అధికారులతో భారీ వర్షాలు, వరదలు, కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలు, సంసిద్ధతపై సమీక్షించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటొరెడ్డి, డీసీపీ షేక్ సలీమా, రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, విద్యుత్ సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

న్యూశాయంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని అంబేద్కర్ నగర్, జితేందర్‌సింగ్ నగర్‌లలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను అర్హులైన పేద ప్రజలకు ఇవ్వాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ ఇళ్లకోసం ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు ఎదురుచూస్తున్నారని, వారికి న్యాయం చేయాలని సీపీఐ నాయకులు కోరగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాయిని బాలసముద్రంలోని నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను తప్పకుండా అర్హులైన పేద ప్రజలకు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ నాయకులు ఆదరి శ్రీనివాస్, అశోక్‌స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, తదితర నాయకులు ఉన్నారు.

ఆసియా పారా త్రైక్వాండో పోటీలకు కృష్ణవేణి

కేయూ క్యాంపస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆగస్టులో మలేషియాలో నిర్వహించే 10ఆసియా పారాత్రైక్వాండో పోటీలకు కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం స్కాలర్ ఎం.కృష్ణవేణి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వర్సిటీ తరుపున కృష్ణవేణికి తన చాంబర్‌లో రూ.25వేల ఆర్థిక సహాయం అందచేశారు. వీసీ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు నుంచి ఆర్థిక సహాయం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కాజీపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సోమిడి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆన్‌లైన్ పోర్టర్ నమోదు, మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల వివరాలు, ఐరన్ ఫోలిక్ మాత్రల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్, నిర్ధారణ మందుల పంపిణీ, పేషెంట్ బుక్‌లెట్ నమోదు ఫాలోఅప్ వివరాల రిజిస్టర్ పరిశీలించారు. సమయపాలన, రికార్డుల నిర్వహణ లోపాలపై సిబ్బంది పనితీరుపై కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో ఎ.అప్పయ్య, డాక్టర్ అనిత, వి.అశోక్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టరేట్: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధిపనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం సాయంత్రం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కమ్యూనిటీ హాల్స్ గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా కమ్యూనిటీ హాల్స్ అంగన్‌వాడీ భవనాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి కొత్తగా చేపట్టే పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఈలు, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెమరీ

మతిమరుపు మామూలు విషయమే! అయితే కొన్ని సందర్భాల్లో అంతర్గత ఆరోగ్య సమస్యలకు అదొక సంకేతం కూడా! కాబట్టి మతిమరుపును తేలికగా కొట్టిపారేయకుండా, దాని మూల కారణాలను వెతికి వాటిని సరిదిద్దుకోవాలంటున్నారు వైద్యులు.



మతిమరుపు మతలబు ఇదే!

పైబడే వయసుతో జ్ఞాపకశక్తి నెమ్మదిగా క్షీణించడం సహజమే! అలాగే అడపాదడపా మనందర్లో కూడా అప్పుడప్పుడూ స్వల్ప మతిమరుపు తలెత్తుతూ ఉంటుంది. తాళాలు ఎక్కడ పెట్టామో గుర్తు లేక వెతుక్కుంటూ ఉంటాం. ఒక్కోసారి కళ్లజోడు ఎక్కడ పెట్టామో గుర్తుండదు. అయితే ఇలాంటి చిన్నా చితకా మతిమరుపులకు కంగారు పడవలసిన అవసరం లేదు. కానీ మునుపటి కంటే మతిమరుపు పెరిగినా, దాంతో దైనందిన జీవితంలో ఇబ్బందులు తలెత్తినా ఈ సమస్యను తీవ్రంగానే పరిగణించాలి. అయితే మెదడులోని నాడీ కణాల క్షీణత వల్ల, మెదడులోని జ్ఞాపకశక్తి కేంద్రాలు మార్పులకు గురవడం వల్ల పెద్ద వయసులో అల్జీమర్స్ వేధిస్తుంది. తేదీలు మర్చిపోవడం, దారులను గుర్తు పెట్టుకోలేకపోవడం, ఒక చోటకు వెళ్లి తిరిగొచ్చే దారిని గుర్తు తెచ్చుకోలేకపోవడం లాంటివన్నీ అల్జీమర్స్ లక్షణాలు. ఈ సమస్యను పూర్తిగా సరిదిద్దడం కష్టమే!

జ్ఞాపకశక్తి తగ్గడానికి కారణాలివే...

హైపోథైరాయిడిజం: ఈ సమస్యలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది.

విటమిన్ బి12: శాకాహారుల్లో ఈ విటమిన్ లోపం వల్ల జ్ఞాపకశక్తి తగ్గుతుంది.

లాంగ్ కొవిడ్: కొవిడ్ సోకిన వ్యక్తుల్లో దీర్ఘకాలం పాటు ఆ ప్రభావం కొనసాగి మతిమరుపు సమస్య వేధిస్తుంది.

మాదకద్రవ్యాలు: వీటి వాడకం వల్ల మెదడు ప్రభావితమై జ్ఞాపకశక్తి తగ్గుతుంది.

మందుల ప్రభావం: ఆందోళన, మానసిక కుంగుబాటు, నిద్రలేమి మందులతో మతిమరుపు తలెత్తుతుంది.

మద్యపానం: మద్యపాన ప్రియుల్లో బి6 విటమిన్ లోపించి, తత్ఫలితంగా మతిమరుపు మొదలవుతుంది.

మెదడులో గడ్డలు: మెదడులోని జ్ఞాపకశక్తి కేంద్రాల్లో క్యాన్సర్ రహిత గడ్డలు, క్యాన్సర్ గడ్డలు, క్షయ తలెత్తడం వల్ల జ్ఞాపకశక్తి లోపిస్తుంది.

సబ్‌డ్యురల్ హెమటోమా: మెదడు ఉపరితలంలో రక్తం గడ్డకట్టే సమస్య ఇది. పెద్దల్లో కనిపిస్తూ ఉంటుంది. తలకు చిన్న చిన్న దెబ్బలు తగిలినప్పుడు, అవి అంత తీవ్రమైనవి కాకపోయినా, వీరిలో సబ్‌డ్యురల్ హెమటోమా తలెత్తి, ఫలితంగా మతిమరుపు మొదలవుతుంది.

మెదడు పదును పెరిగేలా...

మెదడును ఎంత చురుగ్గా ఉంచుకుంటే జ్ఞాపకశక్తి అంత మెరుగ్గా ఉంటుంది. కాబట్టి మెదడుకు నిరంతరం పని పెడుతూ ఉండాలి. అందుకోసం....

- కొత్త అభిరుచిని అలవరుచుకోవాలి.
- డిజిటల్ డిటాక్స్ అనుసరించాలి.
- కథలు, వ్యాసాలు చదవడం, విశ్లేషించడం చేయాలి.
- సామాజిక సంబంధాలు కొనసాగించాలి.
- పజిల్స్, సుడోకులు సాధన చేయాలి.
- ఖాళీగా కూర్చునే బదులు మెదడుకు పని కల్పించే పనులకు పూనుకోవాలి.

ధూమపానం: ఈ అలవాటు వల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి, బ్రెయిన్ స్ట్రోక్ లేదా స్మాల్ వెజెల్ ఇస్కీమియాలతో జ్ఞాపకశక్తి కూడా తగ్గుతుంది

అయితే ఇవన్నీ సరిదిద్దే వీలున్న సమస్యలు. వీటి మూల కారణాలను సరిదిద్దుకోగలిగితే కోల్పోయిన జ్ఞాపకశక్తిని తిరిగి పొందవచ్చు.

తలకు దెబ్బలు తగిలినప్పుడు...

తలకు తగిలే దెబ్బలు కంకషన్, కంట్యూషన్, లాసిరేషన్ అనే మూడు రకాలుగా ఉంటాయి.

కంకషన్: కంకషన్‌లో తలెత్తే మతిమరుపు తాత్కాలికమైనది. ఆ సమయంలో ఏం జరిగిందో, ఎక్కడున్నారో గుర్తుండదు. ఇలా స్వల్ప కాలపు మతిమరుపును వైద్య పరిభాషలో ల్యూసిడ్ ఇంటర్వెల్ అంటారు. ఇది తాత్కాలిక మతిమరుపు మాత్రమే! తర్వాత మళ్లీ వాళ్ల జ్ఞాపకశక్తి మునుపటిలాగే మెరుగుపడుతుంది

కంట్యూషన్: కంకషన్‌కూ లాసిరేషన్‌కూ మధ్య స్థితి. మెదడు ఉపరితలానికి దెబ్బ తగిలి రక్తం గూడు కట్టుకోడాన్ని కంట్యూషన్‌గా భావించాలి. ఆ స్థితిలో కూడా మతిమరుపు తలెత్తుతుంది. ఈ దెబ్బ తగిలిన వ్యక్తుల్లో 70% మందికి సర్జరీ అవసరం ఉండదు. మందులతోనే పరిస్థితి మెరుగుపడుతుంది. కంట్యూషన్ స్థితి తీవ్రమైన సందర్భాల్లో మిగతా 30% మందికి మాత్రమే సర్జరీ అవసరమవుతుంది.

లాసిరేషన్: మెదడు ఉపరితలంతో పాటు మెదడు లోపలి భాగం కూడా దెబ్బతినే సమస్య ఇది. ఈ సమస్యలో మతిమరుపు ఉంటుంది. 70% మేరకు సర్జరీతో మతిమరుపు సమస్యను కూడా సరిదిద్దవచ్చు. అయితే సర్జరీ ఆలస్యమైనా, పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నా, సర్జరీ తదనంతరం కోలుకున్న తర్వాత కూడా మతిమరుపు సమస్య పూర్తిగా తొలగిపోకపోవచ్చు.

పసికందుల్లో మెదడు సమస్యలు

కొందరు పసికందుల్లో పుట్టుకతోనే సెరిబ్రల్ హైపోక్సియా సమస్య వెంటతెచ్చుకుంటారు. ఈ సమస్యలో మెదడు ఎదుగుదల తక్కువగా ఉంటుంది. ఈ పిల్లలు ఎదిగిన తర్వాత కూడా వీరిలో జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుంది. మద్యపానం, ధూమపానం అలవాట్లతో గర్భం దాల్చిన సందర్భాల్లో పుట్టే పిల్లలు తక్కువ బరువుతో పుడుతూ ఉంటారు. ఈ పిల్లల్లో మెదడు ఎదుగుదల కూడా పూర్తి స్థాయిలో ఉండదు కాబట్టి తర్వాతి కాలంలో మతిమరుపు సమస్య కూడా ఎక్కువగానే ఉంటుంది.

మతిమరుపు నియంత్రణ ఇలా...

- ధూమపానం మానేయాలి.
- మద్యపానంలో మితం పాటించాలి.
- పోషకాహారం తీసుకోవాలి.
- క్రమం తప్పక వ్యాయామం చేయాలి.
- మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో ఉంచుకోవాలి.
- క్రమం తప్పక ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలి.
- రోజుకు 7 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి.

డాక్టర్ రంగనాథం
సీనియర్ న్యూరో సర్జన్,
యాస్టర్ ప్రైమ్ హాస్పిటల్,
హైదరాబాద్.



బరువు తగ్గించే ‘బెండ’

అధిక పీచుతో పాటు శరీరం శక్తిని ఖర్చు చేసుకోగలిగే ప్రయోజనాలను కలిగి ఉన్న బెండకాయలతో తయారయ్యే పానీయం బరువు తగ్గించే పానీయంగా సర్వత్రా ఆదరణ పొందుతోంది. ఎందుకో తెలుసుకుందాం!




విటమిన్ సి, మెగ్నీషియం, ఫోలేట్‌లతో పాటు నీటిలో కరిగే పీచును కలిగి ఉన్న బెండ జీర్ణశక్తిని పెంచడంతో పాటు ఎక్కువ సమయం పాటు ఆకలిని కూడా నియంత్రించగలుగుతుంది. అలాగే బెండకాయల్లోని పీచు రక్తంలో చక్కెర మోతాదులను స్థిరంగా ఉంచుతుంది. బెండకాయల్లోని జిగురు, పేగులు చక్కెరను శోషించుకునే విధానాన్ని నెమ్మదింపజేసి, కొవ్వు నిల్వతో సంబంధమున్న ఇన్సులిన్ పెరుగుదలను నియంత్రిస్తుంది. అయితే అలాగని నచ్చిన సమయంలో బెండకాయ నీళ్లు తాగితే ఫలితం ఉండదు. అందుకోసం కొన్ని నియమాలు తప్పక పాటించాలి. ఈ నీళ్లను ఉదయం అల్పాహారానికి ముప్పై నిమిషాల ముందు తాగాలి. ఈ నీళ్ల తయారీ కోసం నాలుగు బెండకాయలను పలుచని చక్రాల్లా తరిగి, సీసా నీళ్లలో కలిపి రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచాలి. ఉదయాన్నే ఈ నీళ్లను వడగట్టి బ్రేక్‌ఫాస్ట్‌కు అరగంట ముందు తాగాలి. ఇలా చేస్తే, ఈ నీళ్లలోని పోషకాలన్నిటినీ శరీరం సమర్థంగా శోషించుకోగలుగుతుంది.

అధ్యయనం

మద్యం మాన్పించే నేసల్ స్ప్రే

మద్యం మీదకు మనసును మళ్లించే ఆక్సిటోసిన్ హార్మోన్‌ను ప్రభావితం చేయడం ద్వారా ఆ అలవాటును మాన్పించే దిశగా పరిశోధకులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. వివరాల్లోకి వెళ్తే....

లవ్ హార్మోన్‌గా పేర్కొనే ఆక్సిటోసిన్ సహాయంతో వ్యసనానికి ప్రతికూలంగా స్పందించేలా మెదడులో మార్పు తీసుకొచ్చే ప్రయత్నాలకు పరిశోధకులు పూనుకున్నారు. నేసల్ స్ప్రే ద్వారా ఆక్సిటోసిన్‌ను విడుదల చేసినప్పుడు, మద్యానికి అలవాటు పడిన ఎలుకల మెదళ్లలోని రివార్డ్ సెంటర్స్ స్పందన తీవ్రత తగ్గినట్టు పరిశోధనలో తేలింది. అలాగే అత్యధిక క్యాలరీలు కలిగి ఉన్న



ఆహారాన్ని తినడం ద్వారా కొందర్లో ఈ రివార్డు సెంటర్లు విపరీతంగా స్పందిస్తూ, సదరు వ్యక్తులను ఆహార వ్యసనపరులుగా మారుస్తూ ఉంటాయి. ఆక్సిటోసిన్ నేసల్ స్ప్రేను ఉపయోగించినప్పుడు, ఈ హార్మోన్ ఆకలితో సంబంధమున్న మెదడులోని ప్రదేశాన్ని ప్రేరేపించి, కడుపు నిండిపోయిన భావనకు లోను చేస్తుందనీ, ఫలితంగా అదనపు క్యాలరీల సమస్య కూడా తప్పుతుందని కూడా పరిశోధకులు అంటున్నారు. ఈ ప్రభావాలతో పాటు, శరీరం కొవ్వును ఖర్చు చేసుకునే వేగం, ఇన్సులిన్ సున్నితత్వం, గ్లూకోజ్ వినియోగం మొదలైన బరువుతో సంబంధమున్న అంశాలపరంగా కూడా ఆక్సిటోస్ ప్రభావాన్ని కనబరుస్తుందని పరిశోధకులు చెప్తున్నారు. భద్రత, ప్రభావాలపరంగా ఈ నేసల్ స్ప్రే ప్రయోగాలు సఫలీకృతమైతే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది మద్యపాన వ్యసనపరులు ఈ దురలవాటు ఉంచి విముక్తి పొందగలుగుతారు.

స్కిన్ కేర్

వానాకాలంలో అడపా దడపా తడుస్తూ ఉంటాం. వర్షపు నీళ్లలో తడుస్తూనే పనులు చేసుకుంటూ ఉంటాం. అయితే ఇలా నీళ్లలో ఎక్కువగా తడవడం, నానుతూ ఉండడం వల్ల ఈ కాలంలో కొన్ని చర్మ సమస్యల ముప్పు పొంచి ఉంటుంది. వాటి గురించిన అవగాహన కలిగి ఉండడం అత్యవసరం అంటున్నారు చర్మ వైద్యులు.



వానల్లో చర్మం ఇలా క్షేమం

వానలో తడవడం మనందరం ఇష్టపడతాం! వాతావరణంలోని కాలుష్య కారకాలు, సూక్ష్మక్రిములు వాన నీళ్లలో కలుస్తాయి, వాటి వల్ల చర్మ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వానలో తడిచిన వెంటనే శుభ్రంగా స్నానం చేయడం మంచిది. అలాగే వానలో తడిచిన దుస్తుల్లో ఎక్కువ సమయం పాటు ఉండిపోవడం వల్ల జ్వరం, చర్మం మీద దద్దుర్లు వేధిస్తాయి. అలాగే బాహుమూలలు లాంటి ప్రదేశాల్లోని చర్మపు ముడతల్లో తేమ నిల్వ ఉండిపోయి, ఫంగస్ పెరిగే అవకాశం ఎక్కువ. కాబట్టి ఆయా ప్రదేశాలను కూడా ఈ కాలంలో పొడిగా ఉంచుకోవాలి. వానలో దుస్తులతో పాటు బూట్లు, సాక్సులు కూడా తడిచిపోతూ ఉంటాయి కాబట్టి ప్రతి రోజూ సాక్స్ మారుస్తూ ఉండాలి. అలాగే ఈ కాలంలో గాలి ధారాళంగా చొరబడే సాక్సులు ఎంచుకోవాలి. అలాగే ఇంట్లో ఉన్నప్పటికీ చెప్పులు వేసుకునే నడుస్తూ ఉండాలి.

పాదాలు పాచితే?

నీళ్లలో ఎక్కువగా నానినప్పుడు పాదాలు, వేళ్లు పాచిపోతూ ఉంటాయి. ఇలాంటి ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు దూరంగా ఉండాలంటే తడిచిన పాదాలను వెంటనే పొడి వస్త్రంతో శుభ్రం చేసుకుంటూ ఉండాలి. రాత్రి పడుకోబోయే ముందు పాదాలకూ, వేళ్లకూ మాయిశ్చరైజర్ పట్టించడం మంచిది. ఒకవేళ పాదాలకు ఫంగల్ ఇన్‌ఫెక్షన్ సోకితే యాంటీ ఫంగల్ క్రీమ్‌ను పూసుకోవాలి. దీంతో ఇన్‌ఫెక్షన్ మరింత తీవ్రమవకుండా ఉంటుంది. ఈ జాగ్రత్తలతో కూడా ఇన్‌ఫెక్షన్ అదుపులోకి రానప్పుడు చర్మ వైద్యులను కలవాల్సి ఉంటుంది. యాంటీ ఫంగల్ మాత్రలతో ఈ తరహా ఇన్‌ఫెక్షన్లు



సమర్థంగా అదుపులోకి వస్తాయి. ఈ ఇన్‌ఫెక్షన్‌ను నిర్లక్ష్యం చేస్తే, అన్ని వేళ్లకూ పాకి, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ కూడా సోకి సమస్య మరింత క్లిష్టమవుతుంది. కాబట్టి వెంటనే అప్రమత్తమవుతూ ఉండాలి.

ఇలాంటి చెప్పులు మేలు

ఈ కాలానికి తగ్గట్టు గాలి చొరబడే చెప్పులు, బూట్లు ఎంచుకోవాలి. తడిచిన చెప్పులు, బూట్లు పూర్తిగా ఆరిన తర్వాతే వేసుకోవాలి. ఈ కాలంలో రబ్బరు, ప్లాస్టిక్ చెప్పులను ఎక్కువగా వాడుతూ ఉంటాం. కానీ వీటిలోకి చొరబడిన నీరు అక్కడే నిల్వ ఉండిపోయి, ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతుంది. కాబట్టి వీటికి బదులుగా స్లిపాన్స్ లాంటి బ్రీతబుల్ చెప్పులు ఎంచుకోవాలి. అలాగే ప్రతి ఉదయం, రాత్రి నిద్రకు ముందు పాదాలకూ, వేళ్లకూ తేలికపాటి మాయిశ్చరైజర్ పూసుకుంటూ ఉండాలి.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు దూరంగా...

ఈ కాలంలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు అత్యంత సహజం. వాతావరణంలో పెరిగే తేమ, చెమటల వల్ల చర్మపు ముడతల్లో, గోళ్ల అడుగున ఫంగల్ ఇన్‌ఫెక్షన్ తలెత్తుతుంది. దాంతో దురదలు మొదలవుతాయి. ఆ ప్రదేశంలో గోకడం వల్ల, గోళ్ల ద్వారా ఇన్‌ఫెక్షన్ ఇతర ప్రదేశాలకు సోకుతుంది. కాబట్టి ఈ ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండాలంటే పూర్తిగా ఆరిన దుస్తులే వేసుకోవాలి. వేసవిలో మాదిరిగా ధారాళంగా గాలి చొరబడే దుస్తులే వేసుకోవాలి. బిగుతుగా ఉండే జీన్స్ లాంటి వాటికి ఈ కాలంలో దూరంగా ఉండడమే మేలు. అలాగే చర్మపు ముడతల్లో యాంటీ ఫంగల్ పౌడర్లు వాడుకోవడం ద్వారా ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ పొందవచ్చు. ఈ ఇన్‌ఫెక్షన్ పెరిగి ఆ ప్రదేశమంతా ఎర్రగా మారి, దురద పెడుతుంటే తప్పనిసరిగా చర్మ వైద్యులను కలవాల్సి ఉంటుంది.

ఇతరత్రా సమస్యలు కూడా...

వానాకాలంలో చర్మ సమస్యలతో పాటు ఇంకొన్ని సమస్యలు కూడా పెరుగుతాయి. అవేంటంటే..

- **మొటిమలు:** ఈ కాలంలో వాతావరణంలో తేమ పెరగడం వల్ల చర్మంలోని నూనె గ్రంథులు ఎక్కువ నూనెలను స్రవించడం మొదలుపెడతాయి. దాంతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి, బ్యాక్టీరియా పెరిగిపోతుంది. ఫలితంగా అప్పటికే ఉన్న మొటిమల సమస్య మరింత తీవ్రమవుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. నాన్ గ్రీజీ మాయిశ్చరైజర్లు వాడుకోవాలి. అలాగే వానాకాలంలో ఎండ తక్కువగానే ఉన్నప్పటికీ సన్‌స్క్రీన్ తప్పనిసరిగా వాడుకోవాలి.
- **చుండ్రు:** ఈ కాలంలో వెంట్రుకల కుదుళ్లలో నూనె గ్రంథులు ఎక్కువ నూనెలను స్రవించడం వల్ల, ఫంగస్ పెరిగి, దాంతో పాటు చుండ్రు సమస్య పెరుగుతుంది. వెంట్రుకలు కూడా ఎక్కువగా రాలిపోతూ ఉంటాయి. ఈ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ఈ కాలంలో యాంటీఫంగల్ షాంపూలు వాడుకోవాలి.
- **కీటకాలతో తిప్పలు:** ఈ కాలంలో కీటకాలు కూడా విజృంభిస్తూ ఉంటాయి. ఇవి శరీరం మీద వాలినప్పుడు, కుట్టినప్పుడు, వాటి నుంచి కొన్ని స్రావాలు వెలువడి చర్మం మీద దద్దుర్లు లాంటి ఇన్‌సెక్ట్ బైట్ రియాక్షన్లు తలెత్తుతాయి. కాబట్టి కీటకాలు ఇంట్లోకి చొరబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

డాక్టర్ కె. క్రాంతి వర్మ
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
రెనోవా హాస్పిటల్స్
సనత్ నగర్, హైదరాబాద్



తెలుసుకుందాం

పుట్టుక మర్మం డీఎన్ఏలో భద్రం

ఎగ్ ఫ్రీజింగ్.. ఎంబ్రియో ఫ్రిజింగ్.. డీఎన్ఏ పరీక్షలు.. ఇలా ప్రతి రోజు వార్తల ద్వారా అనేక పదాల గురించి వింటూ ఉంటాం. వీటన్నింటికీ ఉన్న సంబంధం ఏమిటి అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.



డీఎన్ఏ టెస్ట్

ప్రతి వ్యక్తికి తన తల్లిదండ్రుల ద్వారా డీఎన్ఏ సంక్రమిస్తుంది. ఇది ఆ వ్యక్తికి మాత్రమే ప్రత్యేకంగా ఉంటుంది. ఈ డీఎన్ఏలో ఆ వ్యక్తి పుట్టుక రహస్యాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి. ఒకప్పుడు ఈ పరీక్షలను ఒక వ్యక్తి ఉన్న జన్యు లోపాలను గుర్తించటానికి చేసేవారు. ఆ తరువాతి కాలంలో ఒక బిడ్డకు తల్లితండ్రులెవ్వరనే విషయాన్ని తెలియజేయటానికి కూడా ఈ పరీక్షలు చేయడం మొదలుపెట్టారు. డీఎన్ఏ పరీక్ష ప్రక్రియలో మొదట తల్లితండ్రుల నుంచి, వారికి పుట్టిన బిడ్డ నుంచి రక్తనమూనాలను సేకరిస్తారు. వాటి నుంచి డీఎన్ఏ సంగ్రహిస్తారు. ఈ డీఎన్ఏలను పోల్చి చూసి... ఆ బిడ్డ ఆ తల్లితండ్రులకే పుట్టాడా? లేదా? అనే విషయాన్ని తెలుసుకుంటారు. ఈ మధ్య కాలంలో ఐవీఎఫ్ చికిత్సకు సంబంధించిన అంశాలపై వివాదాలు తలెత్తినప్పుడు వాటి పరిష్కారానికి డీఎన్ఏ పరీక్షలను చేస్తున్నారు. సాధారణంగా ఐవీఎఫ్ చికిత్స పద్ధతిలో భార్య నుంచి అండాన్ని, భర్త నుంచి వీర్యకణాలను సంగ్రహించి వాటిని ఫలదీకరణం చెందిస్తారు. అలా ఫలదీకరణం చెందిన పిండాన్ని భార్య గర్భంలో ప్రవేశపెడతారు. కొన్నిసార్లు అండం ఆరోగ్యకరంగా లేకపోయినా, వీర్యకణాలకు తగినంత సామర్థ్యం లేకపోయినా... వాటిని ఇతర దాతల నుంచి సేకరిస్తారు. గర్భం దాల్చటానికి అనుకూలమైన పరిస్థితులు లేనప్పుడు... ఇంకొక ఆరోగ్యకరమైన మహిళ గర్భంలో పిండాన్ని చొప్పిస్తారు. దీనినే ‘సరోగసి’ అంటారు. సాధారణంగా ఈ అంశాలన్నింటినీ చాలా రహస్యంగా ఉంచుతారు. కొన్నిసార్లు ఐవీఎఫ్ క్లినిక్స్‌లో సరైన ప్రొటోకాల్స్ పాటించకపోతే- అండాలు లేదా వీర్యకణాలు తారుమారయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో డీఎన్ఏ పరీక్షల ద్వారా అసలు తల్లితండ్రులెవ్వరనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ఈ పరీక్షల్లో ఫలితాలు 99.9 శాతం కచ్చితత్వంతో ఉంటాయి. ఒకప్పుడు కేవలం ప్రభుత్వ పరిశోధనాశాలల్లోనే డీఎన్ఏ పరీక్షలు చేసేవారు. ఇప్పుడు ప్రైవేట్ ల్యాబ్స్‌లో కూడా ఈ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి.

ఎగ్ ఫ్రీజింగ్

ప్రతి మహిళ శరీరంలోను అండాలు ఉంటాయి. ఈ అండాలలోకి వీర్యకణాలు ప్రవేశించినప్పుడే పిండం ఏర్పడుతుంది. ఇది సహజంగా జరిగే ప్రక్రియ. కానీ భవిష్యత్ అవసరాల కోసం అండాలను భద్రపరుచుకోవటాన్ని ఎగ్ ఫ్రీజింగ్ అంటారు. ఈ ప్రక్రియలో మహిళల అండాలను సబ్ జీరో టెంపరేచర్‌లో భద్రపరుస్తారు. వీటిని అవసరమైనప్పుడు బయటకు తీసి వాటిని పునరుత్పత్తికి ఉపయోగిస్తారు. ఈ మధ్యకాలంలో మహిళలు పునరుత్పత్తి ఎక్కువగా జరిగే వయస్సులో (20-35 ఏళ్ల మధ్య) తమ వృత్తుల్లో బిజీగా ఉంటున్నారు. ఆ సమయం దాటితే ఆరోగ్యకరమైన అండాల సంఖ్య తగ్గుతూ వస్తుంది. ఆ తర్వాత గర్భం ధరించటం కష్టమవుతుంది. ఈ వయస్సులో పిల్లలు కనటానికి ఇష్టం లేని వారు- ఆరోగ్యకరమైన తమ అండాలను భవిష్యత్తు కోసం దాచుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో 30 ఏళ్లు దాటిన మహిళలు తమ అండాలను దాచుకోవటం బాగా పెరిగింది. దీని కోసం ప్రత్యేక సంస్థలు వెలిసాయి. ఈ సంస్థలు ఎగ్ ఫ్రీజింగ్‌కు 1.5 నుంచి 2 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నాయి. దీనితో పాటు ప్రతి ఏడాది 30 నుంచి 40 వేల రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ అండాలు సుమారు 30 ఏళ్ల పాటు ఆరోగ్యంగా ఉంటాయి.

ఎంబ్రియో ఫ్రీజింగ్

పిండం ఏర్పడిన తర్వాత దానిని భద్రపరుచుకోవటాన్ని ఎంబ్రియో ఫ్రీజింగ్ అంటారు. ఈ పిండాన్ని జంటకు నచ్చిన సమయంలో గర్భంలో ప్రవేశపెట్టవచ్చు. ఇది కూడా 30 ఏళ్ల వరకు ఆరోగ్యంగానే ఉంటుంది. చాలా మంది పిండం ఏర్పడిన తర్వాత దానిని భద్రపరిస్తే భవిష్యత్తులో అది పనికిరాదని భావిస్తూ ఉంటారు. కానీ ఇది నిజం కాదని పునరుత్పత్తి నిపుణులు చెబుతున్నారు. ఈ మధ్యనే 30 ఏళ్ల పాటు భద్రపరిచిన పిండం ద్వారా ఒక మహిళ గర్భం దాల్చింది. ఎంబ్రియో ఫ్రిజింగ్‌కు 2.5 లక్షల రూపాయల దాకా ఖర్చు అవుతుంది. ప్రతి ఏడాది సుమారు 60 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

కాళేశ్వరంపై నేడో, రేపో నివేదిక!

- తుది మెరుగులు దిద్దుతున్న కమిషన్
- నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి
- రాహుల్ బొజ్జాకు నివేదిక అందించే చాన్స్

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేపట్టిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్.. తన నివేదికకు తుది మెరుగులు దిద్దుతోంది. గురువారం(31వ తేదీ)లోపు లేదా అదే రోజున ప్రభుత్వానికి నివేదిక అందించే అవకాశాలున్నాయి. ఈ మేరకు ఆదివారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్న జస్టిస్ పీసీ ఘోష్.. సోమవారం కమిషన్ కార్యాలయానికి వచ్చారు. ముసాయిదా నివేదికలో కొన్ని మార్పులు/చేర్పులు చేశారు. మంగళ, బుధవారాల్లో తుదిమెరుగులు పూర్తయ్యాక నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జాకు సమాచారం అందించి, నివేదికను తీసుకెళ్లాలని కోరనున్నట్లు తెలిసింది. కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై గత ఏడాది మార్చిలో ప్రభుత్వం కమిషన్ వేయగా.. జూన్‌లో విచారణ ప్రారంభమైంది. చివరిగా ఈ ఏడాది జూన్ 6న మాజీ మంత్రి ఈటల రాజేందర్, 9న మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, 11న కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామిన్ చేసి సమాచారం రాబట్టింది. ఇప్పటిదాకా మొత్తం 115 మందిని విచారించి.. సమాచారం సేకరించింది. ఈ నివేదికలో ఏమి ఉండనుంది? ఎవరెవరిని కమిషన్ తప్పుపట్టనుంది? ఏయే చర్యలకు ఉపక్రమించాలని సిఫారసు చేయనుంది? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కమిషన్ నివేదిక ఇచ్చాక.. దీనిపై మంత్రి వర్గంలో చర్చించనున్నారు. న్యాయశాఖ పరిశీలన అనంతరం శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టి, నివేదిక ఆధారంగా ఏమేం చర్యలు తీసుకుంటామనేది ప్రభుత్వం స్పష్టం చేయనుంది.

ఉపాధి హామీ నిధులను తక్షణమే విడుదల చేయాలి

- సర్పంచుల సంఘం డిమాండ్
- నేటి క్యాబినెట్ సమావేశంలో సర్పంచుల పెండింగ్ బిల్లుల
- చెల్లింపు గురించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వేడుకోలు

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఉపాధి హామీ జాయింట్ కమిషనర్ ఎం. శేషు కుమార్‌ను కలిసి సర్పంచుల తరఫున వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల మెటీరియల్ కాంపోనెంట్ ఫండ్ కింద నెల రోజుల క్రితం రూ.1200 కోట్లు విడుదల చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆ నిధులను గ్రామ పంచాయతీలకు మంజూరు చేయకపోవడం అన్యాయమని యాదయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ బిల్లులను రెండు మూడు రోజుల్లో గ్రామ పంచాయతీలకు జమ చేసేలా చూడాలని తాను కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. మంగళవారం జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపు గురించి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. సర్పంచుల పదవీకాలం అయిపోయి 19 నెలలు అవుతున్నా వారి పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం వివక్ష చూపడం సరైంది కాదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ముందు తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. సర్పంచుల ఆత్మహత్యలను నివారించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, తక్షణమే మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం సహ కార్యదర్శులు రాజేందర్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పురావస్తు నిర్లక్ష్యం.. రామప్పకు గ్రహణం

కురుస్తున్న రామలింగేశ్వరాలయం.. ప్రతి ఏటా ఇదే తంతు

వెంకటాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల వారసత్వానికి ప్రతీక.. యునెస్కో గుర్తింపు పొందిన 812 ఏళ్ల నాటి ఆలయం అది.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామప్ప దేవాలయం శనివారం మళ్లీ కురుస్తోంది. ప్రతి ఏటా ఇది సర్వ సాధారణమైందని, దీనికి పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని పర్యాటకులు ఆవేదన చెందుతున్నారు. ఫలితంగా దేవాలయానికి ముప్పు వాటిల్లుతోందని వాపోతున్నారు. గతంలో పూజారుల ఆవేదన, పత్రికలు గొంతెత్తి ఘోషించడంతో కేంద్రం రూ.15 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో 2015 ఫిబ్రవరి ఐదో తేదీన మరమ్మతు పనులు చేపట్టారు. ఆ తర్వాత పై కప్పులోని సజ్జల్ స్టోన్‌లో ఏర్పడ్డ సందుల నుంచి పడుతున్న నీటిచుక్కలతో రాతి స్తంభాల మీదుగా కక్షాసన ప్రదేశానికి చేరిన నీటితో లోపలంతా చిత్తడవుతోంది. చిన్న వర్షానికే నలువైపులా చూరు నుంచి లోపలికి వచ్చిన నీటితో ఆలయం తడిసిపోతోంది. వర్షపు నీటితో శిల్పాలు రంగు మారే అవకాశముందని పర్యాటకులు, ఆలయాల పరిరక్షణ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు లోపలికి రాకుండా శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని, లేకుంటే రామప్ప ఆలయానికి ముప్పు తప్పదని వాపోతున్నారు. 4 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం బురదమయం కావడమే కాదు..లోపలికి వెళ్లే దారి చిత్తడిగా మారడంతో వికలాంగులు, వృద్ధులు నానా తంటాలు పడుతున్నారు. గుడి



రాతిస్తంభం నుంచి కారుతున్న వర్షపు నీరు

చుట్టుపక్కల రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రామప్ప దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయన్న విమర్శలున్నాయి.



కక్షాసన ప్రదేశంలోకి చేరుకున్న వర్షపు నీరు

వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న కామేశ్వరాలయం

ఇక రామప్ప దేవాలయ సమీపంలోని శిథిలమైన కామేశ్వరాలయంపై శిథిలమైన రాళ్లను 2011లో తొలగించి పునర్నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. తిరిగి 2025 మార్చిలో పనులు ప్రారంభించినా పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యంతో కుంటు పడ్డాయని విమర్శలున్నాయి. ఆలయ పునర్నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరయ్యాయి. వచ్చే ఏడాది జూన్‌లో పూర్తి చేస్తామని అధికారులు అంటున్నా, ఆ దిశగా పనులు ముందుగా సాగడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆలయ స్థలంలో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది.

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద మృతి

- పరీక్ష రాస్తూ అపస్మారక స్థితికి.. ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించిన వైద్యులు
- ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంలో ఘటన



ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు, (ఇన్‌సెట్లో) ప్రతిమ(ఫైల్)

ఖమ్మం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం బోడియాతండా పంచాయతీ పరిధిలోని నామాతండాకు చెందిన భూక్యా రమేష్, భూబమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఇంటర్ చదువుతుండగా కుమార్తె ప్రతిమ(15) గొల్లగూడెం గ్రామం పరిధిలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం పాఠశాలలో ఎఫ్ఏ-1 సోషల్ పరీక్ష రాస్తూ కళ్లు తిరిగి కింద పడిపోయింది. ఉపాధ్యాయులు వెంటనే ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ప్రతిమ మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. తమ కుమార్తెకు ఎలాంటి అనారోగ్యం, మూర్ఛ వంటివి లేవని, కానీ పాఠశాల వారు మూర్ఛ వచ్చిందని చెబుతున్నారని, ఆమె మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. వారికి మద్దతుగా విద్యార్థి సంఘాల నాయకులు కూడా ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీడీ విజయలక్ష్మి వెంటనే ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ప్రతిమ మృతదేహాన్ని సందర్శించారు. ప్రతిమ మృతి ఘటనపై పాఠశాలలో విచారణ జరిపేందుకు ఓ కమిటీని నియమిస్తామని, నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బ్యాంక్ అధికారులమంటూ ఫోన్‌లో నమ్మించి

- 7.05 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు ఏపీకే లింక్ పంపి మొబైల్‌ను హ్యాక్ చేశారు. అతడి ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను రద్దు చేసి, ఈ మొత్తాన్ని క్రెడిట్ కార్డుకు బదిలీ చేసి, పలు దఫాలుగా రూ.7.05 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్ తార్నాకలో నివసిస్తున్న ఓ వ్యక్తి (27)కి ఈ నెల 25న సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. బ్యాంకు అధికారులమంటూ నమ్మించి ఫిక్స్‌డ్ డిపాజిట్ ఆటో రెన్యువల్ ఆప్షన్‌ను వినియోగించుకోవాలని కోరారు. దానికి బాధితుడు ఒప్పుకోకపోవడంతో, అతడితో మాట్లాడుతూనే ఫోన్‌కు మెసేజ్ ద్వారా ఏపీకే లింక్‌ను పంపారు. బాధితుడి ప్రమేయం లేకుండా ఏపీకే లింక్ తెరుచుకొని, "ఐమొబైల్ ఎలైట్" అనే యాప్ ఇన్‌స్టాల్ అయింది. కొద్దిసేపటి తర్వాత అతడి ప్రమేయం లేకుండా ఓటీపీ రాకుండా అతడి క్రెడిట్ కార్డు నుంచి పలు దఫాలుగా రూ.7.05 లక్షలు పలు ఖాతాలకు బదిలీ అయినట్లు సందేశాలు వచ్చాయి. దాంతో కస్టమర్ కేర్‌ను సంప్రదించిన బాధితుడు క్రెడిట్ కార్డును బ్లాక్ చేశాడు. బ్యాంకు అధికారులను సంప్రదించగా...ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను రద్దు చేసి, ఆ మొత్తాన్ని క్రెడిట్ కార్డుకు బదిలీ చేశారని తెలిపారు. ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు క్రెడిట్ కార్డులో ఉన్న డబ్బును ఇతర ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశారు.

బీసీల పట్ల కాంగ్రెస్, బీజేపీలది వగల ప్రేమ

- మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీసీ వర్గాల ఓట్ల కోసమే రెండు జాతీయ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని, రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్, బీజేపీలది వగల ప్రేమ మాత్రమేనని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావడం గగనమైపోతోందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రానికి పంపిన బీసీ బిల్లు పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించడం లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ముస్లిం రిజర్వేషన్లను సాకుగా చూపి బీసీ రిజర్వేషన్ల పెంపును బీజేపీ అడ్డుకుంటోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం లేదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు రాష్ట్ర పరిధిలోని అంశంకాదని, ఎవరైనా పెంచితే జైలుకు వెళ్లడం ఖాయమని ప్రతిపక్షంలో ఉన్నపుడు మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడు తెలిసి కూడా రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్‌ను గవర్నర్ వద్దకు ఎందుకు పంపారో చెప్పాలని డిమాండ్ చేశారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★



ఇది వారి కింగ్‌డమ్

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన చిత్రం 'కింగ్‌డమ్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ ఆకట్టుకున్నాయి. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "మీ అభిమానం నాకు దేవుడిచ్చిన వరం. మీరు నా విజయాన్ని చూడాలని కోరుకుంటున్నాను. ఇది విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' కాదు. గౌతమ్ తిన్ననూరి, అనిరుధ్, ఎడిటర్ నవీన్ నూలితో పాటు సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లేలా పనిచేసిన చిత్రబృందానిది. ఇందులో నా బ్రదర్స్‌గా సత్యదేవ్, వెంకటేశ్ అదరగొట్టారు. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది" అని చెప్పారు. "విజయ్ ఓ అద్భుతమైన వ్యక్తి. ఏ సపోర్ట్ లేకుండా ఎదిగారు. ఆయనకు ఈ సినిమాతో గుర్తుండిపోయే హిట్ దక్కాలని కోరుకుంటున్నా. అనిరుధ్ పట్టిందల్లా బంగారం అవుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందంగా ఉంది" అని నటుడు సత్యదేవ్ చెప్పారు. "తెలుగు సినిమాల పరంగా నాకు నాగవంశీ మెంటార్. 'కింగ్‌డమ్' 'జెర్సీ'కి మించిన హిట్ అవుతుంది. నాపై తెలుగువారు చూపిస్తున్న ప్రేమకు రుణపడి ఉంటాను" అని సంగీత దర్శకుడు అనిరుధ్ తెలిపారు.

బర్త్‌డే స్పెషల్స్



'మహానటి', 'సీతారామం', 'లక్కీ భాస్కర్' వంటి విజయవంతమైన చిత్రాలతో టాలీవుడ్‌లో ప్రత్యేక ఫ్యాన్స్ బేస్‌ని ఏర్పరచుకున్నారు మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. ఇప్పుడు మరో రెండు చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించబోతున్నారు. సోమవారం దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 'కాంత' చిత్రం నుంచి టీజర్, సాయంత్రం 'ఆకాశంలో ఒక తార' సినిమాకు సంబంధించిన గ్లింప్స్ విడుదలయ్యాయి. సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తోన్న 'కాంత' చిత్రాన్ని రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. 1950-60ల్లో ఓ హీరో, డైరెక్టర్ మధ్య ఘర్షణ నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. తెలుగు-తమిళంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా సెప్టెంబరు 12న విడుదల కానుంది. ఇక తెలుగు దర్శకుడు పవన్ సాధినేని తెరకెక్కిస్తోన్న 'ఆకాశంలో ఒక తార' చిత్రాన్ని గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. గ్లింప్స్‌లో దుల్కర్‌ని ఓ సాధారణ కుర్రాడిగా చూపించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ్, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

మోతెవరి నవ్విస్తాడు



తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో శివకృష్ణ బుర్రా తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'మోతెవరి లవ్ స్టోరీ'. అనిల్ గీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో నటించారు. మధుర శ్రీధర్, శ్రీరామ్ శ్రీకాంత్ నిర్మించారు. ఈ సిరీస్ ఆగస్టు 8న 'జీ5'లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో, దర్శకుడు తరుణ్ భాస్కర్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. మధుర శ్రీధర్ మాట్లాడుతూ 'తెలంగాణలో ఇలాంటి కొత్త కథలు రావడానికి తరుణ్ భాస్కరే స్ఫూర్తి. ఈ సిరీస్ తర్వాత మరెన్నో గొప్ప కథలు వస్తాయి. 'మోతెవరి లవ్ స్టోరీ' చాలా కొత్తగా ఉంటుంది. అందరినీ అలరిస్తుంది' అని అన్నారు.

బ్యూటిఫుల్ మెలోడీ



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కిస్తున్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు మేకర్స్. 'మల్లిక గంధ' అంటూ ఓ బ్యూటిఫుల్ మెలోడీని విడుదల చేశారు. సిద్ధు, రాశీ ఖన్నాల ప్రేమ ప్రపంచాన్ని అద్భుతంగా పరిచయం చేసిందీ గీతం. కృష్ణ కాంత్ రచించగా, సిధ్‌శ్రీరామ్ ఆలపించారు. థమన్ సంగీతం అందించారు.

త్వరలోనే ఫైటర్



మణికంఠ, ఐరా బన్సల్ జంటగా ప్రభాస్ నిమ్మల తెరకెక్కిస్తున్న చిత్రం 'ఫైటర్ శివ'. సునీల్, వికాస్ వశిష్ఠ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నర్సింగ్ ఉన్నం, రమేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను దర్శకుడు సంపత్ నంది విడుదల చేశారు.

అదిరిపోయే అప్‌డేట్!



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ' చిత్రానికి సంబంధించి లేటెస్ట్ అప్‌డేట్ వచ్చింది. అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో నాగార్జున ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు ఆమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. రజనీకాంత్, నాగార్జున, ఆమీర్‌ఖాన్, ఉపేంద్ర.. పవర్‌ఫుల్ లుక్స్‌లో కనిపించిన ట్రైలర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. సురేశ్‌బాబు, దిల్‌రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ కలసి 'కూలీ' తెలుగు థియేట్రికల్ హక్కులు కొని ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కళానిధి మారన్ చిత్ర నిర్మాత.



తాను పుట్టకముందే ప్రత్యర్థి హంపికి గ్రాండ్ మాస్టర్ హోదా.. ఎన్నో అంతర్జాతీయ టోర్నీలు గెలిచిన అనుభవం.. అయితేనేం, యువ కెరటం దివ్యా దేశ్‌ముఖ్ సంచలన ఆటతీరుతో అదరగొట్టింది. తనకంటే రెట్టింపు వయసున్న హంపిని ఓడించి.. వరల్డ్‌కప్ సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించింది. టీనేజ్‌లోనే అద్భుతం చేసిన 19 ఏళ్ల దివ్య.. 64 గళ్ల ఆటలో యువరాణిగా చెస్ ప్రపంచాన్ని శాసించేందుకు సిద్ధమైంది.

దివ్య చరితం

మహిళల చెస్ ప్రపంచకప్ విజేత దేశ్‌ముఖ్

గ్రాండ్ మాస్టర్ హోదా కూడా సొంతం

- ఈ ఘనత సాధించిన పిన్నవయస్కురాలిగా రికార్డు
- ఫైనల్ టైబ్రేక్‌లో హంపికి నిరాశ

ఇది ఆరంభమే

దివ్యా దేశ్‌ముఖ్

"ఈ విజయాన్ని జీర్ణించుకోవడానికి నాకు కొంత సమయం కావాలి. ఒక్క జీఎం నార్మ్‌కూడా లేని నాకు.. ఈ తరహాలో గ్రాండ్ మాస్టర్ హోదా దక్కడాన్ని నమ్మలేకపోతున్నా. అంతా అదృష్టంగా భావిస్తా. ఈ విజయం ఆరంభం మాత్రమే..!"

- ఫిడే మహిళల ప్రపంచకప్ నెగ్గిన దివ్యకు, రన్నరప్ హంపికి అభినందనలు. ఫైనలిస్టులు ఇద్దరు భారత్ నుంచే కావడం గర్వించదగ్గ అంశం. మన దేశంలో మహిళలకు అపారమైన ప్రతిభ ఉందనేందుకు ఇదే నిదర్శనం. - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అద్భుతమైన ఇద్దరు భారత క్రీడాకారిణుల మధ్య చరిత్రాత్మక ఫైనల్. విజేత దివ్యకు అభినందనలు. అమోఘమైన పోరాటం ప్రదర్శించిన హంపికి కూడా అభినందనలు. -ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రపంచకప్ గెలవడం, జీఎం హోదా దక్కడం, క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించడం.. ఒకేసారి ఇన్ని ఘనతలు అందుకున్న దివ్యకు అభినందనలు. ఉత్కంఠభరితమైన పోరు. హంపి గొప్ప పోరాటస్ఫూర్తిని కనబర్చింది. భారత చదరంగానికి అతిపెద్ద సంబరం తీసుకొచ్చిన క్షణం. - విశ్వనాథన్ ఆనంద్

చెస్‌లో మనదే ఆధిపత్యం

ప్రస్తుతం ప్రపంచ చదరంగంలో భారత్‌దే ఆధిపత్యం. ఏకంగా ఐదు టైటిళ్లు మన ఖాతాలోనే ఉండడమే ఇందుకు నిదర్శనం.

1. ప్రపంచ చాంపియన్ - గుకేశ్
2. పురుషుల ఒలింపియాడ్ విజేత - భారత్
3. మహిళల ఒలింపియాడ్ విజేత - భారత్
4. మహిళల ప్రపంచ ర్యాపిడ్ విజేత - హంపి
5. మహిళల ప్రపంచ కప్ విజేత - దివ్య

88వ భారత జీఎం..

వరల్డ్‌కప్ విజేతగా నిలవడంతో గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదాకు కావాల్సిన నార్మ్‌ను దివ్య సొంతం చేసుకొంది. ఈ క్రమంలో భారత 88వ గ్రాండ్ మాస్టర్‌గా అవతరించింది. హంపి, హారిక, వైశాలి తర్వాత దేశ నాలుగో మహిళా జీఎంగా రికార్డులకెక్కింది. 2002లో హంపి జీఎం హోదా సాధించింది. అప్పటికి దివ్య జన్మించనే లేదు. 2005లో పుట్టిన దివ్య గత మూడేళ్లలోనే కెరీర్‌లో వేగంగా ఎదిగింది.

ధోనీలాగే..

ధోనీ తరహాలోనే దివ్య కూడా ఒత్తిడిలో ఎంతో అద్భుతమైన ప్రదర్శన చేస్తుందని ఆమె మాజీ కోచ్ శ్రీనాథ్ చెప్పాడు. 'ఆమె ఎంతో దూకుడుగా ఆడేది. కానీ, అనుభవం పెరుగుతున్న కొద్దీ మూడు ఫార్మాట్లలోనూ ఆల్‌రౌండర్‌గా మారింది. ఎంతో ఒత్తిడిలోనూ కూల్‌గా ఆడడం దివ్య ప్రత్యేకత. ధోనీ ఎలా రిస్క్ తీసుకొని మ్యాచ్‌లు గెలుస్తాడో.. ఆమె కూడా నరాలు తెగే ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేస్తుంది' అని శ్రీనాథ్ ప్రశంసించాడు.





బటూమి (జార్జియా): ఎంతో ఉత్కంఠగా సాగిన మహిళల వరల్డ్‌కప్ టైబ్రేక్‌లో 19 ఏళ్ల దివ్యా దేశ్‌ముఖ్ అదరగొట్టింది. తెలుగు క్రీడాకారిణి కోనేరు హంపితో జరిగిన మెగా ఫైనల్లో సోమవారం జరిగిన టైబ్రేక్‌లో దివ్య 2.5-1.5తో విజయం సాధించింది. ఈ విక్టరీతో ప్రతిష్ఠాత్మక చెస్ వరల్డ్‌కప్ టైటిల్‌ను సొంతం చేసుకొన్న తొలి భారత, పిన్నవయస్కురాలిగా దివ్య చరిత్ర సృష్టించింది. అంతేకాదు.. గ్రాండ్ మాస్టర్ హోదాను కూడా దక్కించుకొంది. మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్స్, ప్రపంచకప్ మినహా అన్ని టైటిళ్లు నెగ్గిన హంపి.. చిరకాల స్వప్నానికి అడుగుదూరంలోనే నిలిచిపోయింది. విశ్వనాథన్ ఆనంద్ (2000, 2002) తర్వాత చెస్ వరల్డ్‌కప్ గెలిచిన భారత ప్లేయర్‌గా దివ్య రికార్డులకెక్కింది.

హోరా హోరీగా: టైటిల్ ఫైట్‌లో తొలి రెండు క్లాసిక్ గేమ్‌లు డ్రా కావడంతో హంపి, దివ్య 1-1తో సమంగా నిలిచారు. నిర్ణాయక టైబ్రేక్‌లో తొలి రెండు ర్యాపిడ్ గేమ్‌ల సెట్‌లో తీవ్ర ఒత్తిడి మధ్య దివ్య 1.5-0.5తో హంపికి ఝలకిచ్చింది. ర్యాపిడ్ గేమ్-1లో ఇద్దరూ బలగాలను నడిపించారు. 81 ఎత్తులపాటు పోరాడినా ఈ గేమ్ డ్రాగా ముగిసింది. తెల్లపావులతో ఆడిన దివ్య కింగ్ పాన్ ఓపెనింగ్ చేయగా.. పెట్రోఫ్ డిఫెన్స్‌ను ఎంచుకొన్న హంపి తొలి ఎత్తులోనే డ్రాకు ప్రయత్నిస్తున్నట్టు అర్థమైంది.

కూల్చేసిన 'సమయం': రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడిన హంపి కాటలాన్ ఓపెనింగ్ ఎంచుకోగా.. ముందుగానే సన్నద్ధమైన దివ్య అదే రీతిలో కౌంటర్ ఇచ్చింది. ఆరంభంలో దేశముఖ్ వేగంగా ఎత్తులు వేస్తే.. హంపి మాత్రం కొంత సమయం తీసుకోవడంతో ఆమెపై క్రమంగా ఒత్తిడి పెరిగింది. అయితే, ఇద్దరూ బలగాల్లో సమంగా నిలిచారు. దీంతో ఈ గేమ్ కూడా డ్రాగానే భావించారు. కానీ, 40వ ఎత్తులో ఒక్కసారిగా సంయమనం కోల్పోయిన హంపి.. పాన్‌ను త్యాగం చేసి ప్రత్యర్థి కోటలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేసింది. మిడిల్ గేమ్‌లో వైట్ పాన్‌ను చంపిన దివ్య.. ఆ తర్వాత క్వీన్‌ను త్యాగం చేసింది. ఈ క్రమంలో 54వ ఎత్తులో ప్రత్యర్థి పాన్‌ను చంపిన హంపి తప్పిదం చేసింది. దీంతో ఎక్కువ ఖాళీ రావడంతో దేశ్‌ముఖ్ తన బలగాలను స్వేచ్ఛగా కదిలించగలిగింది. అయితే, ఎండ్‌గేమ్‌లో కోనేరు చేసిన తప్పిదం, సమయాభావంతో దివ్య గెలిచే స్థితిలో నిలిచింది. ఆఖరికి 75వ ఎత్తు అనంతరం హంపి రిజైన్ చేయడంతో.. దివ్య భావోద్వేగంలో మునిగిపోయింది.

ప్రైజ్‌మనీ
దివ్యకు - రూ. 43 లక్షలు
హంపికి - రూ. 30 లక్షలు



వచ్చేసింది.. యువరాణి

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అంచనాలకు మించి రాణించడం.. అద్భుత ఆటతీరుతో అబ్బురపరచడం.. ఆమె నైజం. కీలక దశలో ఒత్తిడిని అధిగమించడం.. పరాజయం తప్పదనుకున్న చోట గెలిచి చూపించడం.. ఆమెకు అలవాటు. 18 ఏళ్లకే జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్ నెగ్గడం.. 19 ఏళ్లకే సీనియర్ ప్రపంచ కప్‌ను ముద్దాడడం.. పిన్న వయసులోనే ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికవడం.. ఇలా ఎన్నెన్నో ఘనతలు చిరుప్రాయంలోనే సొంతం చేసుకున్న దివ్యా దేశ్‌ముఖ్ పేరుకే టీనేజర్.. చెస్ బోర్డు ఎదురుగా ఉంటే తనదైన వ్యూహాలతో పావులు కదుపుతుంది.. ఎంత అనుభవమున్న ప్రత్యర్థినైనా గెలుపు ఎత్తులతో చిత్తు చేస్తుంది. అసాధారణ విజయాలతో ఇప్పుడు మహిళల చదరంగానికి యువరాణిగా పట్టాభిషేకం అందుకుంది.

అనుకోకుండా చెస్‌లోకి..: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన దివ్య తల్లిదండ్రులు జితేంద్ర, నమ్రత ఇద్దరూ డాక్టర్లు. ఐదేళ్ల వయసులో 2010లో దగ్గరలోని అకాడమీలో అక్కతో కలసి బ్యాడ్మింటన్‌లో కోచింగ్ కోసమని వెళ్లింది. అయితే, ఎత్తు తక్కువగా ఉండడంతో ఆమెను చెస్‌లో జాయిన్ చేశారు. క్రమంగా ఆటపై మక్కువ పెంచుకొన్న దివ్య రెండేళ్లలోనే పుదుచ్చేరిలో జరిగిన అండర్-7 నేషనల్స్‌లో స్వర్ణం సాధించింది. 2013లో ఇరాన్‌లో జరిగిన పోటీల్లో అండర్-8 ఆసియా విజేతగా నిలిచిన దేశ్‌ముఖ్.. వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకొంది. 2014లో అండర్-10 వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత 40 సార్లు దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె.. 35 సార్లు పోడియం ఫినిష్ చేసింది. 23 స్వర్ణ, 7 రజత, 5 కాంస్య పతకాలు కొల్లగొట్టింది. 2020లో భారత జట్టు చెస్ ఒలింపియాడ్ గెలవడంలో తనదైన పాత్ర పోషించింది. 18 ఏళ్ల వయసులో ఆసియా చెస్ కిరీటాన్ని అందుకొంది. గతేడాది జూన్‌లో వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గి పిన్నవయసులోనే ఈ ఘనత సాధించిన అమ్మాయిగా రికార్డు సృష్టించింది. జూనియర్ విభాగంలో నెంబర్‌వన్ ర్యాంక్‌ను సైతం సొంతం చేసుకొంది. దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటూ రెండేళ్ల క్రితమే ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదాను సొంతం చేసుకొంది. ఇప్పుడు భారత మహిళల చదరంగంలో నెంబర్‌వన్‌గా విరాజిల్లుతున్న హంపినే ఓడించి ప్రపంచ కప్‌తో సరికొత్త చరిత్ర సృష్టించింది.

మరో ఆటగాడిని అనుమతించాలి

గాయాలపై కోచ్ గంభీర్

మాంచెస్టర్: మ్యాచ్ సందర్భంగా క్రికెటర్ తలకు గాయమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అతడి స్థానంలో మరో ప్లేయర్‌ను అనుమతిస్తుంటారు. అలా వచ్చే ఆటగాడికి బ్యాటింగ్, బౌలింగ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే తల కాకుండా ఇతర శరీర భాగాలకు గాయాలైతే ఈ వెసులుబాటు లేదు. ఇదే విషయమై భారత జట్టు కోచ్ గంభీర్ స్పందించాడు. 'ఓ ఆటగాడి గాయం తీవ్రతను రెఫరీ, అంపైర్ పరిశీలించాక సబ్‌స్టిట్యూట్‌ను ఆడించడంపై నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో సిరీస్ హోరాహోరీగా సాగుతోంది. ప్రత్యర్థి 11 మంది ఆటగాళ్లతో ఆడుతుంటే మేం పది మందితో ఎలా పోరాడగలం?' అని గంభీర్ ప్రశ్నించాడు.

శార్దూల్, అన్షుల్ కష్టమే..

మాంచెస్టర్: నాలుగో టెస్టులో విఫలమైన పేసర్లు శార్దూల్ ఠాకూర్, అన్షుల్ కాంబోజ్‌లపై వేటు పడే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో గురువారం నుంచి జరిగే ఐదో టెస్టులో భారత్ పటిష్ఠ జట్టుతో బరిలోకి దిగాలనుకుంటోంది. ముఖ్యంగా బౌలింగ్ కూర్పుపై దృష్టిసారిస్తోంది. ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటర్లు ఉండాలనే ఉద్దేశంలో స్పెషలిస్ట్ బౌలర్ సేవలను కోల్పోవాల్సి వస్తోంది. 2014 తర్వాత ప్రత్యర్థికి 600+ పరుగులు సమర్పించుకున్న భారత్ ఈసారి ఎలాంటి తప్పూ చేయాలనుకోవడం లేదు. అన్షుల్ స్థానంలో ఆకాశ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ పోటీ పడనున్నారు. ఇక నాలుగో బౌలర్‌గా స్పిన్నర్ కుల్దీప్‌ను ఆడించే అవకాశం ఉంది. మరోవైపు భారత జట్టు మాంచెస్టర్ నుంచి సోమవారం రైలులో లండన్‌కు చేరుకుంది. అలాగే నేటి మధ్యాహ్నం 2 గంటల నుంచి తమ ప్రాక్టీస్‌ను ఆరంభించనుంది.

ఇంగ్లండ్ జట్టులోకి ఒవర్టన్

లండన్: భారత్‌తో జరిగే ఐదో టెస్టు కోసం పేసర్ జేమీ ఒవర్టన్‌ను ఇంగ్లండ్ తిరిగి రప్పించింది. తొలి మూడు టెస్టుల్లో అతడు జట్టుతో పాటే ఉండగా.. మాంచెస్టర్ మ్యాచ్‌కు ముందే కౌంటీల కోసం విడుదల చేశారు. అయితే నాలుగో టెస్టులో ఇంగ్లండ్ బౌలర్లు అలసిపోయారు. గురువారం నుంచే ఆఖరి టెస్టు జరుగనుండడంతో ముందు జాగ్రత్తగా పేస్ ఆల్‌రౌండర్ ఒవర్టన్‌ను రప్పించారు. భుజం నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ స్టోక్స్ చివరి టెస్టుకు అందుబాటులో ఉంటానని ప్రకటించాడు.

నేటి నుంచి మకావు ఓపెన్

మకావు: భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి ఈ సీజన్‌లో పలు టోర్నీలలో నిలకడగా రాణిస్తున్నా టైటిల్ మాత్రం అందడం లేదు. ఈనేపథ్యంలో మంగళవారం నుంచి జరిగే మకావు ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలవాలని వారు పట్టుదలగా ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, ప్రణయ్, ఆయుష్, మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, అనుపమ, ఆకర్షి తలపడుతున్నారు. డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా, ప్రియ/శ్రుతి, మిక్స్‌డ్‌లో ధ్రువ్/తనీష, రుత్విక/రోహన్ బరిలో ఉన్నారు.

బిజినెస్

మళ్లీ ద్విచక్ర వాహన మార్కెట్లోకి కైనెటిక్

కైనెటిక్ డీఎక్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ విడుదల

ధర రూ.1,11,499



న్యూఢిల్లీ: కైనెటిక్ ఇంజనీరింగ్ ద్విచక్ర వాహనాల విభాగంలోకి తిరిగి ప్రవేశించింది. ఒకప్పుడు అద్భుతమైన ప్రజాదరణ పొందిన కైనెటిక్ డీఎక్స్ స్కూటర్‌లో విద్యుత్ వెర్షన్‌ను సోమవారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ స్కూటర్ ఒకసారి చార్జింగ్ చేస్తే 116 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. కైనెటిక్ డీఎక్స్, డీఎక్స్ ప్లస్ పేరుతో అందుబాటులో ఉండనున్న ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ధర వరుసగా రూ.1,11,449, రూ.1,17,499 (పుణె ఎక్స్‌షోరూమ్) గా ఉన్నాయి. కాగా ఉత్పత్తిని, సేల్స్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాబోయే 18 నెలల కాలంలో రూ.177 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నామని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ అజింక్యా ఫిరోడియా ఈ సందర్భంగా చెప్పారు. అప్పటికి 6-8% మార్కెట్ వాటాతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగంలో మూడు అగ్రగామి కంపెనీల్లో ఒకటిగా నిలవాలన్నది తమ ఆకాంక్ష అన్నారు. దశలవారీగా ఉత్పత్తిని పెంచుతూ ఆ సమయానికి 1.5 లక్షల యూనిట్ల అమ్మకాల లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నట్టు చెప్పారు.

మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ లాభంలో 35 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.22.40 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.16.53 కోట్లతో పోల్చితే 35.50 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం అమ్మకాలు కూడా 22.28 శాతం వృద్ధితో రూ.196.72 కోట్ల నుంచి రూ.240.55 కోట్లకు పెరిగాయి. నిర్వహణాపరంగా సామర్థ్యాలు పెంచుకోవటంతో పాటు ఉత్పత్తుల వివిధీకరణ, వినియోగదారు ఆధారిత వ్యూహాలపై ప్రధానంగా దృష్టి పెట్టడం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ వెల్లడించింది.

పీసీబీల తయారీకి ప్రత్యేక విభాగం: విప్రో

న్యూఢిల్లీ: ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (పీసీబీ) తయారీకి అవసరమైన అధిక సామర్థ్యం గల బేస్ మెటీరియల్స్ తయారీకి కొత్త డివిజన్‌ను ప్రారంభించినట్టు విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ (విన్) ప్రకటించింది. విప్రో ఎలక్ట్రానిక్ మెటీరియల్స్‌గా వ్యవహరించే ఈ కొత్త వ్యాపార విభాగం కింద కర్ణాటకలో రూ.500 కోట్ల పెట్టుబడితో కాపర్ క్లాడ్ లామినేట్ (సీసీఎల్) తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంట్ సామర్థ్యం 60 లక్షల సీసీఎల్ పరికరాలని తెలిపింది. దేశంలోని ఎలక్ట్రానిక్స్ తయారీ విభాగంలో ఈ తరహాలో తొలి పెట్టుబడి ఇదేనని కంపెనీ సీఈఓ ప్రతీక్ కుమార్ చెప్పారు. వేగంగా వృద్ధి చెందుతున్న టెలికాం, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, కన్జ్యూమర్ డివైస్‌లు, ఇండస్ట్రియల్ సిస్టమ్స్, ఏఐ మౌలిక వసతుల అవసరాలను ఈ ప్లాంట్ తీరుస్తుంది.

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.67,000 కోట్లు

జూన్ చివరి నాటికి బ్యాంకుల్లో ఉన్న మొత్తం ఇది

న్యూఢిల్లీ: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల వద్ద అన్‌క్లెయిమ్డ్ (ఎవరూ తమవిగా క్లెయిమ్ చేయని) డిపాజిట్ల మొత్తం కొండలా పేరుకుపోతోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఈ మొత్తం రూ.67,003 కోట్లకు చేరుకుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద ఉన్న సొమ్ము రూ.58,330.26 కోట్లు కాగా ప్రైవేట్ బ్యాంకుల వద్ద ఉన్న సొమ్ము రూ.8,673.72 కోట్లు. ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయం తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.19,329.92 కోట్లు), ప్రైవేటు బ్యాంకుల్లో ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.2,063.45 కోట్లు) వద్ద గరిష్ఠంగా ఈ నిధులున్నాయి. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించిన సమాచార లభ్యతను సరళం చేసేందుకు ఆర్‌బీఐ ఉద్గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు-గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్) పేరిట కేంద్రీయ వెబ్ పోర్టల్ ఒకటి ప్రారంభించింది. ఈ పోర్టల్ ద్వారా రిజిస్టర్డ్ వినియోగదారులు అన్ని బ్యాంకుల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల సమాచారాన్ని పొందవచ్చు. జూలై ఒకటో తేదీ నాటికి 8,59,683 మంది యూజర్లు ఈ పోర్టల్‌పై రిజిస్టర్ అయ్యారు. డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ స్కీమ్, 2014 కింద నిధి నిర్వహణతో పాటు ఆ డిపాజిట్లలోని సొమ్ము వినియోగానికి సంబంధించిన అంశాలు పరిశీలించేందుకు ఒక కమిటీ ఉంటుందని మంత్రి వెల్లడించారు. డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణకు, ఆర్‌బీఐ నిర్దేశకత్వం మేరకు ఈ ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించిన ఇతర అంశాలకు ఈ నిధిని వినియోగించవచ్చు.



ఏ బ్యాంకు వద్ద ఎంత?

బ్యాంకు	సొమ్ము (రూ.కోట్లలో)
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	19,329.92
పంజాబ్ నేషనల్ బ్యాంక్	6,910.67
కెనరా బ్యాంక్	6,278.14
ఐసీఐసీఐ బ్యాంక్	2,063.45
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,609.56
యాక్సిస్ బ్యాంక్	1,360.16

'బీమా' సామర్థ్యాల పెంపు కోసమే ఎఫ్‌డీఐ పరిమితి పెంపు

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితి వంద శాతానికి పెంపు ఆ రంగం పూర్తి సామర్థ్యాలు వినియోగంలోకి వచ్చేందుకు దోహదపడుతుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు తెలిపారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ప్రపంచ వృద్ధిని మించి ఈ రంగం 7.1% వంతున వృద్ధి సాధిస్తుందని అంచనా. ఆర్థిక మంత్రి ఫిబ్రవరిలో ప్రతిపాదించిన 2025-26 కేంద్ర బడ్జెట్లో బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రస్తుత 74 శాతం నుంచి 100 శాతానికి పెంచనున్నట్టు ప్రతిపాదించారు. ఎఫ్‌డీఐ పరిమితి 74% ఉండడం వల్ల విదేశీ బీమా కంపెనీ మిగతా 26% వాటా కోసం దేశీయ భాగస్వామిని అన్వేషించుకోవలసివచ్చేది. కాని తాజా నిర్ణయం వల్ల దేశంలో బీమా కంపెనీ ఏర్పాటు చేయడం సరళం కావడంతో పాటు ఆ రంగంలోకి విదేశీ పెట్టుబడులు స్థిరంగా రావడానికి వీలు ఏర్పడుతుందని నిర్మల తెలిపారు. అలాగే టెక్నాలజీ బదిలీ కూడా తేలికవుతుందని, బీమా వ్యాప్తి, పోటీ సామర్థ్యం పెరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

10 నెలల కనిష్ఠానికి పారిశ్రామికం

న్యూఢిల్లీ/ముంబై : పారిశ్రామిక రంగం జూన్ నెలలో నిరాశావహమైన పనితీరు ప్రదర్శించింది. మైనింగ్, విద్యుత్ రంగాలు తీవ్ర వర్షాలకు ప్రభావితం కావడం ఈ రంగాన్ని కుంగదీసింది. ఫలితంగా జూన్‌లో పారిశ్రామిక వృద్ధి రేటు 10 నెలల కనిష్ఠ స్థాయి 1.5 శాతానికి పరిమితమైంది. గత ఏడాది ఆగస్టు తర్వాత ఈ రంగం వృద్ధి ఇంత కనిష్ఠ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ద్వారా మదింపు చేసే ఈ వృద్ధి రేటు గత ఏడాది జూన్‌లో 4.9% ఉంది. కాగా మే నెల పారిశ్రామికాభివృద్ధి గణాంకాలను జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) గతంలో ప్రకటించిన 1.2% నుంచి 1.9 శాతానికి సవరించింది. ఎన్‌ఎస్‌ఓ గణాంకాల ప్రకారం జూన్ నెలలో తయారీ రంగం వృద్ధి 3.5% నుంచి 3.9 శాతానికి పెరిగింది.

రెండింతలు పెరిగిన అపోలో మైక్రోసిస్టమ్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో మైక్రోసిస్టమ్స్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.17.68 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.8.42 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా రెండింతలు వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 46.49 శాతం వృద్ధితో రూ.91.78 కోట్ల నుంచి రూ.134.55 కోట్లకు పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	400	విజయవాడ	475
వరంగల్	402	గోదావరి	445
చిత్తూరు	463	విశాఖపట్నం	450
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	113
కర్నూలు	115	నెల్లూరు	118
విశాఖపట్నం	97	అనంతపురం	118
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,920 ▼	91,650 ▼	1,25,000 ▼
విజయవాడ	1,01,450 ▲	96,250 ▲	1,16,200 ▼
విశాఖపట్నం	1,00,840 ▼	91,600 ▲	1,26,000 ▼
రాజమండ్రి	99,930 ▼	91,600 ▼	1,18,000 ▼
ప్రొద్దుటూరు	98,900 ▲	90,990 ▲	1,16,300 ▼
ముంబై	98,446 ▼	90,177 ▼	1,12,984 ▼

రూ.12,000 లక్షల కోట్ల చెల్లింపులు..

65,000 కోట్ల లావాదేవీలు

గత 6 ఏళ్లలో జరిగిన డిజిటల్ పేమెంట్స్ ఇవి..



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల్లో భారత్ దూసుకెళ్తోంది. గత ఆరేళ్లలో (2019-20 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు) రూ.12,000 లక్షల కోట్లకు పైగా విలువైన 65,000 కోట్లకు పైగా డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు జరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు వెల్లడించారు. దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని మరింత పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), ఫిన్‌టెక్‌లు, బ్యాంక్‌లు, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సంబంధిత వర్గాలందరితో కలిసి పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. చిన్న నగరాలు, ఈశాన్య రాష్ట్రాలు, జమ్ము కశ్మీర్‌లో డిజిటల్ చెల్లింపుల స్వీకరణకు అవసరమైన మౌలిక వసతులను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ 2021లో పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఐడీఎఫ్)ను ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. 2025 మే 31 నాటికి పీఐడీఎఫ్ ద్వారా 4.77 కోట్ల డిజిటల్ టచ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ప్రపంచంలో అతిపెద్ద చెల్లింపుల వ్యవస్థగా యూపీఐ

కొవిడ్ సంక్షోభ సమయం నుంచి దేశంలో డిజిటల్ చెల్లింపులు ఊపందుకున్నాయి. పెద్ద నగరాల నుంచి పల్లెల వరకు అన్ని ప్రాంతాల్లోనూ డిజిటల్ చెల్లింపుల సాంకేతికత, మౌలిక వసతులు వేగంగా విస్తరించింది. దేశంలో చౌక డేటా సేవలతో స్మార్ట్‌ఫోన్ల వినియోగం అనూహ్యంగా పెరగడం ఈ విప్లవాత్మక మార్పునకు ప్రధాన చోదకంగా పనిచేసింది. ఎన్‌పీసీఐ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్ సిస్టమ్ (యూపీఐ) ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద రిటైల్ రియల్ టైమ్ చెల్లింపుల వ్యవస్థగా ఎదిగింది. ప్రపంచంలో అతిపెద్ద ఇంటర్ బ్యాంక్ పేమెంట్ సెటిల్‌మెంట్ ప్లాట్‌ఫామ్ వీసా రోజువారీ లావాదేవీల సంఖ్యకు చేరువలో ఉంది. గత నెల 2న యూపీఐ ద్వారా రికార్డు స్థాయిలో 65 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఎన్‌పీసీఐ డేటా ప్రకారం.. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మహారాష్ట్రలో అత్యధిక యూపీఐ లావాదేవీలు జరగగా.. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

కోటక్ షేర్లు పడేశాయ్..

సెన్సెక్స్ 572 పాయింట్లు పతనం ● రెండు నెలల కనిష్ఠానికి సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయి దాదాపు రెండు నెలల (జూన్ 4 తర్వాత) కనిష్ఠ స్థాయిలో ముగిశాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 687 పాయింట్లు క్షీణించింది. చివరికి 572.07 పాయింట్ల నష్టంతో 80,891.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156.10 పాయింట్లు కోల్పోయి 24,680.90 వద్ద క్లోజైంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు భారీగా క్షీణించడంతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్‌ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ఇందుకు ప్రధాన కారణం. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 నష్టపోగా.. గత వారాంతంలో నిరాశాజనక త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన కోటక్ బ్యాంక్ షేరు ఏకంగా 7.50 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టీసీఎస్ 12,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించడంతో షేరు ధర 1.76 శాతం తగ్గింది.

బీఎన్ఎస్ఎస్‌లో సెక్షన్ 35(3)ని సవరించాలి

» పార్లమెంట్‌లో ఎంపీ రఘురాం రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) యాక్టులో నిందితులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే.. వెంటనే అరెస్టులు చేపట్టేలా సెక్షన్ 35(3)ని సవరించాలని ఎంపీ రఘురాం రెడ్డి కోరారు. సోమవారం 377 నిబంధన కింద ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతానికి సెక్షన్ 498ఏ వంటి తీవ్రమైన నాన్ బెయిలబుల్ కేసులతో సహా ఏడేళ్ల వరకు శిక్షార్హమైన అన్ని కాగ్నిజబుల్ నేరాల్లో పోలీసులు ముందస్తు అరెస్టు నోటీసు జారీ చేయాలని బీఎన్ఎస్ఎస్ యాక్టు నిర్దేశిస్తుందని తెలిపారు. ఈ నిబంధన వల్ల నిందితులు.. బాధితులను బెదిరించడానికి, సాక్ష్యాలను నాశనం చేయడానికి, అరెస్టు నుంచి తప్పించుకోవడానికి అవకాశాలున్నాయని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. సెక్షన్ 35(3)లో కీలకంగా మహిళలు, పిల్లలు, ప్రజా భద్రతకు సంబంధించిన కేసులను మినహాయించాలని, నిందితులను వెంటనే మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచడానికి పోలీసులకు అనుమతి ఇవ్వాలని, ఫిర్యాదు వచ్చిన వెంటనే నోటీసు అందించేలా, అరెస్టు చేసేలా అనుమతి ఇవ్వాలని కోరారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

» పార్లమెంట్‌లో ఎంపీ కడియం కావ్య

న్యూఢిల్లీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యవస్థాపకత లక్ష్యంగా తీసుకొచ్చిన పథకాల వివరాలను తెలియజేయాలని సోమవారం లోక్‌సభలో కోరారు. ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా, పీఎంఈజీపీ, స్కిల్ ఇండియా మిషన్ వంటి జాతీయ పథకాలను తెలంగాణలో మరింత వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ కావ్య వినతికి కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ సమాధానం ఇచ్చారు. రాష్ట్రీయ యువ స్వశక్తి కరణ్ కార్యక్రమ్, నేషనల్ సర్వీస్ స్కీమ్, ఎంవై భారత్ వంటి కార్యక్రమాలు తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు.

'కమ్మ'లపై చేసిన వ్యాఖ్యలను ఖండించలేదేం?

» కేటీఆర్‌కు జెట్టి కుసుమ్‌కుమార్ ప్రశ్న

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : "బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీన ప్రతిపాదనను కేటీఆర్ తీసుకొచ్చారన్న సీఎం రమేష్.. ఈ సందర్భంగా కమ్మ సామాజిక వర్గంపైన కేటీఆర్ అసభ్య పదజాలాన్ని వాడారని చెప్పుకొచ్చారు... అయితే విలీన ప్రతిపాదన విషయంలో సీఎం రమేష్ వ్యాఖ్యలను ఖండించిన కేటీఆర్.. కమ్మ సామాజికవర్గంపై వ్యాఖ్యల అంశాన్ని ఎందుకు ఖండించలేదు? అంటే కమ్మ సామాజిక వర్గంపై కేటీఆర్ నిజంగానే వ్యాఖ్యలు చేశారా?" అంటూ కమ్మ గ్లోబల్ ఫెడరేషన్(కేజీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ్‌కుమార్ నిలదీశారు. ఆయనలో నెలకొన్న ఈ అహంకార పూరిత ధోరణే ప్రతిపక్షంలో కూర్చోబెట్టిందన్నారు. అధికారం కోల్పోవడంతో విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. అలాగే కమ్మ సామాజిక వర్గంపై కేటీఆర్ అసభ్య పదజాలం వాడినట్లు చెబుతున్న సీఎం రమేష్.. ఆ వ్యాఖ్యలకు ఆధారాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు కమ్మ సామాజికవర్గం ఓట్లు అవసరం లేదా? అని ఈ సందర్భంగా ప్రశ్నించారు.

రిజర్వేషన్లపై కేంద్రాన్ని నిలదీయలేదేం?: మేడిపల్లి

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చిత్తశుద్ధే ఉంటే.. బీసీలకు 42% రిజర్వేషన్లకోసం కేంద్రంతో ఎందుకు పోరాటం చేయట్లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. దీనిపై కేంద్రాన్ని నిలదీసేందుకు తమతో ఎందుకు కలిసి రావట్లేదని సోమవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో అన్నారు. బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందంటున్న కేటీఆర్.. పదేళ్ల అధికారంలో ఉండి బీసీల గురించి ఏనాడైనా మాట్లాడారా? అని నిలదీశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే.. కేటీఆర్ ఆ ఓటును బీజేపీకి అమ్ముకుంటాడని మేడిపల్లి సత్యం అన్నారు.

కేటీఆర్.. భాష మార్చుకో: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపైన పిచ్చికుక్కలాగా మాట్లాడుతున్న కేటీఆర్.. ఇకనైనా ఆయన భాష, యాస మార్చుకుంటే మంచిదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. తాము కనుసైగ చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారని హెచ్చరించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో 'అందుబాటులో ప్రజా ప్రతినిధులు' అనే కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడేళ్లు కాదు.. 33 ఏళ్లయినా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 వేల స్కూళ్లు మూతపడ్డాయని, సంక్షేమ హాస్టళ్లలో 50 మంది విద్యార్థులు చనిపోయినప్పుడు హరీశ్‌రావు ఎందుకు పరామర్శకు పోలేదని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో అన్ని జెడ్పీ స్థానాలనూ కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

మత్తు అలవాటు చేసి.. జల్సాలు

» డ్రగ్స్ కోసం హైదరాబాద్‌కు వచ్చి ఎంజాయ్

» ప్రధాన సూత్రధారితో వచ్చిన స్నేహితులు

» ఎంపీ స్టిక్కర్ ఉన్న కారులో షికార్లు

» కొండాపూర్ డ్రగ్స్ కేసులో విస్తుపోయే విషయాలు



హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని సర్వీస్ అపార్టుమెంట్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఏపీకి చెందిన ముఠాను ఎక్సైజ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు అశోక్ నాయుడు అలియాస్ వాసు, డ్రగ్ పెడ్లర్లు రాహుల్, ఇమ్మాన్యుయేల్‌తో పాటు సమ్మెల సాయికృష్ణ, నాగెళ్ల లీలామణికంఠ, హిల్టన్ జోసఫ్ రేల్స్, అడపా యశ్వంత్ శ్రీదత్త, తోట కుమారస్వామి, నందం సుమంత్ తేజలు పోలీసుల అదుపులో ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజాకు చెందిన అప్పికట్ల అశోక్ కుమార్ నాయుడుగా పోలీసులు గుర్తించారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన అతడు.. కెంగర్ రాహుల్, ఉన్నాటి ఇమ్మాన్యుయేల్ అలియాస్ అనిల్ అలియాస్ ప్రవీణ్ కుమార్ అలియాస్ మన్నేల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నాడు. స్నేహితులతో పాటు పలువురు యువతులకు మత్తు పదార్థాలను అలవాటు చేస్తున్నాడు. స్నేహితులను తీసుకొని వారాంతాల్లో నగరానికి వచ్చి సర్వీస్ అపార్టుమెంట్లలో గదులు అద్దెకు తీసుకొని జల్సాలు చేస్తున్నట్లు తేలింది. ఇటీవల తనకున్న భూమిలో కొంత అమ్మేసిన నిందితుడికి సుమారు రూ.20 కోట్ల వరకు వచ్చినట్లు తెలిసింది. దాంతో అతడి జల్సాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. మాదక ద్రవ్యాలకు అలవాటుపడి అతడి వలలో చిక్కిన యువతులు, స్నేహితులు ఆ బలహీనతలో భాగంగా అతడి వెంట నగరానికి వచ్చి పార్టీలు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల ఒక యువతిని ప్రేమ పేరుతో వంచించిన యువకుడు.. ఆమెకు భారీగా డబ్బులు ముట్టజెప్పి వదిలించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బలహీనతగా మారిన మత్తు..

ఈ ముఠాలో ఇద్దరు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఓ యువతి ఈవెంట్స్‌లో భాగంగా నిందితులకు పరిచయం కాగా.. మరొకరు తల్లి మృతి చెందడంతో మత్తుకు అలవాటుపడినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆమె ప్రధాన నిందితుడితో కలిసి డ్రగ్స్ పార్టీ కోసం నగరానికి వచ్చిందని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఆ యువతి బలహీనతను నిందితులు అవకాశంగా మార్చుకున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.

ఎంపీ కారు దుర్వినియోగం..

నిందితులు వినియోగించిన రెండు కార్లలో ఎంపీ స్టిక్కర్ ఉన్న వాహనం(ఏపీ39ఎస్ఆర్0001) ఏపీకి చెందిన ఎంపీదిగా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడికి ఎంపీ కుటుంబంతో సత్సంబంధాలు ఉండటంతో అవసరమైనప్పుడు ఓ కారును వినియోగిస్తున్నట్లు తెలిసింది. కేసు వివరాలు బయటకు పొక్కకుండా పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు.

అప్పుడో మాట.. ఇప్పుడో మాట!

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాట మార్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

» గతంలో కేసీఆర్‌పై ఫిర్యాదు.. ఇప్పుడు ట్యాపింగ్ చేయించలేదని వ్యాఖ్య

» సిట్ ఎదుట విచారణకు హాజరు

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ పోలీసు ఉన్నతాధికారి, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట మార్చారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారంటూ ఫిర్యాదు చేసిన ఆయన.. బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెప్పడం విశేషం. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహచర మంత్రులతోపాటు తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రవీణ్‌కుమార్ గతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న విషయం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేయడమే కాకుండా పలు నియోజకవర్గాల నుంచి బీఎస్పీ అభ్యర్థులను బరిలో నిలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోన్‌ను హ్యాక్ చేస్తోందని, ట్యాపింగ్‌కు పాల్పడుతోందంటూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ప్రవీణ్‌కుమార్ నాటి డీజీపీ, ఎన్నికల సంఘంతో పాటు పంజాగుట్ట పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేసి, ఆయన వాంగ్మూలాన్ని కూడా తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తును ముమ్మరం చేసిన సిట్ అధికారులు.. గతంలో ఆయన ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలోనే విచారణకు హాజరు కావాలంటూ రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. సోమవారం ప్రవీణ్‌కుమార్ జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి వచ్చారు. విచారణ ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడారు. ట్యాపింగ్ కేసులో మాట మార్చేశారు. బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఫోన్లను ట్యాపింగ్ చేయలేదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే క్యాబినెట్ మంత్రులతో పాటు తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. పెగాసెస్ వంటి సాఫ్ట్‌వేర్, డార్క్‌వెబ్‌సైట్‌లో కొన్ని అరుదైన టూల్స్ ఉపయోగించి ప్రైవేట్ వ్యక్తులతో ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌ను పావుగా వాడుకుంటోందన్నారు. అందుకే రేవంత్‌రెడ్డి చేస్తున్న ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరపాలని కోరినట్లు చెప్పారు. రేవంత్ చేసే ఫోన్ ట్యాపింగ్‌కు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ మద్దతు కూడా ఉందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసే ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నాయని చెప్పారు. మంత్రులతో పాటు వ్యాపారవేత్తలు, ప్రముఖులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారంటూ సౌత్‌ఫస్ట్‌లో ప్రచురించిన వార్తల ఆధారంగా ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేస్తానన్నారు. బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయాలన్న కుట్రలోభాగంగానే ట్యాపింగ్ కేసును తెరపైకి తెచ్చారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు, బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.

ఐటీలో ఉద్యోగాల ఊచకోత!

టెకీల పాలిట భస్మాసుర హస్తంగా ఏఐ.. టీసీఎస్‌లో 12,000 మందికి ఉద్వాసన

ఇదే బాటలో మిగతా కంపెనీలు?

భవిష్యత్‌లో 3లక్షల ఉద్యోగాలకు ఎసరు!?



ఐటీ ఉద్యోగమంటే నిన్న మొన్నటి వరకు పెద్ద క్రేజ్. లక్షల్లో జీతం. వారానికి ఐదు రోజుల పని. ఏటా జీతాల పెంపు, రెండు మూడేళ్లకు ఒకసారి ప్రమోషన్లు. ఆ వ్యవహారమే వేరుగా ఉండేది. ఇప్పుడదంతా గతం. ఇప్పుడు ఉన్న ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి. ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందోనని హడలిపోతున్నారు. ఆటోమేషన్, కృత్రిమ మేథ(ఏఐ) కారణంగా దేశంలో లక్ష నుంచి మూడు లక్షల ఐటీ ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందన్న వార్తలు వారిని మరింత భయపెడుతున్నాయి. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) 12,000 మందికి పైగా ఉద్యోగులను ఇంటికి పంపించబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు కంపెనీని సిద్ధం చేయాలంటే ఈ చర్య తప్పడం లేదని తెలిపింది. టీసీఎస్ చేసిన ఈ ప్రకటన ఐటీ రంగంలో పెను సంచలనంగా మారింది. త్వరలో మిగతా ఐటీ కంపెనీలూ ఇదే బాట పట్టబోతున్నాయన్న వార్తలు ఐటీ ఉద్యోగులకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి.

కొత్త టెక్నాలజీల ప్రభావం

ఐటీ రంగంలో ఇప్పుడు ఆటోమేషన్, ఏఐ టెక్నాలజీలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ టెక్నాలజీల పుణ్యమా అని పునరావృత(రిపిటేటివ్) పనుల్లో ఉద్యోగుల అవసరం లేకుండా పోతోంది. మిగతా పనుల్లోనూ ఐటీ కంపెనీలు ఏఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. అందుకోసం ఉన్న ఉద్యోగులకే కొత్త డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి వినియోగించుకుంటున్నాయి. ఆ టెక్నాలజీలపై పట్టు సాధించలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. టీసీఎస్ తీసివేతలకు ఇది కూడా ఒక కారణమని తెలుస్తోంది. ఆర్థిక అనిశ్చితి కూడా ఐటీ ఉద్యోగాలకు ఎసరు పెడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో అమెరికా, ఐరోపా దేశాల్లో అనిశ్చితి మరింత పెరిగింది. దీంతో అక్కడి కంపెనీల నుంచి భారత ఐటీ కంపెనీలకు పెద్దగా ప్రాజెక్టులు రావడం లేదు. దీంతో భారత్‌లోని ఐటీ కంపెనీల్లో బెంచ్ మీద ఉండే పనిలేని ఉద్యోగుల సంఖ్య పెరిగిపోతోంది. వీరిని ఇంటికి పంపించేందుకు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. టీసీఎస్ ఇప్పటికే ప్రతి ఉద్యోగి ఏటా కనీసం 225 రోజుల పాటు ఏదో ఒక ప్రాజెక్టుపై పని చేయాలని స్పష్టంచేసింది. ఏ ఉద్యోగి అయినా 35 రోజులకు మించి బెంచ్ మీద ఉంటే వారి ఉద్యోగానికి ఎసరు తప్పదని హెచ్చరించింది.

లక్ష నుంచి 11 వేలకు తగ్గిన నియామకాలు

ఐటీ, బీపీవో కంపెనీల్లో ఉద్యోగ నియామకాలు భారీగా తగ్గిపోయాయి. 2020లో దాదాపు లక్ష మందిని ఐటీ కంపెనీలు నియమించుకుంటే, 2024లో అది ఏకంగా 11,000కు పడిపోయింది. అదే సమయంలో గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు(జీసీసీ) 1.2 లక్షల మందిని నియమించుకున్నాయి. ఐటీ కంపెనీలు గతంలోలా ఫ్రెషర్లకు ప్లేస్‌మెంట్లు ఇవ్వడం లేదు. ఉన్న ఉద్యోగులకే కొత్త టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి పని కానిచ్చేస్తున్నాయి. గతంలో ఐటీ కంపెనీల ఆదాయం పెరిగే కొద్దీ, ఉద్యోగుల సంఖ్య పెరిగేది. ఇప్పుడు కంపెనీలు ఉద్యోగాలకు కోత పెడుతూ ఆదాయం పెంచుకుంటున్నాయి. టీసీఎస్ సహా అన్ని ఐటీ కంపెనీలు ఇదే బాట పడతాయని నిపుణుల అంచనా. ఇప్పుడు కోడింగ్, ప్రోగ్రామింగ్ రాసే ఏఐ టూల్స్ వచ్చేశాయి. దీంతో మిడ్, సీనియర్ ఉద్యోగులను వదిలించుకునే పనిలో ఐటీ కంపెనీలున్నాయి.

బెడిసి కొట్టిన వ్యూహం

కొవిడ్ తర్వాత ఐటీ కంపెనీలకు ఇబ్బడి ముబ్బడిగా ప్రాజెక్టులు వచ్చాయి. దాంతో వేరే కంపెనీల నుంచి కావలసిన నైపుణ్యాలు, అనుభవం ఉన్న ఉద్యోగులను రెట్టింపు జీతాలు ఇచ్చి మరీ తన్నుకుపోయాయి. అదే సమయంలో కొందరు ఐటీ ఉద్యోగులు చేస్తున్న కంపెనీకి తెలియకుండా, ఇంకో కంపెనీ ప్రాజెక్టులు చేసి రెండు చేతులా సంపాదించారు. కొవిడ్ కారణంగా ఐటీ కంపెనీలు అనుసరించిన 'ఇంటి నుంచి పని' విధానం ఉద్యోగులకు ఇందుకు బాగా కలిసివచ్చింది. ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీలతో పరిస్థితులు మారిపోయాయి. కొద్ది ఉద్యోగులతోనే ఎక్కువ ఉత్పాదకత సాధ్యమవుతోంది. దీంతో ఐటీ కంపెనీలు ఉద్యోగాల కోత ప్రారంభించాయి.

- (ఆంధ్రజ్యోతి బిజినెస్ డెస్క్)

మరీ నిరాశ వద్దు

ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు పోయినా ఏఐ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు వంటి కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని టెక్ మహీంద్రా మాజీ సీఈఓ సీపీ గుర్నానీ చెప్పడం విశేషం. "ఉద్యోగుల సంఖ్యను బట్టి కంపెనీల ఆదాయాలను అంచనా వేసే రోజులు పోయాయి. ఇక ఏఐ ఆధారంగానే వాటి ఆదాయాలను లెక్కించాల్సి ఉంటుంది" అని ఆయన చెప్పారు.

● కొంతకాలంగా ఐటీ కంపెనీల లాభాలపై ఒత్తిడి పెరిగింది. టీసీఎస్ నిర్ణయానికి ఇది కూడా ఒక కారణం. టీసీఎస్ ఉద్యోగాల కోతకు సిద్ధమైనప్పుడు ఇతర ఐటీ కంపెనీలూ అందుకు సిద్ధంగా ఉన్నట్లు భావించాలి.

- అశుతోష్ శర్మ, రీసెర్చి డైరెక్టర్, ఫారెస్టర్ కన్సల్టెన్సీ

● కొన్ని ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల పూర్తికి నైపుణ్యాల కొరత ఉం ది. ఆలోటును పూడ్చుకునేందుకు పునర్ వ్యవస్థీకరణ తప్పదు.

- సి.విజయ కుమార్, ఎండీ,హెచ్‌సీఎల్ టెక్నాలజీస్

ఉద్యోగుల తొలగింపు అన్యాయం, అక్రమం

టీసీఎస్ నిర్ణయాన్ని జాతీయ ఐటీ ఉద్యోగుల సమాఖ్య నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనెట్(ఎన్ఐటీఈఎస్) తీవ్రంగా తప్పుపట్టింది. 'ఉద్యోగులు చెల్లించాల్సిన ఈఎంఐలు, ఇతర ఆర్థిక బాధ్యతలను నిర్వర్తించడం కష్టమవుతుంది. మానసికంగా, ఆర్థికంగా వారు అనుభవించే బాధ వర్ణనాతీతం' అంటూ ఎన్ఐటీఈఎస్ జాతీయ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలూజా కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖకు రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని టీసీఎస్‌లో ఉద్యోగాల తీసివేతలు ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐటీ రంగంలో ఉద్యోగాల భద్రతకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఐటీ ఉద్యోగులు దేశవ్యాప్తంగా ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

సిగాచి పరిహారంపై హరీశ్ తప్పుడు ప్రచారం

» ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం

హైదదంరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమ ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారంపై బీఆర్ఎస్ అగ్ర నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఎ ఫహీం ఆరోపించారు. ఈ ప్రమాద మృతుల్లో 46 మంది కుటుంబాలకు రూ.లక్ష చొప్పున, మరో 15 మంది కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం చెల్లించామని సోమవారం గాంధీ భవన్‌లో మీడియాకు చెప్పారు. మృతదేహాలు అదృశ్యమైన వారి కుటుంబాలకూ రూ. 15 లక్షల చొప్పున చెల్లించినట్లు వెల్లడించారు. హరీశ్ రావు చెబుతున్న జస్టిస్ కుటుంబంలో ఆమె తండ్రికి ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసినట్లు సంగారెడ్డి కలెక్టర్ ఆధారాలిచ్చారని ఫహీం పేర్కొన్నారు. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని హరీశ్‌రావు చూస్తున్నాడన్నారు. సిగాచి ప్రమాద స్థలానికెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడే గంటల తరబడి ఉండి సహాయ చర్యలను పర్యవేక్షించారని గుర్తు చేశారు. మూసాయిపేట, కొండగట్టు ప్రమాదాల్లో ఏ ఒక్క చోటికైనా కేసీఆర్ వెళ్లాడా అని నిలదీశారు. అధికారంలో ఉన్నా, లేకున్నా బీఆర్ఎస్ నేతలకు శవ రాజకీయాలు చేయడమే తెలుసునన్నారు.

ప్రజల వద్దకు కాంగ్రెస్!

31న పరిగిలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ పాదయాత్ర

» పాల్గొననున్న మీనాక్షి

» తొలిరోజు 10 కి.మీ పాదయాత్ర

» రెండో రోజు శ్రమదానం.. కార్యకర్తలు, నేతలతో సమీక్ష

హైదరాబాద్/ వికారాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక ఎన్నికలకు క్షేత్రస్థాయి నేతలు, కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు 'ప్రజల వద్దకు కాంగ్రెస్' అనే పేరుతో టీపీసీసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టింది. తొలి విడత ఈ నెల 31 నుంచి 6 రోజుల పాటు ఉమ్మడి జిల్లాల్లో రోజుకో నియోజకవర్గం చొప్పున వారి పాదయాత్ర సాగనుంది. 'ప్రజల వద్దకు కాంగ్రెస్' పేరుతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్‌లో ఈ నెల 31 సాయంత్రం 5 గంటలకు



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి ఏఐసీసీ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ ప్రారంభించనున్నారు. 10 కి.మీ దూరం పాదయాత్రలో పాల్గొని, అదేరోజు రాత్రి ఆ రాత్రి నియోజకవర్గంలోనే వారు పల్లె నిద్ర చేస్తారు. మరునాడు ఉదయం పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయా పల్లెల్లో శ్రమదానంలో పాల్గొంటారు. తర్వాత ఒక ఫంక్షన్ హాల్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలు ఆలోచిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకల్లా మరో నియోజకవర్గానికి చేరుకుని పాదయాత్ర చేస్తారు. ఈ కార్యక్రమంలో మహేశ్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్‌తోపాటు ఆయా ఉమ్మడి జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు పాల్గొంటారు. తొలి విడతగా ఈ నెల 31న పరిగి, ఆగస్టు 1న ఆంథోల్, 2న ఆర్మూర్, 3న ఖానాపూర్, 4న చొప్పదండి, 5న వర్ధన్నపేట నియోజకవర్గాల్లో మహేష్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్ పాదయాత్ర కొనసాగనుంది. 6న వర్ధన్నపేటలో శ్రమదానం, కార్యకర్తల సమావేశంతో తొలి విడత పాదయాత్ర ముగుస్తుంది. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో 'ప్రజల వద్దకు కాంగ్రెస్' కార్యక్రమం విజయవంతానికి పార్టీ ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, పార్టీ నేతలు డాక్టర్ కేతూరి వెంకటేష్, జూలూరు ధనలక్ష్మీ, పులి అనిల్‌కుమార్‌లతో సమన్వయ కమిటీ ఏర్పాటైంది.

ఉమ్మడి జిల్లాల వారీగా మీనాక్షి భేటీలు

ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ నేతలు, ముఖ్య నాయకులతో మంగళవారం నుంచి ఏఐసీసీ ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ కొనసాగించనున్నారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ భేటీల్లో టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ సైతం పాల్గొంటారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, స్థానిక ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై వారి అభిప్రాయాలు సేకరిస్తారు.

నెలరోజులైనా పరిహారమేదీ?

» 'సిగాచి' మృతుల కుటుంబాలకు ఇంకా అందని రూ.కోటి పరిహారం



సిగాచి పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగినప్పటి చిత్రం

సంగారెడ్డి, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ఉన్న సిగాచి రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి, 46మంది చనిపోయి బుధవారానికి నెలరోజులు. నెల రోజులవుతున్నా మృతుల కుటుంబాలకు ఇంతవరకు పరిహారం అందలేదు. పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదైనా ఎలాంటి చర్యల్లేవు. ప్రమాదంపై రెండు కమిటీలను నియమించినప్పటికీ.. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణమేంటనేది తేలలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిగాచి పరిశ్రమలో జూన్ 30న భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలకు నెలరోజుల్లోగా రూ.కోటి చొప్పున పరిహారం ఇప్పిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. కంపెనీ యాజమాన్యం కూడా అంగీకరించింది. కానీ, ఇప్పటివరకు అంత్యక్రియల కోసం రూ.1.50లక్షల చొప్పున మాత్రమే ఇచ్చారు. 15కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున చెల్లించారు. డెత్ సర్టిఫికెట్లు, పంచనామా, ఎఫ్ఐఆర్ కాపీలు లేనందునే పరిహారంలో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు, గల్లంతైనట్లుగా ప్రకటించిన 8మంది కుటుంబాలకు రూ.15లక్షల చొప్పున అందజేశారు. అయితే, తమ వాళ్ల పేరిట కూడా డెత్ సర్టిఫికెట్లు ఇచ్చి రూ.కోటి పరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఇక తీవ్రగాయాలైన వారికి రూ.10లక్షల చొప్పున అంగీకరించారు కానీ, రూ.50వేలు అందజేసి చేతులు దులుపుకున్నారు.

కారణమేంటో తేల్చని కమిటీలు

సిగాచి ప్రమాద ఘటనపై నెలరోజుల్లోగా పూర్తి వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం రెండు కమిటీలను నియమించింది. ప్రమాదం జరిగిన మరుసటి రోజే సీఎస్ రామకృష్ణారావు నేతృత్వంలో సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో కూడిన కమిటీ ఏర్పాటైంది. అదే విధంగా ప్రమాద కారణాలను విశ్లేషించడానికి అనుభవం ఉన్న నిపుణులతో మరో కమిటీని నియమించారు. ఈ కమిటీ పలు మార్లు పరిశ్రమను సందర్శించినా.. ప్రమాద కారణమేంటనేది తేల్చి చెప్పలేదు. కంపెనీలో రియాక్టర్ పేలిందా.. బాయిలర్ ధ్వంసమైందా.. అన్న విషయాలపై స్పష్టత లేదు. 4 రోజుల క్రితం ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లుగా తెలిసింది. అయితే దీనికి సంబంధించి అధికారికంగా ఎలాంటి అంశం బయటకు రాలేదు.

మాకు సంబంధం లేదంటున్నారు

మా బావ సిలివేరి రవి సిగాచి కంపెనీలో సీనియర్ క్వాలిటీ మేనేజర్‌గా పనిచేసేవారు. ప్రమాదంలో గల్లంతయ్యారు. ఆయన తిరిగివస్తారని పదిరోజులు ఎదురుచూశాం. కానీ ఫలితం లేదు. ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామన్నారు. కానీ 15లక్షలు మాత్రమే ఇచ్చారు. ఎవరిని అడిగినా మాకు సంబంధం లేదంటున్నారు. మా అక్క, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ప్రభుత్వం స్పందించాలి.

-కిశోర్, మృతుడు సిలివేరి రవి బంధువు

డెత్ సర్టిఫికెట్ కూడా ఇవ్వలేదు

మాది బిహార్. నా భార్య రుక్సానా సిగాచి ప్రమాద ఘటనలో చనిపోయింది. పరిహారం కింద ఇప్పటివరకు కేవలం రూ.10లక్షలు మాత్రమే అందజేశారు. ఇప్పుడు డెత్ సర్టిఫికెట్ కూడా ఇవ్వడానికి వెనుకాముందు చేస్తున్నారు. ఎవరిని అడిగినా పట్టించుకోవట్లేదు. బీమా క్లెయిమ్ కావాలంటే పంచనామా, ఎఫ్ఐఆర్ కాపీలు కావాలి. అవి కూడా ఇవ్వడం లేదు.

-మొహినోద్దీన్ ఖాన్, మృతురాలి భర్త

సిగాచి యాజమాన్యంతో రేవంత్ కుమ్మక్కు

» ఇంకా చర్యలెందుకు తీసుకోలేదు

» వెంటనే పరిహారమివ్వాలి: హరీశ్‌రావు

సంగారెడ్డి/హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సిగాచి పరిశ్రమ యాజమాన్యంతో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఘటన జరిగి నెలరోజులు కావొస్తున్నా యాజమాన్యాన్ని ఎందుకు అరెస్టు చేయడం లేదని మండిపడ్డారు. ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంగారెడ్డి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని వెంటనే చెల్లించాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. మృతులకు రూ.కోటి పరిహారం చెల్లిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. పరిశ్రమలో 46 మంది చనిపోతే ఇప్పటివరకు కేవలం 15 మందికి, అది కూడా రూ.10లక్షల చొప్పున మాత్రమే ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గల్లంతైనట్లుగా ప్రకటించిన 8 మందిని కూడా చనిపోయినట్లుగా ధ్రువీకరించి వారి కుటుంబాలకు కూడా రూ.కోటి పరిహారం అందించాలని హరీశ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మరోవైపు, సిగాచిలో ప్రమాదానికి గల కారణమేంటనేది తేల్చడంతో పాటు నిర్వాహకులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే సిగాచి పరిశ్రమ ముందే టెంటు వేసుకొని దీక్ష చేపడతామని హెచ్చరించారు. కాగా, సిగాచి కంపెనీ ప్రమాద బాధిత కుటుంబాల ఆవేదన వింటుంటే గుండె తరుక్కుపోతోందని.. గుండెలవిసేలా రోదిస్తున్న వారి ఆవేదన రేవంత్‌రెడ్డికి కనబడటం లేదా.. అని హరీశ్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. వారిని ఓదార్చాలంటే మాటలు కూడా రావడం లేదన్నారు.

పింఛన్ల పంపిణీలో కొత్త విధానం

- బయోమెట్రిక్ స్థానంలో ఫేస్ రికగ్నిషన్
- ఆధార్ ఫొటోలతో సరిపోల్చేందుకు యాప్
- 23 లక్షల మందికి.. ఆగస్టు నుంచే అమలు

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రలు పడకపోవడంతో పింఛన్ తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక నుంచి ఫేస్ రికగ్నిషన్(ముఖ గుర్తింపు) ద్వారా పింఛన్ చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. ఆగస్టు నెల నుంచే ఈ కొత్త విధానం అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 44లక్షలమంది వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, చేనేత, గీత కార్మికులు, ఫైలేరియా, హెచ్ఐవీ, డయాలిసిస్ బాధితులకు చేయూత పింఛన్ అందిస్తున్న విషయం తెలిసిందే. వీరిలో 23లక్షల మందికి బయోమెట్రిక్ ద్వారా పింఛన్ చెల్లిస్తుండగా, పట్టణాలు, నగరాల్లోని 21లక్షల మందికి నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. అయితే, బయోమెట్రిక్ యంత్రాల్లో వేలి ముద్రలు పడక గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకే కొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఫేస్ రికగ్నిషన్ కోసం టీజీ ఆన్‌లైన్ సంస్థ సాంకేతిక సహకారంతో సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ) ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా వేలిముద్రలతో పని లేకుండానే లబ్ధిదారునికి పింఛన్ చెల్లింపులు చేపట్టనున్నారు. ఈ మేరకు కొత్త విధానంలో పింఛన్లు పంపిణీ చేయనున్న 6వేల మంది పోస్ట్‌మ్యాన్‌లు, పోస్టుమాస్టర్లకు సెర్ప్ సంస్థ రూ. 13కోట్లతో ప్రత్యేకంగా ఫోన్లను కొనుగోలు చేసి అందించనుంది. ఇందులోభాగంగా లబ్ధిదారుల ఫొటోలు తీసి.. ఆధార్‌లో ఉన్న ఫొటోలతో సరిపోల్చి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం వారికి పింఛన్ డబ్బులను చెల్లిస్తారు. ఎవరికైనా ఫొటోలు తీయలేని పరిస్థితి ఉంటే.. ప్రస్తుతం అమల్లో ఉన్న బయోమెట్రిక్ విధానం ద్వారానే పింఛన్ ఇస్తారు.



జైపాల్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న బండారు దత్తాత్రేయ, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం తదితరులు

తెలంగాణ సాధనకు జైపాల్‌రెడ్డి ఎనలేని కృషి

- మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం నివాళులు

రాంగోపాల్‌పేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధన కోసం జైపాల్ రెడ్డి ఎనలేని కృషి చేశారని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా సోమవారం నెక్లెస్‌రోడ్డు పీవీ మార్గ్‌లోని ఆయన సమాధి వద్ద పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జైపాల్ రెడ్డికి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన కృషితోనే హైదరాబాద్‌కు మెట్రో రైల్ వచ్చిందన్నారు. జైపాల్‌రెడ్డి అంతటి మహనీయుడిని తెలంగాణ మరువదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ముద్దుబిడ్డ, విలువల విఖ్యాతుడు జైపాల్‌రెడ్డి అని, ఆయన చేసిన సేవలు, ఆయన మార్గం అనితర సాధ్యమని కొనియాడారు. హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి వివేక్ వెంకటస్వామి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగలతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు జైపాల్ రెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు.

ఎస్టీల నిధులను వారికే ఖర్చు చేయాలి

- గత ప్రభుత్వ హయాంలో ఆ నిధులు పక్కదారి
- మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎస్టీలకు కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో వారికే సర్దుబాటు చేయాలే తప్ప.. మైదాన ప్రాంతాలకు తరలించవద్దని మంత్రి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయని అన్నారు. దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో సోమవారం 7వ గిరిజన సంక్షేమ సలహా మండలి సమావేశం జరిగింది. మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌లతో పాటు డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్, ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేలు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. సీతక్క మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమం విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని చెప్పారు. ఇళ్లు లేని ఎస్సీలకు నిధుల కేటాయింపు పెంపు విషయాన్ని పరిశీలిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలని డిమాండ్ ఉన్న నేపథ్యంలో సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కోసం చేసే పనులకు బిల్లులను సకాలంలో చెల్లిస్తామని, ఈ విషయంలో గత ప్రభుత్వ తప్పిదాలను పునరావృతం కానివ్వబోమని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.

విద్యుత్ అధికారులంతా ఆఫీసుల్లోనే ఉండాలి

- ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ కరెంటు సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. గతేడాదితో పోల్చితే ఈ వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోందని, ఇది మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. సోమవారం దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీతో కలిసి అధికారులతో నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ నుంచి జేఎల్ఎం దాకా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

వీఐపీలు ఏడాదిలో ఒక్కసారే తిరుమలకు రావాలి:వెంకయ్య

తిరుమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): వీఐపీలు సంవత్సరానికి ఒక్కసారే శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు రావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. అప్పుడే మరింత మంది సామాన్య భక్తులకు దర్శన అవకాశం లభిస్తుందని చెప్పారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. వీఐపీలు తమ వారిని పరిమితంగా తీసుకురావడం, ఏడాదిలో ఒక్కసారే వచ్చే పద్ధతిని పెట్టుకోవడం వంటివి చేస్తే ఆలయ నిర్వహణకు ఇబ్బంది కలగకుండా ఉంటుందని సలహా ఇచ్చారు. ప్రజాప్రతినిధులందరూ దీన్ని తప్పకుండా పాటించాలన్నారు.

తెలుగు రాష్ట్రాల జల విద్యుత్ వివాదం..

విచారణ ఆగస్టు 19కి వాయిదా

న్యూఢిల్లీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీ మధ్య నెలకొన్న జల విద్యుత్ వివాదంపై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 19కి వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం అనుమతులు లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని ఆరోపిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2021లో కేంద్రానికి ఫిర్యాదు చేసింది. అదే ఏడాది జూలై 14న ఈ అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే, జల విద్యుత్ ఉత్పత్తిపై తెలంగాణ సర్కారు జారీ చేసిన జీవో 34ను రద్దు చేయాలని కోరుతూ 2024 సెప్టెంబర్ 7న ఆంధ్రప్రదేశ్ మరో పిటిషన్ దాఖలు చేసింది. ఆ రెండు పిటిషన్లను కలిపి జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ ధర్మాసనం సోమవారం విచారణ చేసింది. ఈ అంశంలో లోతైన వాదనలు అవసరమని పేర్కొంటూ, ఆగస్టు 19కి విచారణను వాయిదా వేసింది.

రాష్ట్రపతిని కలుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

చర్చించారు. అనంతరం మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరిలతో కలిసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. "రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుటుంబాలవారీగా సర్వే చేశాం. సర్వే నివేదికను సబ్ కమిటీ ద్వారా పరిశీలింపజేశాం. ఏడాదిలోపులోనే క్యాబినెట్ కూడా దానిని ఆమోదించింది. ఆ తర్వాత మార్చిలో.. స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులను అన్ని పార్టీల సహకారంతో శాసనసభలో ఆమోదించాం. వాటిని మార్చి 22న గవర్నర్ ఆమోదం కోసం పంపాం. మార్చి 30న గవర్నర్ వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. అదే సమయంలో, పంచాయతీ రాజ్ చట్టంలో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తూ ఈనెల 10న ఆర్డినెన్స్‌ను తయారు చేసి, 14న గవర్నర్‌కు పంపించాం. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి పంపినందున.. ఈ ఆర్డినెన్స్‌ను ఆమోదించాల్సిందిగా గవర్నర్‌కు విజ్ఞప్తి చేశాం. దీనిని కూడా ఆయన రాష్ట్రపతికి పంపించినట్లు మాకు సమాచారముంది. తప్పకుండా సానుకూల నిర్ణయం వస్తుందని వేచి చూస్తున్నాం" అని పొన్నం ప్రభాకర్ వివరించారు. అందుకే మూడు రోజుల పాటు ఢిల్లీలో ఉండి, రాష్ట్రపతిని కలవాలని క్యాబినెట్‌లో నిర్ణయించామని తెలిపారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలు, పార్టీకి చెందిన 100 మంది ఎంపీలం రాష్ట్రపతిని కలవాలనుకుంటున్నామని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులందరం ఢిల్లీకి వెళుతున్నామని, బీసీ మేధావులు, బీసీ నాయకులు, కుల సంఘాల నాయకులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. 42% రిజర్వేషన్లు ఆశించే ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి రావాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ ఎంపీలూ.. సహకరించండి

"స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ హైకోర్టు తేదీలను ప్రకటిస్తోంది. కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి ద్వారా బిల్లులను ఆమోదింపజేయాలని కేంద్రాన్ని క్యాబినెట్ ముక్తకంఠంతో కోరుతోంది. రాష్ట్రంలో అర్వింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, కృష్ణయ్య, లక్ష్మణ్ వంటి ఐదుగురు బీజేపీ బీసీ ఎంపీలున్నారు. పాయల్ శంకర్ బీసీ ఎమ్మెల్యేగా ఉన్నారు. రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లులను ఆమోదింపజేసుకురమ్మని వీరందరినీ అడుగుతున్నాం" అని పొన్నం విజ్ఞప్తి చేశారు. కానీ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వంటివారు విమర్శిస్తున్నారని, వాటిని బీజేపీ బీసీ నేతలు ఖండిస్తారనుకున్నామని వ్యాఖ్యానించారు. 90 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో శాసన సభ, ఇతర వేదికలపై అందరికీ విజ్ఞప్తి చేశామని, కానీ.. రాజకీయ పార్టీలు అహేతుకంగా ఉంటున్నాయని, నిజాయితీగా వ్యవహరించడం లేదని తప్పుబట్టారు. శాసన సభలో బిల్లులకు ఆమోదం తెలిపి.. ఢిల్లీకి వెళ్లే సరికి మోకాలడ్డుతున్నాయని, కడుపులో కత్తులు పెట్టుకుని, అలుముకుని చంపాలని ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయంగా బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని, అయినా... కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. "ఇది ఎవరికీ వ్యతిరేకం కాదు. కిషన్ రెడ్డి స్థానంలో బీసీకి మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారు. కిషన్‌రెడ్డే మంత్రిగా ఉండాలి. కానీ.. బీసీ రిజర్వేషన్లకు మద్దతివ్వాలి. దీనికి ఆర్.కృష్ణయ్య నాయకత్వం వహించాలి. మీ పార్టీ ఎంపీలను ఒప్పించి, ఢిల్లీకి తీసుకురావాలి. మాకు భేషజాలు లేవు. మీ వద్దకు రావడానికి సిద్ధంగా ఉన్నాం" అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం కంటే బీసీ నాయకులపైనే ఎక్కువ బాధ్యత ఉందని, దీనికి సహకరించాలని పేరుపేరునా కోరుతున్నామని అన్నారు. "మేం అవివేకంగా 42 శాతం కావాలని అడగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా సర్వే చేసింది. విమర్శలు రాకుండా మరోసారి నమోదు చేసింది. క్యాబినెట్ చర్చించింది. అయితే, బిల్లులకు రాష్ట్రపతి వద్ద కాలయాపన జరుగుతోంది. వాటిని త్వరగా ఆమోదించాలని కోరుతున్నాం" అని వ్యాఖ్యానించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కల్పనతోనే 50 శాతం పరిమితి తొలగిపోయిందని, ప్రస్తుతం బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15, ఎస్టీలకు 10 %, ఈడబ్ల్యూఎస్‌లకు 10 % చొప్పున మొత్తం 64% రిజర్వేషన్లు నడుస్తున్నాయని వివరించారు.



అప్పుడు తెలియదా?

"50 శాతం పరిమితి గురించి రాంచందర్‌రావు మాట్లాడుతున్నారు. కానీ, ఎంపిరికల్ డేటా ఉంటే.. రాష్ట్రాలు ముందుకు వెళ్లొచ్చని ఇందిరా సాహ్నీ కేసులో స్పష్టంగా చెప్పారు" అని మంత్రి పొన్నం గుర్తు చేశారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని రాంచందర్‌రావు వంటివారు ఇప్పుడు మాట్లాడుతున్నారని, మరి, శాసన సభలో బిల్లులను ఆమోదించినప్పుడు ఆ విషయం బీజేపీ నాయకులకు తెలియదా? అని నిలదీశారు. అసెంబ్లీలో మద్దతు ఇచ్చినందుకు రాంచందర్‌రావు అయినా బీజేపీ ఎమ్మెల్యేలైనా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సీఎం అంటూ ప్రకటించారని, శాసనసభాపక్ష నేత పదవిని బీసీకి ఇవ్వలేదని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ నేత ఉంటే తొలగించారని తప్పుబట్టారు. కిషన్ రెడ్డిని రాజీనామా చేయాలని అడగడం లేదని, రిజర్వేషన్లకు మద్దతివ్వాలని కోరుతున్నామని అన్నారు.

క్యాబినెట్ తీసుకున్న ఇతర నిర్ణయాలు

- రవాణా శాఖకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర సరిహద్దుల్లో మొత్తం 15 చెక్ పోస్టులు ఉన్నాయి. జాతీయ రహదారులపై రవాణాకు ఇబ్బంది లేకుండా వాటిని తొలగించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఇకపై సిబ్బందితో కాకుండా వాహన్, అడ్వాన్స్‌డ్ సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ కొనసాగుతుంది.
- కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాతోపాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. మైక్రో బ్రూవరీస్ చట్టానికి పలు సవరణలు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

బీసీలకు కేసీఆర్ ద్రోహం చేశారు

గతంలో పదేళ్లు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ బీసీలకు తీరని ద్రోహం చేశారని క్యాబినెట్ ఆక్షేపించింది. "అన్ని సామాజిక వర్గాల రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదని 2018లో పంచాయతీరాజ్ చట్టంలో ప్రత్యేక నిబంధనను పొందుపర్చారు. కేసీఆర్ తెచ్చిన ఈ చట్టం బీసీల రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారింది. కేసీఆర్ బీసీలకు చేసిన ద్రోహాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. జూలై 10న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆ చట్టాన్ని సవరించాలని నిర్ణయం తీసుకుంది. చట్ట సవరణ చేస్తూ ఆర్డినెన్సు తీసుకురావాలని తీర్మానించింది. చట్టంలో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్ నిబంధనను ఎత్తివేసేలా సవరణ ఆర్డినెన్స్ ఫైలును ఈనెల 14న గవర్నర్‌కు పంపింది. గవర్నర్ దీనిని రాష్ట్రపతి పరిశీలనకు పంపించినట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. అందుకే, రెండు బిల్లులు, ఆర్డినెన్సును వెంటనే ఆమోదించాలని రాష్ట్రపతికి క్యాబినెట్ విజ్ఞప్తి చేస్తోంది" అని ప్రభుత్వం ఓ ప్రకటనలో వివరించింది. కాగా, వ్యక్తిగత కారణాలతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశానికి హాజరు కాలేదు.

ప్రత్యేక రైలులో ఢిల్లీకి!

- ఎమ్మెల్యేలు, బీసీ సంఘాలు అందులోనే
- వీలైతే.. మంత్రులు కూడా దానిలోనే
- రాష్ట్రపతితో భేటీ తర్వాత అధిష్ఠానంతో చర్చ

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఢిల్లీ వేదికగా కేంద్రంపై ఒత్తిడి చేయాలని నిర్ణయించింది. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలోనే ఉండి కేంద్రంతో సంప్రదింపులు జరపాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆగస్టు 6న జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేయాలని తీర్మానించింది. ఇందుకు ప్రత్యేక రైలులో ఢిల్లీ వెళ్లనున్నారు. ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నాయకులంతా ఆ ప్రత్యేక రైలులోనే వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. వీలైతే మంత్రులు కూడా దానిలోనే వెళ్లనున్నట్లు తెలిసింది. క్యాబినెట్ సహా నాయకులంతా మూడు రోజులపాటు ఢిల్లీలోనే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్ల పర్యవేక్షణకు బీసీ మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు రెండ్రోజుల ముందుగానే హస్తినకు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని నిర్ణయించింది. అలాగే, రాష్ట్రపతిని కలిసిన తర్వాత అదే రోజు పార్టీ అధిష్ఠానంతో కీలకంగా చర్చించనున్నారని తెలిసింది. అధిష్ఠానం సూచనల మేరకు రిజర్వేషన్ల అంశంపై ముందుకెళ్లనున్నట్టు సమాచారం.

రూ.718 కోట్లతో మొడికుంటవాగు ప్రాజెక్టు

- సదర్‌మట్, దేవాదుల మూడో దశకూ మంత్రివర్గం ఆమోదం

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలో 13 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.718 కోట్ల అంచనా వ్యయంతో మొడికుంటవాగు ప్రాజెక్టు నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మంత్రివర్గం సమావేశమయింది. ఆ సమావేశంలో మొడికుంటవాగు రిజర్వాయర్, సీతారామ ఎత్తిపోతల పథకం సవరణ అంచనాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిర్మల్ జిల్లాలోని సదర్‌మట్ బ్యారేజీ నిర్మాణానికి రూ.676.59 కోట్ల సవరణ అంచనాలను మంత్రివర్గం ఆమోదించింది. సూర్యాపేట జిల్లాలో ముక్త్యేశ్వరపురం మేజర్, గణపవరం మేజర్, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరందించడానికి వీలుగా రూ.394.10 కోట్లతో రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకానికీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం నిర్మాణ పనులను ఇప్పటికే ప్రారంభించగా... మంత్రివర్గంలో ర్యాటిఫికేషన్‌కు ఆమోదం లభించింది. ఇక దేవాదుల ఎత్తిపోతల పథకంలోని మూడో దశ పనులకు రూ.1,395.17 కోట్లతో రెండో ప్యాకేజీ సవరణ అంచనాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

మెడికల్ సీట్లలో స్థానికులకే అవకాశం దక్కాలి

- సుప్రీం కోర్టులో ఆ దిశగా వాదనలు వినిపించండి
- ఏజీకి వైద్య శాఖ మంత్రి దామోదర విజ్ఞప్తి
- హైకోర్టు తీర్పును కొట్టేయాలని కోరనున్న సర్కారు
- జీవో 33 సరైనదేనని వాదించేందుకు సన్నద్ధం



హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేలా సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని అడ్వొకేట్ జనరల్ సుదర్శనరెడ్డికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. సోమవారం మంత్రి మండలి సమావేశం జరుగుతుండగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో స్థానికత అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. దీనిపై ఆగస్టు 5న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని, ఈ అంశంపై తక్షణమే ఏజీతో మాట్లాడాలని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి దామోదరకు సూచించారు. దీంతో మంత్రి దామోదర, ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా.. హైటెక్ సిటీలోని ఏజీ నివాసానికి వెళ్లారు. సుప్రీంకోర్టులో వాదనల కోసం అవసరమైతే సీనియర్ న్యాయవాదుల సహకారం తీసుకోవాలని ఏజీకి మంత్రి సూచించారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేలా, స్థానికులకే మెడికల్ సీట్లు దక్కేలా గతేడాది ప్రభుత్వం జీవో 33ను తీసుకొచ్చింది. తెలంగాణలో వరుసగా నాలుగేళ్ల (9వ తరగతి 12 వరకు) చదివిన వారే వైద్య విద్య ప్రవేశాలకు అర్హులని ఆ జీవో పేర్కొంది. తెలంగాణలో పది వరకు చదివి ఇంటర్ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన విద్యార్థులు.. రాష్ట్ర స్థానికత ఉండి, ఇతర రాష్ట్రాల్లో చదివిన వారు తమను స్థానికులుగా పరిగణించకపోవడంపై న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వారికి కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇస్తామని కోర్టుకు తెలిపారు. ఆ తర్వాత రెండు మూడు సార్లు విచారణ జరిగినా, కేసు కొలిక్కి రాలేదు. తాజాగా ఈ ఏడాది కూడా హైకోర్టులో కొందరు విద్యార్థులు స్థానికతపై పిల్ వేశారు. వైద్య విద్య ప్రవేశాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వారిని అనుమతించాలని హైకోర్టు సూచించింది. మరోవైపు సుప్రీంకోర్టులో కేసు వచ్చే నెల 5న మరోమారు విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో గతేడాదిలా అనుమతించడం కుదరదని, జీవో 33 ప్రకారమే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, హైకోర్టులో కేసును కొట్టేయాలని సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదించబోతోంది.

సీతారామ సవరణ అంచనాలకు ఆమోదం

హైదరాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ ఎత్తిపోతల పథకం సవరించిన అంచనాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ప్రాజెక్ట్ అంచనాలను సవరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థించారు. దీంతో ప్రాజెక్టు అంచనాలను రూ.13,057 కోట్ల నుంచి రూ.19,325 కోట్ల వరకు సవరిస్తూ అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌తో పాటు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, రాష్ట్ర మంత్రివర్గానికి తుమ్మల ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సవరించిన అంచనాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మరో 3 జిల్లాలలో గోదావరి జలాలు పరుగులు పెట్టనున్నాయి. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 11 నియోజకవర్గాలు 31 మండలాల్లో 3,29,000 ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 3,45,000 ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చి స్థిరీకరించనున్నారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలోని అన్ని పంట కాలువల ఆధునికీకరణతో పాటు మరమ్మతులు చేపట్టనున్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుల డీపీఆర్‌కు కేంద్ర జలవనరుల సంఘంలోని సాంకేతిక సలహా కమిటీ ఇప్పటికే అనుమతి కూడా ఇచ్చింది. తద్వారా పూర్తి స్థాయిలో సాగునీటిని రైతాంగానికి అందించడం, పరిశ్రమలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీటిని అందిస్తారు.

పత్తి విత్తన రైతులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

జోగులాంబ గద్వాల జిల్లా పత్తి రైతులకు పెండింగ్‌లో ఉన్న రూ.700 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని మంత్రి తుమ్మల విత్తన కంపెనీలను ఆదేశించారు. గద్వాల జిల్లా రైతులు 50 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు సాగుచేశారని, నెలలు గడిచినా చెల్లింపులు చేయలేదని స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ అంశంపై సెక్రటేరియట్‌లో విత్తన కంపెనీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.



శ్రీశైలం ప్రాజెక్టు ఐదు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు


కృష్ణా తరంగిణి తొణికిసలు!

- నదీమతల్లి పరిధిలోని ప్రాజెక్టులన్నీ వరద నీటితో నిండు కుండలా..
- నేడు తెరచుకోనున్న సాగర్ గేట్లు
- శ్రీశైలం ప్రాజెక్టుకు 2.10 లక్షలు, సాగర్‌కు 1.47 లక్షల క్యూసెక్కుల వరద

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునుని బోధనలు ఫలించిన చోట.. బౌద్ధమత వృక్షంబు పల్లవించిన చోట కృష్ణవేణి తరంగిణి ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. తొలకరి మొదలు బిరబిరా పరుగులతో తన పరిధిలోని ప్రాజెక్టులకు జలసిరితో ఓలలాడించిన కృష్ణమ్మ తాజాగా నాగార్జునసాగర్ ప్రాజెక్టునూ నింపేసింది. ఇప్పుడు నాగార్జునకొండ నుంచి దిగువకు దుమికేందుకు సిద్ధమైంది. కృష్ణానది పరిధిలోని ఆల్మట్టి నుంచి సాగర్ దాకా రిజర్వాయర్లన్నీ నిండు కుండలా మారాయి. భారీగా ప్రవాహం వస్తుండటంతో నాగార్జునసాగర్ గేట్లు మంగళవారం తెరుచుకోనున్నాయి. ఆ తర్వాత రెండంటే రెండు రోజుల్లో పులిచింతల ప్రాజెక్టు నిండనుంది. సాగర్ నుంచి ఆరుగేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజల అనంతరం మీటనొక్కి నీటిని దిగువకు వదులుతారు. కాగా, సోమవారం శ్రీశైలం ప్రాజెక్టుకు 2.10 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. జలవిద్యుదుత్పత్తికి, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి మొత్తంగా 2.10 లక్షల క్యూసెక్కుల నీటిని ఐదు గేట్లు తెరిచి బయటకు తరలిస్తున్నారు. నాగార్జునసాగర్‌కు 1.47 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. సాగర్ పూర్తిస్థాయి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా.. జలాశయంలో ప్రస్తుతం 296.57 టీఎంసీల నీరుంది. ఇక పులిచింతల ప్రాజెక్టుకు 31 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. సుంకేసుల బ్యారేజీకి 99 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 49 వేల క్యూసెక్కులు, నారాయణపూర్‌కు 43 వేలు, జూరాలకు 87 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. ఇక, గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 43 వేల క్యూసెక్కులు, సింగూరుకు 1860, నిజాంసాగర్‌కు 1617, మిడ్ మానేరుకు 1130, లోయర్ మానేరుకు 874, కడెం ప్రాజెక్టుకు 2470, శ్రీపాద ఎల్లంపల్లికి 874 క్యూసెక్కుల వరద వస్తోంది. మేడిగడ్డ బ్యారేజీలోకి 5.39 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది.

హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిలు

(మొదటిపేజీ తరువాయి)



పనిచేస్తున్నారు. కొత్తగా నలుగురు న్యాయమూర్తుల చేరికతో ఈ సంఖ్య 30కి చేరనుంది. గౌస్ మీరా మొహియుద్దీన్: హైదరాబాద్‌లోని బాలానగర్ హెచ్ఎంటీ టౌన్ షిప్‌కు చెందిన గౌస్ మీరా మొహియుద్దీన్.. 1969లో జన్మించారు. 1993లో ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేయడంతో పాటు తెలంగాణ హైకోర్టు ఏర్పడిన తర్వాత బార్ కౌన్సిల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఇప్పటివరకు కొనసాగుతున్నారు.

సుద్దాల చలపతిరావు: జనగామకు చెందిన సుద్దాల చలపతిరావు 1971 జూన్ 25న జన్మించారు. ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో 1998లో న్యాయవాదిగా నమోదు చేసుకున్న ఆయన.. హైకోర్టు, రంగారెడ్డి, సిటీసివిల్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు.

వాకిటి రామకృష్ణారెడ్డి: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగులో 1970 సెప్టెంబర్ 14న జన్మించారు. 1997లో న్యాయవాదిగా ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. ఆయన ప్రస్తుతం ఈడీ తరఫు న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

గాడి ప్రవీణ్‌కుమార్: ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ)గా పనిచేస్తున్న గాడి ప్రవీణ్‌కుమార్.. నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 1971లో జన్మించారు.

ఏపీ హైకోర్టుకు నలుగురు శాశ్వత జడ్జిలు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రస్తుతం అదనపు న్యాయమూర్తులుగా సేవలందిస్తున్న నలుగురికి శాశ్వత న్యాయమూర్తుల హోదా లభించింది. సుప్రీం కోలీజియం సోమవారం ఈ సిఫారసును ఆమోదించింది. ఏపీ హైకోర్టులో అదనపు జడ్జిలుగా ఉన్న జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్‌ను శాశ్వత న్యాయమూర్తులుగా సిఫారసు చేసింది.

అక్కను చంపిన తమ్ముడు!

- వైర్‌తో గొంతు బిగించి హత్య
- యువకుడితో ఆమె ఫోన్లో మాట్లాడుతుండటాన్ని చూసి ఆగ్రహం పట్టలేకే.. రంగారెడ్డి జిల్లాలో ఘటన

కొత్తూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తోడబుట్టిన అక్కను తమ్ముడు గొంతు పిసికి చంపేశాడు. ఓ యువకుడితో ఆమె ఫోన్లో మాట్లాడుతుండటాన్ని చూసి కోపం పట్టలేక ఈ దారుణానికి పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా, కొత్తూర్ పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన రుచిత (21) డిగ్రీ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు రుచితను కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయంలో రుచిత తల్లిదండ్రులు పంచాయితీ పెట్టి తన కుమార్తెతో మాట్లాడొద్దని ఆ యువకుడిని హెచ్చరించారు. ఇది జరిగాక రుచిత, ఆ యువకుడు కొన్నాళ్లు మాట్లాడుకోలేదు. సోమవారం రుచిత తల్లిదండ్రులు ఏదో పని మీద బయటకు వెళ్లారు. రుచిత ఫోన్లో మాట్లాడుతుండటాన్ని గమనించిన తమ్ముడు రోహిత్ (19) ఎందుకు మళ్లీ ఆ యువకుడితో మాట్లాడుతున్నావంటూ ఆమెను నిలదీశాడు. ఇది ఇద్దరి మధ్య వాగ్వాదానికి దారితీసింది. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయిన రోహిత్ వైర్‌తో రుచిత గొంతు బిగించాడు. ఈ ఘటనలో ఆమె ప్రాణాలొదిలింది. పోలీసులొచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి రాఘవేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.


గూగుల్ మ్యాప్స్‌లో చింతవాగుపై కనిపిస్తున్న భారీ వంతెన

వాగుపై నక్సల్స్ భారీ వంతెన నిర్మాణం

- గూగుల్ మ్యాప్స్‌లో బయటపడిన వారధి

చర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అది ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గుంజిపర్తి, కోమటిపల్లి సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతం. ఎటు చూసినా గుట్టలు, లోయలతో ఉంటుంది. ఆ దండకారణ్యంలో ప్రవహిస్తున్న అతి పెద్ద చింతవాగుపై మావోయిస్టులు భారీ వంతెన కట్టినట్లు తెలుస్తోంది. 15 రోజుల క్రితం కేంద్ర బలగాలు గూగుల్ మ్యాప్స్‌లో ఈ వారధిని గుర్తించాయి. సుమారు 60 మీటర్ల పొడవున కర్రలతో పటిష్ఠంగా దీన్ని నిర్మించారని తెలుస్తోంది. గత డిసెంబరులో ఈ వంతెన లేదని బలగాలు చెబుతున్నాయి. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఈ మధ్య కాలంలోనే దీన్ని నిర్మించుకున్నట్టు అంచనా వేస్తున్నాయి. ఈ వంతెన ఉన్న ప్రాంతం తెలంగాణ సరిహద్దుకు 30 కి.మీ. దూరంలో ఉంటుంది.

విమానం ఎమర్జెన్సీ డోర్ తెరిచేందుకు యత్నం

- తెలంగాణ యువకుడిని అదుపులోకి తీసుకున్న సిబ్బంది

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విమానం ఎమర్జెన్సీ డోర్ తెరిచేందుకు యత్నించిన తెలంగాణ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. 164 మంది ప్రయాణికులు, సిబ్బందితో చెన్నై నుంచి దుర్గాపూర్‌కు వెళ్లేందుకు ప్రైవేటు సంస్థ విమానం సోమవారం ఉదయం రన్‌వేపై నడుస్తోంది. ఇంతలో 27 ఏళ్ల యువకుడు హఠాత్తుగా ఎమర్జెన్సీ డోర్ తెరిచేందుకు యత్నించాడు. సిబ్బంది గమనించి విమానాన్ని నిలిపేశారు. తెలియక తాను ఎమర్జెన్సీ డోర్ బటన్ నొక్కానని ఆ యువకుడు చెప్పినా విమాన సిబ్బంది విశ్వసించలేదు. అతనిని విమానం నుంచి కిందకు దించేసి, పోలీసులకు అప్పగించారు. విచారణలో ఆ యువకుడు ఐఐటీలో చదువుతున్నట్టు తేలింది. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో హెల్త్‌కేర్ ఎంబీఏ నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, కిమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, దారుస్సలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్తంగా ఎంబీఏ(హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్)లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఆసక్తి కలవారు ఆగస్టు 14లోపు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్షను ఆగస్టు 24న నిర్వహిస్తామని వర్సిటీ వీసీ పేర్కొన్నారు.

పండ్ల ట్రేల కింద.. రూ.5 కోట్ల గంజాయి

- ఒడిసా నుంచి.. ఏపీ, టీజీ మీదుగా మహారాష్ట్రకు సరుకు
- ముఠా ఆటకట్టించిన ఈగల్ బృందం

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్ చేసే ముఠా ఆటను తెలంగాణ మాదక ద్రవ్యాల నిరోధక విభాగం(ఈగల్) కట్టించింది. వ్యూహాత్మకంగా పండ్ల ట్రక్కులో తరలిస్తున్న 935 కిలోల గంజాయిని సీజ్ చేసింది. దీని విలువ రూ.5 కోట్లుగా ఉంటుంది. మహారాష్ట్రకు చెందిన పవార్‌కుమార్ ఐదు ఒడిసా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తెప్పిస్తుంటాడు. ఇతను సచిన్ గంగారాం(పరారీలో ఉన్నాడు), ఒడిసాకు చెందిన విక్కీసేథ్‌తో కలిసి సరుకును తెప్పించేవాడు. రవాణాకు పవార్‌కుమార్, సమాధాన్ కాంతిలాల్ బిసే, వినాయక్ బాబా సాహెబ్ పవార్‌ను వినియోగించేవాడు. ట్రక్కులో పండ్ల ట్రేల కింద గంజాయిని దాచి, ఓ కారులో ఎస్కార్ట్‌తో ఈ ముఠా వస్తున్నట్లు ఖమ్మం ఆర్ఎన్‌సీసీ, రాచకొండ నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్‌లోని ఈగల్ యూనిట్‌కు సమాచారం అందింది. ట్రక్కు, ఎస్కార్ట్ వాహనం వివరాలతో ఈగల్ బృందాలు హైదరాబాద్ శివార్లలో.. విజయవాడ జాతీయరహదారిపై బాటసింగారం పండ్ల మార్కెట్ కూడలి వద్ద శనివారం కాపుకాచాయి. ఈ క్రమంలో గంజాయిని తరలిస్తున్న ట్రక్కును గుర్తించాయి. పండ్ల ట్రేల కింద దాచిన 455 గంజాయి ప్యాకెట్లను సీజ్ చేశాయి. వాటిల్లో 935 కిలోల గంజాయి ఉంది. దీని విలువ.5 కోట్లుగా ఉంటుందని అధికారులు తెలిపారు.

పాఠశాల విద్యార్థులకు వాట్సా్ప్‌లో ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ మెటీరియల్

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 'కోటా' స్కూల్ లెవెల్ ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్-2025 డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్లను సిద్ధం చేసినట్లు ఐఐటీ- జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఈ మేరకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌ను వాట్సాప్ ద్వారా పొందవచ్చని పేర్కొంది. మరింత సమాచారం కోసం FIT,MED అని టైపు చేసి వాట్సాప్ నంబర్ 98490 16661కు మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

ఏపీ 'మెగా పీటీఎం'.. గిన్నిస్ రికార్డు!

- డేటా ఆడిట్ తర్వాత గిన్నిస్ బృందం ధ్రువీకరణ

అమరావతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (మెగా పీటీఎం-2.0) గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించింది. మెగా పీటీఎం నుంచి సేకరించిన డేటాను ఆడిట్ చేసిన తర్వాత ఈ రికార్డును గిన్నిస్ బృందం ధ్రువీకరించింది. ఇందులో మూడు ఫొటోగ్రాఫ్‌లు, ఒక వీడియో, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఖ్య వివరాలు ఉన్నాయి. ప్రతి పాఠశాలలో డేటాకు ఆ బడికి సంబంధం లేని వ్యక్తులను సాక్ష్యులుగా పరిగణించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నియమించిన 40 మందికి పైగా ఆడిటర్లు.. 61 వేల పాఠశాలల నుంచి సమీకరించిన డేటాను విశ్లేషించారు. గిన్నిస్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని ఆగస్టు రెండో వారంలో అమరావతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నారు. ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మెగా పీటీఎం-2.0లో 53.4 లక్షల మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఇతర ఉద్యోగులు సహా మొత్తం 1.5 కోట్ల మంది మెగా పీటీఎంలో భాగస్వామ్యం అయ్యారు. అయితే గిన్నిస్ రికార్డులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఖ్యను మాత్రమే ప్రామాణికంగా తీసుకున్నారు.

నివాసం ఉండకుంటే ఇళ్ల కేటాయింపు రద్దు..?

- లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ

హైదరాబాద్ సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు నివాసం ఉండకుండా ఖాళీగా ఉంటోన్న రెండు పడకల ఇళ్ల కేటాయింపును రద్దు చేయాలని ప్రభుత్వ విభాగాలు భావిస్తున్నాయి. కేటాయించి రెండేళ్లు కావస్తోన్నా ఇప్పటికీ దాదాపు 37 ఇళ్లలో లబ్ధిదారులు ఉండడం లేదు. శివారు ప్రాంతాల్లో ఇళ్లు ఉండడం.. అక్కడకు వెళితే ఉపాధి లభిస్తుందో లేదో నని కొందరు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. సొంత ఇళ్లు ఉన్న వారికీ రెండు పడకల ఇళ్లు రావడమూ ఖాళీగా ఉండేదుకు మరో కారణంగా అధికారులు గుర్తించారు. గ్రేటర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఇటీవల మంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చినట్టు తెలిసింది. లబ్ధిదారులను ఎంపిక చేసినా ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి కేటాయింపు రద్దు చేయాలని మంత్రి సూచించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి చర్యలు ప్రారంభించాలని

గ్రేటర్‌లో పూర్తయిన ఇళ్లు	- 69700
కేటాయించినవి	- 65700
తాళాలు ఇచ్చినవి	- 60500
నివాసముంటున్నవి	- 38200
ఖాళీగా ఉన్నవి	- 22300



హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటికే కొందరికి మొదటి విడత నోటీసులు జారీ చేసినట్టు రెవెన్యూ విభాగం వర్గాలు చెబుతున్నాయి. నిర్ణీత గడువులోగా ఇళ్లలోకి వెళ్లకపోతే కేటాయింపు రద్దు చేస్తామని నోటీసుల్లో పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం మరో రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామని ఓ తహసీల్దార్ చెప్పారు. మంత్రితోనూ కలెక్టర్లు ఇదే విషయం చెప్పినట్టు సమాచారం. హైదరాబాద్ శివార్లలోని కొల్లూరు, రాంపల్లి, పీర్జాదిగూడ, దుండిగల్, డీ పోచంపల్లి తదితర ప్రాంతాల్లో భారీ ఎత్తున రెండు పడకల ఇళ్ల సముదాయాలు నిర్మించారు. కొల్లూరులో 15600 ఇళ్లు ఉండగా.. మెజార్టీ ఇళ్లు కేటాయించగా ప్రస్తుతం 11 వేల కుటుంబాలు ఉంటున్నాయని ఓ అధికారి తెలిపారు. ఇతర ప్రాంతాల్లోనూ ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. కొన్ని చోట్ల పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో ఇళ్లలో ఉండేందుకు కొందరు ఆసక్తి చూపడం లేదు. ఎంపికైన లబ్ధిదారుల్లో చాలా మంది కూలీ పని, ఇళ్లలో పని చేసుకునే వారే. నగరం విడిచి వెళితే ఉపాధి దొరకదనే ఆందోళన వారిలో కనిపిస్తోంది. నగరంలోపల నిర్మించిన ఇళ్లలో మాత్రం లబ్ధిదారులు నివాసముంటున్నారు. ఇళ్లను అద్దెకివ్వడం, అమ్మడమూ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని, అలాంటి కేటాయింపులనూ రద్దు చేసే విషయాన్ని పరిశీలించనున్నట్టు తెలిసింది.

ఫర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు!

'సృష్టి' ఘటన నేపథ్యంలో సర్కారు సీరియస్.. రాష్ట్రవ్యాప్తంగా 292 కేంద్రాలు.. గ్రేటర్ పరిధిలోనే 213

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సరగసీ ముసుగులో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ శిశువిక్రయానికి పాల్పడిన అంశాన్ని వైద్య ఆరోగ్య శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. మున్ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని సర్కారు ఆదేశించిన నేపథ్యంలో.. ఆ శాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీలు చేయాలని నిర్ణయించారు. తెలంగాణలోని 18 జిల్లాల్లో 292 ఆర్ట్ (అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ), సరొగసీ కేంద్రాలున్నాయి. వీటిలో ఆర్ట్ లెవల్ వన్‌లో 64 కేంద్రాలుండగా, లెవల్ టూలో 141, ఆర్ట్ బ్యాంకులో 45, సరగసి క్లినిక్స్ 42 ఉన్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే ఆర్ట్, సరగసీ కేంద్రాలు అత్యధికంగా 126 ఉండగా.. రంగారెడ్డిలో47, మేడ్చల్‌లో 40, వరంగల్ అర్బన్‌లో 27, కరీంనగర్‌లో 13, ఖమ్మం, నిజామాబాద్‌లో ఎనిమిదేసి చొప్పున ఉన్నాయి. మిగిలిన 11 జిల్లాల్లో 23 కేంద్రాలున్నట్లు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయ గణాంకాలు చెబుతున్నాయి. ఫర్టిలిటీ కేంద్రాల అనుమతులు 2022 ముందు వరకూ జిల్లా వైద్యాధికారి పరిధిలో ఉండేవి. ఆ తర్వాత సరగసీ చట్టం వచ్చింది. 2022 నుంచి ఇటువంటి కేంద్రాలన్నింటికి వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయమే అనుమతులు మంజూరు చేస్తోంది. అనుమతుల కోసం దరఖాస్తు చేసిన కేంద్రాలకు ఆ కార్యాలయమే తనిఖీ బృందాలను పంపుతుంది. ఆ బృందాలు తనిఖీ చేసి కమిషనర్‌కు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఫర్టిలిటీ కేంద్రాలకు అనుమతులు మంజూరు చేస్తారు. అలా అనుమతులు పొందిన కేంద్రాలు ప్రతి నెలా 5లోగా తమ వద్ద ఎన్ని స్కానింగ్స్ జరిగాయో విధిగా నివేదికలు పంపాలి. ప్రతి 3 నెలలకు లేదా ఆరు నెలలకొకమారు తమ వద్ద నిర్వహించిన ఐయూఐ, ఐవీఎఫ్, సరగసీ ప్రొసీజర్ల వివరాలను నివేదిక రూపంలో పంపాలి.


ఇష్టం వచ్చినట్టు..

రాష్ట్రంలోని పలు సంతాన సాఫల్య కేంద్రాలు ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇష్టారాజ్యంగా సరగసీ ప్రక్రియ చేపడుతున్నట్టు, ఆ పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారమైతే.. వివాహమై ఐదేళ్లు అయినప్పటికీ సహజ పద్ధతిలోగానీ, ఐయూఐ, ఐవీఎఫ్ విధానంలోగానీ సంతానం కలగని దంపతులు మాత్రమే సరగసీ ద్వారా పిల్లలను పొందడానికి అర్హులు. అటువంటి వారు ఆ విధానంలో పిల్లలను పొందడం కోసం వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. కమిషనర్ వారి దరఖాస్తులను స్వయంగా పరిశీలిస్తారు. వైద్యులిచ్చిన ధ్రువపత్రం, వారికున్న ఇతరత్రా ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని.. నిజంగా సరగసీ అవసరమే అని నిర్ధారించుకున్న తర్వాత అందుకు అనుమతిస్తారు. నిబంధనల ప్రకారం.. సరగేట్ మదర్ (అంటే పిల్లల్లేని దంపతులకు తన గర్భాన్ని అద్దెకు ఇచ్చే తల్లి) వారికి సమీప బంధువు అయి ఉండాలి. ఆమె కూడా 25-35 ఏళ్లలోపు వయసున్న మహిళ అయి ఉండాలి. ఆమెకు అప్పటికే సొంత బిడ్డ ఒకరైనా ఉండాలి. అలాంటివారే సరొగేట్ మదర్‌గా ఉండడానికి అర్హులు. అంతేకాదు.. ఒక మహిళ తన జీవితంలో ఒక్కసారి మాత్రమే సరగేట్ మదర్‌గా ఉండడానికి అర్హురాలు. డబ్బులిచ్చి బయటి వ్యక్తులను సరగేట్ మదర్‌ను నియమించుకుంటామంటే కుదరదు.

అడ్డగోలుగా అనుమతులు..

నిబంధనలు కఠినంగా ఉన్నప్పటికీ.. తనిఖీలకు వెళ్లిన అధికారులు, పెద్దమొత్తంలో డబ్బులు తీసుకుని వాటికి అనుకూలంగా నివేదికలిచ్చినట్టు.. ఆ నివేదికల ఆధారంగా గత దశాబ్ద కాలంలో పలు కేంద్రాలకు అనుమతులు మంజూరైనట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఒకరిద్దరు మహిళా అధికారులు ఇటువంటి కేంద్రాలకు అనుకూలంగా నివేదికలిచ్చేందుకు ప్రతిఫలంగా చీరలు, బంగారం తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల సుమారు కొత్తగా 16 కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్ కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీతా సత్యనారాయణ వద్దకు రాగా.. ఆ కేంద్రాలకు ఒక్కరే అధికారి వెళ్లి తనిఖీలు చేసి నివేదిక ఇచ్చినట్లు తేలింది. ఒక్క ఆఫీసరే ఎలా వెళ్తారని కమిషనర్ ప్రశ్నించినట్లు.. ఆ 16 కేంద్రాల అనుమతులను పక్కన పెట్టి.. మళ్లీ ఇద్దరు సభ్యులతో తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. అనుమతులు పొందిన కేంద్రాలు కాలపరిమితి ముగియగానే రెన్యువల్స్ చేసుకోవాలి. కానీ కొన్ని కేంద్రాలు అలా చేసుకోకుండానే నడుస్తున్నాయి. రెన్యువల్స్ చేసుకున్న వాటినే పరిశీలిస్తున్న వైద్య శాఖ.. మిగిలిన వాటిని పట్టించుకోవట్లేదు. రెన్యువల్ చేసుకోకుండా నడుస్తున్న కేంద్రాలే అక్రమాలకు పాల్పడుతున్నాయి. సృష్టి ఫర్టిలిటీ కేంద్రం కూడా ఇదే బాపతు. ఆ కేంద్రాన్ని వైద్య శాఖ నాలుగేళ్ల క్రితమే సీజ్ చేసింది. అయినా ఆ కేంద్రం దందాలను ఆపలేదు. అలాంటి వాటిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

నాగారం భూములపై విచారణ జరపబోం

- అది ప్రైవేటు వ్యవహారం: ప్రభుత్వం
- భూదాన్ భూముల లెక్కలు తేల్చండి: ధర్మాసనం
- భూదాన్ భూములనడం సరికాదు:ఐఏఎస్, ఐపీఎస్‌లు

హైదరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని వివాదాస్పద భూములపై విచారణ కమిషన్ వేసే ఉద్దేశం తమకు లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఇది వ్యక్తిగత భూవివాదమని అందులో ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. నాగారంలో సర్వే నంబర్ 181, 182, 194, 195లలో ఉన్న భూదాన్ భూములను ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారుల సహాయంతో రికార్డులు మార్చి అక్రమంగా బదిలీ చేసుకున్నారని ఆరోపిస్తూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే భూములపై నాగారంలోని వడిత్య రాములు మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భూదాన్‌బోర్డు తరఫు న్యాయవాది కిరణ్‌కుమార్ వాదిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 1.40 లక్షల ఎకరాలు దాతలు భూదానం చేశారని, అందులో 40 వేల ఎకరాలు ప్రభుత్వం పేదలకు పంచిందని తెలిపారు. పంచిన భూముల్లో అధిక శాతం ఇతరుల చేతుల్లోకి వెళ్లిందని పేర్కొన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ మంచి ఉద్దేశంతో చేసిన భూదానం అనర్హులకు వెళ్లడం భూదాన్ స్ఫూర్తిని విస్మరించడం కిందికే వస్తుందని వ్యాఖ్యానించింది. నాగారం భూములపై పూర్తి వివరాలతో రావాలని బోర్డుకు సూచించింది. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి ఈ వివాదం ప్రయివేటు అంశం కావడంతో దాంట్లో జోక్యం చేసుకోబోమని తెలిపారు. ప్రస్తుత పిటిషన్ వేయడానికి బిర్ల మల్లేశ్‌కు ఉన్న అర్హత ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. మల్లేశ్ సమాధానాలు చెప్పకపోవడంపై అసహనం వ్యక్తంచేసింది. పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌ల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, చంద్రసేన్‌రెడ్డి తదితరులు వాదనలు వినిపిస్తూ.. సర్వే నెంబరు 194లో భూదాన్ భూమే లేదన్నారు. అది గైరాన్ (ప్రభుత్వ) భూమి మాత్రమే అని పిటిషనరే చెబుతున్నప్పుడు దానిని భూదాన్ భూమి అని అనరాదని పేర్కొన్నారు. భూదాన్ భూముల పేరుతో విచారణ చేయవద్దని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

బిచ్చగాళ్ల వీర్యం.. అడ్డాకూలీల అండం!

- వీర్యం, అండాల దందాలో వికృత పార్శ్వాలు
- చదువురానివారికైతే.. బిర్యానీ పొట్లం, మందు బాటిల్
- విద్యావంతులకు రూ.4వేల వరకు చెల్లించి వీర్యం సేకరణ
- అండ దానం చేసే మహిళలకు 20-25 వేలు
- పోలీసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బిచ్చగాళ్లకు బిర్యాని.. అడ్డా కూలీలకు మద్యం.. కొంచెం చదువుకున్న వారికైతే రూ. వెయ్యి నుంచి 4 వేలు! అదే మహిళలకైతే రూ.20 వేల నుంచి రూ.25 వేల దాకా ఇస్తారు!! వీర్యం, అండాల సేకరణ పేరుతో నగరంలో జరుగుతున్న వికృత దందా ఇది!! సంతాన భాగ్యం లేక దాతల నుంచి వీర్యం, అండాల వంటివి కోరుకునేవారు.. ఆ దాతలు బాగా చదువుకున్నవారై, మంచి తెలివితేటలు కలిగినవారై ఉండాలని భావిస్తారు. కానీ.. ఈ దందా నడిపేవారు వారికి అంటగడుతున్నది బిచ్చగాళ్లు, అడ్డాకూలీల వీర్యాన్ని, అండాలను! 'ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయోసిస్టమ్ క్లినిక్' పేరుతో సికింద్రాబాద్‌లో ఈ దందా నడుపుతున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. దీనిపై లోతైన దర్యాప్తు చేయగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఈ క్లినిక్ యజమాని, మేనేజర్‌గా వ్యవహరిస్తున్న పంకజ్ సోని తన వద్ద కొంతమందిని ఏజెంట్లుగా, టెక్నీషియన్‌లుగా నియమించుకున్నాడు. వారు.. బిచ్చగాళ్లకు, అడ్డాకూలీల వంటివారికి డబ్బు ఆశ చూపించి వారి నుంచి వీర్యం, అండాలను సేకరిస్తున్నారు. ఆర్ట్ (అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ) నిబంధనల ప్రకారం ఆరోగ్యవంతులైన వ్యక్తుల నుంచి, అదీ 21 నుంచి 55 ఏళ్లలోపు ఉన్నవారి నుంచి.. వారికి అన్నిరకాల వైద్యపరీక్షలూ నిర్వహించి, ఎలాంటి జన్యువ్యాధులు, అంటువ్యాధులు లేవని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే వీర్యం సేకరించాలి. ఒక దాత నుంచి గరిష్ఠంగా 25సార్లు మాత్రమే వీర్యాన్ని సేకరించాలి. ఒక దాత నుంచి తీసుకున్న వీర్యాన్ని ఒక మహిళకు ఒకసారి గర్భధారణకు మాత్రమే ఉపయోగించాలి. కానీ.. స్పెర్మ్ క్లినిక్‌లు ఈ నిబంధనలన్నింటినీ తోసిరాజని ఒకే వ్యక్తి నుంచి వారానికొకసారి చొప్పున వీర్యం సేకరిస్తున్నాయి. ఉదాహరణకు.. ఇండియన్ స్పెర్మ్‌టెక్ ఏజెంట్లు బిచ్చగాళ్లు, అడ్డాకూలీలను సంప్రదించి.. "వారానికోసారి ఇక్కడకు వచ్చి మేం చెప్పినట్లు చేస్తే మందుతో పాటు బిర్యానీ ఇప్పిస్తాము"ంటూ వారికి ఆశపెట్టేవారని తెలిసింది. లేదంటే వాటికి సరిపడా రూ 500-1000 చేతిలో పెట్టి పంపేవారని సమాచారం. అలా వచ్చేవారు.. తమకు తెలిసిన మహిళలను తీసుకొస్తే.. వారి నుంచి అండాలు సేకరించేవారు. అది కొంచెం కష్టమైన పని కావడంతో మహిళలకు ప్రతిసారీ రూ.20 వేల నుంచి రూ.25 వేలు చెల్లించేవారని తెలిసింది. నిందితులను మరోసారి కస్టడీకి తీసుకొని విచారించేందుకు గోపాలపురం పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది.

ఇతర రాష్ట్రాల్లోనూ.. 'సృష్టి' దందా!

నగరంతో పాటు పలు రాష్ట్రాల్లో నమ్రతకు ఏజెంట్లు.. అబార్షన్ కోసం వెళ్లేవారికి డబ్బు ఆశ చూపించి వల

హైదరాబాద్ సిటీ, అడ్డగుట్ట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సరగసీ పేరిట శిశువిక్రయానికి పాల్పడిన సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసు దర్యాప్తును గోపాలపురం పోలీసులు ముమ్మరం చేశారు. ఈ సెంటర్‌ను నిర్వహిస్తున్న డాక్టర్ నమ్రత.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో మరిన్ని సంతాన సాఫల్య కేంద్రాలను నడుపుతున్నట్టు వారు దర్యాప్తులో గుర్తించారు. అన్ని ప్రాంతాల్లోనూ ఆమె తన ఏజెంట్లను నియమించుకున్నట్లు తెలిసింది. ఇక్కడ చేసినట్లుగానే.. ఆయా రాష్ట్రాల్లో కూడా ఆమె తన అక్రమ దందాను కొనసాగిస్తున్నట్టు వెల్లడైంది. తాజా కేసు విషయానికి వస్తే.. ఆమె పథకం ప్రకారమే అసోంకు చెందిన దంపతుల నుంచి బిడ్డను కొనుగోలు చేసి రాజస్థాన్‌కు చెందిన దంపతులకు విక్రయించినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అసోం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి కూలిపనులు చేసుకుంటున్న దంపతులు.. పుట్టబోయే బిడ్డ తమకు వద్దనుకుని అబార్షన్‌కు సిద్ధమయ్యారు. తమకు తెలిసిన అసోం వ్యక్తిని సంప్రదించి విషయం చెప్పారు. అప్పుడా వ్యక్తి.. "ఎలాగూ పిల్లలు వద్దనుకున్నారు. అబార్షన్ చేయించుకుంటే ఖర్చవుతుంది. నేను చెప్పినట్లు చేస్తే మీకు డబ్బు రావడంతో పాటు.. గర్భస్రావం చేయించుకోవాల్సిన అవసరం ఉండదు. మీ బిడ్డను వేరొకరికి ఇచ్చేస్తే సరిపోతుంది" అని చెప్పి ఒప్పించాడు. వారిని నమ్రత వద్దకు తీసుకెళ్లాడు. వారితో మాట్లాడిన నమ్రత ఆ దంపతులకు రూ. 90 వేలు ఇస్తానని ఆశపెట్టింది. దీంతో వారు అంగీకరించారు. అలా వారికి పుట్టిన మగబిడ్డను రాజస్థాన్ దంపతులకు అంటగట్టిన నమ్రత.. ఆ బిడ్డ సరగసీ ద్వారా పుట్టినట్టు వారికి చెప్పి, వారి నుంచి 35 లక్షలు దోచేసింది. ఈ కేసులో అరెస్టయిన వారిలో ధనశ్రీ సంతోషి, మహ్మద్ అలీ, నస్రీంబేగం.. అసోంవాసులే. ఇలా.. ఇష్టం లేకనో, స్థోమత లేదనో అబార్షన్‌కు వెళ్లే దంపతులను గుర్తించి, వారికి తన ఏజెంట్ల ద్వారా వల వేసి, డబ్బు ఆశ చూపి వారిని ఒప్పించి.. వారికి పుట్టే చిన్నారులను నమ్రత తన అక్రమ దందాకు ఉపయోగిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. నాలుగైదేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పరిధిలో ఆమెపై రెండు కేసులు నమోదయ్యాయని.. ఇదే కోవలో ఇద్దరు చిన్నారులను విక్రయించారని.. పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో.. 'సృష్టి' నిర్వాహకులకు ఇతర రాష్ట్రాల్లోని శిశువుల అక్రమ రవాణా మాఫియాతో లింకులు ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

తాళం వేశారేంటీ?

కొంతకాలంగా పిల్లల కోసం సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌కు వస్తున్న దంపతులు.. తాజా పరిణామాల నేపథ్యంలో గోపాలపురం పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. "సార్.. సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌కు తాళం వేసి ఉంది. చుట్టుపక్కల వారిని అడిగితే డాక్టర్ నమ్రతను పోలీసులు అరెస్టు చేశారని చెప్తున్నారు. అసలు అక్కడ ఏం జరుగుతోంది సార్" అంటూ పలువురు దంపతులు పోలీసులను ఆశ్రయించి వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం. అరెస్టయిన ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత, ఆమె కుమారుడు సహా.. మొత్తం ఎనిమిది మంది నిందితులనూ మరోసారి విచారించి పూర్తి ఆధారాలను, వారి అక్రమాల చిట్టాను బయటపెట్టడానికి పోలీసులు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ మేరకు న్యాయస్థానంలో కస్టడీ పిటిషన్ దాఖలు చేసినట్లు గోపాలపురం పోలీసులు తెలిపారు.

'సృష్టి' శిశు విక్రయ కేసును సుమోటోగా స్వీకరించిన హెచ్చార్సీ

- గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ కేసునూ
- ఆగస్టు 28 నాటికి నివేదికలు ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, గన్‌పార్క్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ శిశు విక్రయం కేసు.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్‌పాయిజనింగ్ కేసులను తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. టీజీహెచ్ఆర్సీ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ రెండు కేసులకూ సంబంధించి ఆగస్టు 28 నాటికి సమగ్ర నివేదికలు సమర్పించాలని.. తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ ప్రధాన కార్యదర్శిని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కమిషన్ ఆదేశించింది.

సృష్టి ఫర్టిలిటీ సెంటర్ తీరు అనైతికం

- అక్కడి వైద్యుల ఐఎంఏ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నాం
- ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ నారాయణరావు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్యం, సరగసీ ముసుగులో శిశువిక్రయానికి పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫర్టిలిటీ సెంటర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నమ్రత అనైతిక కార్యకలాపాలను ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కంభంపాటి నారాయణరావు తీవ్రంగా ఖండించారు. ఆ ఆస్పత్రిలోని వైద్యులకున్న ఐఎంఏ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వైద్యమండలి నామినేషన్ నుంచి తొలగించాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలికి కూడా అధికారికంగా సూచించనున్నట్టు తెలిపారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి, పోలీసు శాఖకు ఆయన విజ్ఞప్తి చేశారు.

'పైసల వర్షం'... పోయాం మోసం!

- నోట్ల కట్టలు కురిపిస్తామంటూ వ్యాపారి నుంచి రూ.21 లక్షలు తీసుకుని పరార్
- చేవెళ్లలో పూజల పేరుతో హడావుడి

చేవెళ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పైసల వర్షం.. కట్టలు కట్టలుగా కురుస్తుంది! వేలల్లో డబ్బు పెడితే లక్షల్లో.. లక్షల్లో డబ్బు పెడితే కోట్లలో కురిసి మురిపిస్తుంది! ఇలా ఓ ముఠా, తన మాటల వలలో ఓ వ్యాపారిని పడేసి అతడి నుంచి రూ.21లక్షలతో ఉడాయించింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలో ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వర్మ అనే వ్యాపారి.. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో స్థిరపడ్డాడు. వర్మను ఆదిలాబాద్ ప్రాంతానికి చెందిన సింగారే ధర్మేందర్, కోమండ్ల శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లాకు చెందిన ములుకుంట్ల సంజయ్‌కుమార్ హైదరాబాద్‌లో కలిసి లక్షలు పెడితే రూ.కోట్లలో రూపాయల వర్షం కురిపిస్తాం అంటూ నమ్మించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో సిద్దేశ్వర్ దత్తా, ప్రకాశ్ మరోత్రా మాధవి, దేవ్రో షిండే, ప్రశాంత్‌పట్టి పూజలు చేసి పైసల వర్షం కురిపిస్తారని చెప్పారు. రూ.21 లక్షలు పెడితే రూ.5 కోట్లు పైసల వర్షం కురిపిస్తామని నమ్మించారు. పూర్తిగా విశ్వసించిన వర్మ.. రూ.21 లక్షలు, ఓ బంగారు కాయిన్‌ను వారికిచ్చాడు. ఈనెల 25న చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ అటవీ ప్రాంతానికి వర్మ, ముఠా సభ్యులంతా కలిసి కారు వచ్చారు. అప్పటికే అక్కడ వర్మకు తెలియకుండా దుండగులు మరో కారును ముందే తెప్పించుకొని దాచారు. పూజల పేరుతో పసుపు, కుంకుమలతో ముగ్గులు వేసి.. వాటిపై నిమ్మకాయలు, అగరబత్తీలు పెట్టారు. అనంతరం వర్మను పూజలో కూర్చోబెట్టి.. దుండగులు రూ.21లక్షలతో అక్కడి నుంచి పరారయ్యారు. మోసపోయానని గుర్తించిన బాధితుడు అదేరోజు చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు.. ముఠాసభ్యుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.